ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక




"పండరీపుర భక్తులు"

2-2-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

వార్తా చిత్రాలు




రాష్ట్రపతి పట్టాభిసీతారామయ్యగారికి చెన్నపట్నంలో ప్రథమ సన్మానం చెన్నపురి ఆంధ్రమహాసభవారు జరిపారు. అధ్యక్షుడు పి. వి. రాజమన్నార్‌గారు సభ కధ్యక్షత వహించారు. డాక్టర్ పట్టాభిగారు స్వాగతపత్రానికి సమాధానం ఇస్తున్నారు.




పట్నంలోని వాణిజ్యసంఘములు జాయింటుగాచేసిన సన్మానానికి పట్టాభిగారు సమాధాన మిస్తున్నారు. ఆంధ్రవాణిజ్యమండలి అధ్యక్షుడు గుంటూరు నరసింహారావుగారు కాంగ్రెస్ అధ్యక్షుని కుడిప్రక్కన కూర్చొని ఉన్నారు.




చెన్నపురి కార్పొరేషన్‌వారు పౌరసన్మానం ఇచ్చినపుడు తీసిన ఛాయాచిత్రం. మేయరు రామస్వామినాయుడు, రాష్ట్రపతి పట్టాభి, కమీషనర్ సి. నరసింహం గార్లు వరుసగా ముందు వరుసలో నిలబడి ఉన్నారు.



రాజమహేంద్రవరం పురపాలకసంఘంవారు కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావుగారికి స్వాగతపత్రం సమర్పించినపుడు తీసిన ఛాయాచిత్రం.



న్యూఢిల్లీలో గతవారం జరిగిన కాంగ్రెసు నూతన కార్యవర్గ ప్రథమ సమావేశమునకు హాజరైన రాష్ట్రపతి డా॥ పట్టాభిసీతారామయ్యగారు. కొందరు కార్యవర్గసభ్యులు:- కామరాజనాడార్, యన్. జి. రంగా, యస్. కె. పాటిల్, గోకుల్భాయ్ భాట్, రామ్ సాహే, డా॥ పట్టాభి, నిజలింగప్ప, శంకర్రావ్ దేవ్, కళావెంకట్రావ్.



భారత జా. ప్రే. యూ. కాంగ్రెసు ఆంధ్రశాఖ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా జనవరి 23 తేదీని ఏలూరులో గిరినగర్‌లో ఆంధ్రకాంగ్రెసు కార్యవర్గ సభ్యులు శ్రీ గొట్టిముక్కల రామచంద్రరాజుగారు జాతీయపతాకం ఎగుర వేశారు. మహాసభాధ్యక్షులు సర్దార్ గౌతు లచ్చన్న, ప్రారంభకులు శ్రీ జి. రామానుజం, ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ కొప్పుల సత్యనారాయణ మొదలైనవారు హాజరయ్యారు.



ఆంధ్రరాష్ట్ర మహిళాసభ జనవరి 17, 18వ తేదీలలో ఏలూరులో జరిగినది. అధ్యక్షత వహించిన అయ్యదేవర బాలాత్రిపుర సుందరమ్మగారు. స్వాగతసంఘ అధ్యక్షురాలు శ్రీమతి మూల్పూరు చుక్కమ్మగారు, కడప రామసుబ్బమ్మగారు, ఇతర ప్రతినిధులు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

సంపుటము 41

సంచిక 21

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

Founder : K. NAGESWARA RAO

సర్వధారి సంవత్సర మాఘ శుద్ధ చవితి బుధవారము



ఆంధ్రబ్యాంకురజతోత్సవములో ప్రసంగించుచున్న రాష్ట్రపతి పట్టాభిగారు. అధ్యక్షులు ప్రకాశంగారు



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ ఫిబ్రవరినెల 2-వ తేది బుధవారము

ఇండోనేషియాపై భద్రతామండలితీర్మానం

ఇండోనేషియా హాలెండ్ వలస గనుక ఆ దేశముపై సామ్రాజ్యాధికారమును చలాయించుటకు, ప్రజల స్వాతంత్ర్య పోరాటమును తిరుగుబాటని అణచివేయుటకు డచ్ ప్రభుత్వమునకు హక్కు కలదని అంగీకరించిన తప్ప, నెదర్లెండ్స్ ప్రభుత్వము జపాన్ యుద్ధము పరిసమాప్తమైన నాటినుండి ఈనాటివరకు ఇండోనేషియాలో జరుపుచున్న సైనికచర్యలను సమర్థించుట సాధ్యము గాదు. ఇండోనేషియా ప్రజల "స్వయంనిర్ణయహక్కును" గుర్తించిన డచ్ ప్రభుత్వము తత్ క్షణము ఆ దేశమునుండి నిష్క్రమింపవలెనని తీర్మానింపక తప్పదు. కాని భద్రతామండలి అటు డచ్ ప్రభుత్వ అధికారమును, ఇటు ఇండోనేషియనుల హక్కులను గుర్తించి సమన్వయపరచుటకు ప్రయత్నించినది. భద్రతామండలి తీర్మానించినంత మాత్రమున ఇండోనేషియనులకు వెంటనే కలుగు లాభముగాని, డచ్ వారికి కలుగు నష్టముగాని ఏమియు లేదు. యుద్ధచర్యలను విరమింపవలెనని, తత్ క్షణము ఇండోనేషియా నాయకులను విడుదలచేయవలెనని భద్రతామండలి తీర్మానించి నెలరోజులైనది. యుద్ధచర్యలు పూర్తియగుటచే, ఇంకను సాగింపవలసిన అవసరము లేకుండుటచే, ఆ యుద్ధచర్యలను మాత్రము 'విరమించెను'; కాని ఇండోనేషియను నాయకులను మాత్రము విడుదలచేయలేదు. వారిని కాదని సంయుక్త ఇండోనేషియా రాష్ట్రములకు వేరొక ఫెడరల్ ప్రభుత్వమును నెలకొల్పుటకు ఇపుడు డచ్ ప్రభుత్వము ప్రయత్నించుచున్నది. భద్రతామండలి ఈ ప్రధానపరిణామమును గుర్తింపకపోవుట శోచనీయము.

న్యూఢిల్లీలో గత మాసము జరిగిన అఖిలాసియా రాజ్యముల మహాసభ చేసిన ప్రతిపాదనకు ఏమాత్రము తగ్గినను భద్రతామండలితీర్మానమును తాము అంగీకరింపజాలమని ఇండోనేషియా ప్రభుత్వ ప్రతినిధులు విస్పష్టముచేసియుండిరి. ఆసియామహాసభా తీర్మానములు ఆచరణయోగ్యమైనవని, ఆచరణసాధ్యమైనవని ఇండోనేషియా సమస్యా పరిష్కారమునకు ఆ సూచనలను అమలు జరపుట ఒక్కటే మార్గమని, ఒక్క హాలెండ్ తప్ప మిగతా రాజ్యములన్నియు అంగీకరించినవి. కాని, భద్రతామండలి స్వీయప్రతిష్ఠను నిలుపుకొనుటకు ఆసియా సభా తీర్మానములను పూర్తిగ అంగీకరింప నిరాకరించెను. 1950 వ సంవత్సరము జనవరి 1 వ తేదీ నాటికి డచ్ వారు ఇండోనేషియానుండి వైదొలగవలయునని న్యూఢిల్లీ సమావేశము తీర్మానింపగా, భద్రతామండలి ఆ గడువును మరొక ఆరుమాసములకు హెచ్చించెను. డచ్ వారు తమ దేశము నుండి పూర్తిగ నిష్క్రమించు పక్షములో—భారత దేశమునుండి బ్రిటిష్ వారు నిర్గమించిన విధముగ—ఇండోనేషియనులు మరొక ఆరుమాసములు డచ్ పరిపాలనమును సహింపగలరు. కాని ఈ లోపున డచ్ ప్రభుత్వము నిర్వర్తింపవలసిన విధులని భద్రతామండలి తీర్మానించిన విషయములను బట్టి 1950 జులై 1 వ తేదీ కైనను తమకు సర్వాధికారము సంక్రమింపగలదని, తమ దేశఐక్యమునకు భంగము కలుగదని ఇండోనేషియనులకు నమ్మకము కలుగజాలదు. ఈ విషయములో భద్రతామండలి తీర్మానము ఆసియా రాజ్యముల అభిమతమునకు పూర్తిగ విరుద్ధముగనుండుటే గాక, తన సామ్రాజ్యవిధానమును మరికొంత కాలము కొనసాగించుటకు హాలెండుకు అవకాశ మొసగినది.

ఇండోనేషియా రిపబ్లిక్ ప్రభుత్వమును గుర్తింపవలెనని ఆసియాసభ తీర్మానింపగా, మార్చి 15 వ తేదీ లోపుగ తాత్కాలిక ఫెడరల్ ఇండోనేషియా ప్రభుత్వమును ఏర్పాటు చేయవలెనని భద్రతామండలి సూచించినది. డచ్ ప్రభుత్వము ఇపుడు ఇండోనేషియాలో అట్టి ప్రభుత్వమును నెలకొల్పుటకే, జాతీయ నాయకుల నిర్బంధించి, ప్రతీప వర్గములతో మంతనములు జరపుచుండెను. భద్రతామండలి ఈ తీర్మానమువలన అట్టి చర్యలను హర్షించిన దగుచున్నది. ఇండోనేషియా సమస్యా సత్వర పరిష్కారమునకు ఉపయోగపడకపోవుటేగాక ఆ సమస్యను మరింత క్లిష్ట మొనర్చుచున్నది. న్యూఢిల్లీ సమావేశముకూడ మార్చి 15 నాటికి తాత్కాలిక ఫెడరల్ ప్రభుత్వ నిర్మాణము జరుగవలెనను సూచించినను అప్పటికి ఇండోనేషియా నుండి డచ్ సేనల ఉపసంహారము పూర్తికావలెనని, వెంటనే ఇండోనేషియా రిపబ్లిక్ ప్రభుత్వ పునరుద్ధరణ జరుగవలెనని కూడ సూచించియుండెను. ప్రధానమైన రెండు షరతులను వదలి భద్రతామండలి ఒక్క సూచనను మాత్రము అంగీకరించినది.

రాజ్యాంగపరిషత్తుకు అక్టోబరు 1 వ తేదీనాటికి ఎన్నికలు పూర్తికావలెనని ఢిల్లీసభ చేసిన సూచననుకూడా యథాతథంగా భద్రతామండలి అంగీకరించినది. ఈ విధముగ రెండు విషయములలో తప్ప భద్రతామండలి ఆసియా సభాతీర్మానాన్ని అంగీకరించినట్లే అయినది. కాని మండలి అంగీకరింపజాలని రెండు విషయములే ప్రధానమైనవి. అందొకటి డచ్ సేనల ఉపసంహారమునకు సంబంధించినది. రెండవది, హాలెండ్ భద్రతామండలి ఆదేశమును పాటింపని పరిస్థితులలో డచ్ ప్రభుత్వంపై ప్రయోగింపవలసిన ఆంక్షలకు సంబంధించినది. డచ్ సేనలు ఇండోనేషియాలో ఉన్నంతవరకు రాజ్యాంగపరిషత్తుకు జరుగు ఎన్నికలుగాని, తాత్కాలికప్రభుత్వ నిర్మాణముగాని స్వేచ్ఛావాతావరణములో జరుగనేరవు. కనుక డచ్ సేనల ఉపసంహారము ఇతర కార్యక్రమ నిర్వహణకు అత్యంతప్రధానము.

ఇంక హాలెండ్ మండలిఆదేశమును పాటింపని పరిస్థితులలో ఆంక్షల ప్రయోగింపవలసిన అవసరమును డచ్ ప్రభుత్వమే ప్రకటించినది. ఇంతవరకు భద్రతామండలి తీర్మానములను లక్ష్యముచేసియుండలేదు. హాలెండ్ ఈ వైఖరిని అనుసరించుటవలననే భద్రతామండలిని శక్తివంతము చేయవలసిన అవసర మేర్పడినదని భావించి భారత ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఆసియారాజ్యముల బలపరచెను. ఆ సమావేశము జరిగియుండుట వలననే భద్రతామండలి ఇప్పటికి అయినను డచ్ ఆధిపత్యము అంతమొందుటకు ఒక తేదీని నిర్ణయింపగల్గెను. కాని నానాజాతిసమితివలెనే ఐక్యరాజ్యసమితి కూడ సమస్యల పరిష్కారమునకు సూచనలను చేయగలిగెనే గాని ఆ సూచనలను అమలు జరుపలేకపోయెను. ఆ చరిత్ర పునరావృత్తము కాకుండ చూడవలసినబాధ్యత సమితి సభ్యులందరిపైనను గలదు.

భారతదేశ ఆర్థికసమస్యలు

నేటి భారతదేశపు ఆర్థికసమస్య ఒక సుడిగుండముగా పరిణమించినది. వస్తువుల ధరలు తగ్గి, విరివిగా అందుబాటైనగాని కార్మికులలో అశాంతి తొలగదు. వారి జీవితావసరములకు తగిన వేతనములు లభించినగాని సమ్మెలు సమసిపోవు. సమ్మెలు లేకుండ కార్మికులు పారిశ్రామికులు సహకరించి అనుక్షణము శ్రమించి ఉత్పత్తి అధిక మొనర్చినగాని, మొదటి ఆశయము సమకూరదు. ఇట్లొకదాని కొకటి ముడిపై సుడిగుండముగా తయారైనవి.

ప్రభుత్వ మీ స్థితిని విచ్ఛేదింపగల్గినగాని సమస్య పరిష్కారముకాదు. కార్మికులు పారిశ్రామికులు పరస్పరము సహకరించుకొని ప్రభుత్వముతో ఉభయులూ సహకరించి, నూతన ఆర్థిక వ్యవస్థానిర్మాణ మొనర్చవలెనని మంత్రులు చేయు విజ్ఞప్తులు అరణ్యరోదనము లైనట్లు నేటి పరిస్థితులు ఋజువొనర్చుచున్నవి. కార్మికుల దృక్పథము మారలేదు. సర్వవిషయములకు "సమ్మెయే" తరణోపాయముగ వారి స్వభావము మారిపోయినది.

ఇక యజమానులన్న, ఈ సమ్మెల నివారింపవలసిన బాధ్యత "అధికోత్పత్తికై ఆందోళనచేయు ప్రభుత్వముదే" యని, చేతులు దులుపుకొని ఉపేక్ష వహించుట కలవడిరి తప్ప, సామమున వారికోర్కెలను మన్నించు దృక్పథమే చూపుటలేదు. 1947 కన్న 1948 లో నూటికి ఇరవైపాళ్ళు, వస్తూత్పత్తి హెచ్చినదని పారిశ్రామికులు ప్రకటించినంతమాత్రమున అధికోత్పత్తితోబాటు, ధరలు తగ్గుట, జీవితవ్యయసూచిక తగ్గుట, ప్రత్యక్షముగ జరుగనంతవరకూ, ఎవ్వరునూ తృప్తిపడగలుగుట అసంభవము. ఆర్థిక సమస్య సమస్యగానే మిగిలిపోయినదనుట కిది తార్కాణము. పండిట్ నెహ్రూ తన ఉపన్యాసప్రారంభముననే ఈవిషయము ఒప్పుకొనెను.

పరిశ్రమలను జాతీయముచేయుటను గురించి ప్రభుత్వ విధానము స్పష్టమై, తాము కోరిన హామీలను ప్రభుత్వమిచ్చువరకూ సహాయనిరాకరణ విధాన మవలంబించ పారిశ్రామికవేత్తలు తీర్మానించుకొన్నట్లు, బిర్లాగారి ప్రభుత్వపు రాబడి పన్ను తగ్గిపోగల విషయపు సూచన, మత్తయిగారి, పారిశ్రామికుల ప్రత్యక్షపన్ను భారమును తగ్గింప ప్రభుత్వ మాలోచించుచున్నదన్న ప్రసంగమును వ్యక్తము చేయుచున్నవి. ప్రభుత్వ మర్థించిన ఋణము లింతవరకు పూర్తిగ సమకూడకపోవుటయు ఈ విషయమునే ధృవపర్చుచున్నది. ఇట్టి పరిస్థితిలో, ప్రభుత్వముతో హృదయపూర్వకముగ సహకరించెదమని, జి.డి. బిర్లా, సర్. హోమీ మోడీ, సర్. శ్రీరాం ప్రభృతు లిచ్చిన హామీలు, తమ విధానమును మార్చుకొన్ననే తప్ప,

ఆసియా రాజ్యాల మహాసభ

ఒక నూతన యుగానికి నాంది

డచ్చివారి దురాక్రమణ చర్యఫలితంగా ఇండొనీషియాలో యేర్పడ్డ విషమపరిస్థితిని పరిశీలించి, భద్రతామండలికి తక్షణ కర్తవ్యమును, నిర్దేశించుటకుగాను, యీ నెల 20 నుండి 23 వ తేదీవరకూ, భారతరాజధానీ నగరమున జరిగిన ఆసియా రాజ్యముల మహాసభ ప్రపంచ చరిత్రలో, ముఖ్యముగా ఆసియాఖండ చరిత్రలో అత్యంత ప్రధానమైన సంఘటన అని చెప్పవచ్చు. ఆసియారాజ్యములన్నీ జాగృతమై తమ కన్నింటికీ సంబంధించి ఏర్పడి వ్యవహారములను గురించి చర్చింపబూనుకొనుట కిదే ప్రథమం. శతాబ్దముల తరబడిగా పరదేశీయుల దాసిసత్వమున మ్రగ్గి, యిప్పుడిపుడే. స్వేచ్ఛావాయువులు పీల్చుకొనుచు బయల్పడుతున్న నవ ఆసియా, తన గడ్డపై, సామ్రాజ్యతత్వ పునరుద్ధరణ యత్నము సహింప నేరదని, ఆసియా ప్రజాకోటి ముక్తకంఠముతో ప్రపంచానికి ఎలుగెత్తి చాటిన మహాసభ యిది.

ప్రపంచ జనాభాలోనూ, విస్తీర్ణములోనూ దాదాపు సగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 19 రాజ్యాలు, యీ మహాసభయందు పాల్గొన్నవి. ఈ మహాసభను ఆసియా మహాసభ యని ఆసియా రాజ్యముల మహాసభ యని వ్యవహరించినప్పటికి, యిందు పాల్గొన్న రాజ్యములలో రెండు ఆఫ్రికాఖండ దేశములు (ఈజిప్టు, ఇథియోపియాలు) రెండు మధ్యప్రాచ్య దేశములు (సిరియా ఎమెన్ లు) రెండు దూరప్రాచ్య దేశములు, (చైనా ఫిలిప్పైన్, రెండు ఆస్ట్రేలేషియా శ్వేతజాతి రాజ్యములు (ఆస్ట్రేలియా న్యూజిలాండ్ లు) ముస్లిం రాజ్యముల సంఖ్యాధిక్యతగల యీ 19 లో 17 రాజ్యములకు ఐక్యరాజ్యసమితి సభ్యత్వమున్నది అనగా సమితి సభ్యత్వములో మూడవవంతు అన్నమాట.

వీటన్నింటికి కేంద్రము భారతదేశము. కాగా ఈ మహాసభ భారతజాతి చరిత్రలో ఒక మహోజ్వల యుగమునకు నాందీప్రాయ మనుట నిస్సంశయము. "ప్రపంచములో క్రొత్తగా స్వాతంత్ర్యము చేపట్టిన యేదేశము, భారతదేశమువలె ఒక మహాఖండమునకు నాయకత్వం వహించ గలుగుట చరిత్రలో కనివిని ఎరుగమని" హారోల్డ్ లాస్కీ అనినట్లు, ఆసియాఖండముపై, భారతదేశ నాయకత్వమునకు యీ మహాసభ సుస్థిరమైన పునాది వేసింది.

కువిమర్శలు

పీడిత ప్రజాకోటి సముద్ధరణ, విశ్వశాంతి, ఉదారఆశయములుగా గల భారతదేశము, ఇండొనీషియాకు సహాయపడి ప్రపంచశాంతికి ప్రమాదము తొలగించవలె నను లక్ష్యముతో, అఖిల ఆసియా మహాసభను యేర్పాటుచేసినది. కాని భారతదేశ సత్సంకల్పము, కొందరి కుశంకలకూ, కువిమర్శలకూ గురికాకపోలేదు.

భారతదేశమును, భారత ప్రధానిని పెద్దచేసి, ఆసియారాజ్యములను ఒక సమాఖ్యగా నిర్మించి, కమ్యూనిస్టు రష్యా నెదుర్కొనుటకు పాశ్చాత్య సామ్రాజ్య దేశములు చేయు ప్రయత్నమే యీ మహాసభ అని, పరస్పర సమాలోచనలకు, అన్యోన్య సహకారమునకు ఆసియారాజ్యములు, ఉమ్మడిగా ఒక శాశ్వత సంస్థను యేర్పాటుచేసుకొన తీర్మానించుకొనుటలో అంతర్య మిదేనని కమ్యూనిస్టులు విమర్శించుచున్నారు. మహాసభ ప్రారంభమునకు పూర్వము పాశ్చాత్యవర్గముల వారు గూడా యీ మహాసభ ఇండొనీషియా సమస్యా పరిశీలనకు మాత్రమే గాదు. అంతకు మించిన ప్రయోజనం కోసమే జరుగుచున్నదని పరస్పర వైషమ్యము గలిగి రెండూ భిన్నకూటములుగా చీలిపోయిన ప్రపంచమును, మరింత చీలదీసి మూడవకూటమును తయారుచేయుటకు ప్రయత్నం జరుగుచున్నదని, తత్పర్యవసానముగా, ఐక్యరాజ్యసమితికి పోటీగా, ఆసియారాజ్యముల సమాఖ్య యేర్పడునని అపోహ పడ్డారు. ఆసియారాజ్యములు అనైక్యతతో దేని కది సంబంధం లేకుండా ఉంటే, తమ చెప్పుచేతల్లో ఉండగలవని, అవి అన్నీ కలిసి పశ్చిమరాజ్యములవలె సమాఖ్యగా యేర్పడితే బలవత్తరమై తమకు లొంగవని, వీరి భయం. అసలు విశ్వశాంతిరక్షణకు ఐక్యరాజ్యసమితి అంటూ ఒకటి ఉండగా ఆత్మరక్షణ అనే సాకుతో, రష్యా నెదుర్కొనుటకు, ప్రాంతీయసమాఖ్యలుగా యేర్పడుటకు దారిచూపినది పశ్చిమరాజ్యములే. బ్రెస్సెల్స్ ఒడంబడికపై చేవ్రాలుపెట్టిన పశ్చిమ యూరోపియన్ రాజ్యముల (బ్రిటన్ ఫ్రాన్సు, నెదర్లాండ్, బెల్జియం లక్సెంబర్గులు) సమాఖ్య త్వరలో యేర్పడనున్న ఉత్తర అట్లాంటిక్ రక్షణసమాఖ్య యిందుకు నిదర్శనములు. అయినా ఆశియారాజ్యములన్నీ ఒక కూటమిగా తయారైతే, కమ్యూనిస్టు విజృంభణను అరికట్టుటకు అడ్డుగోడగా నిలువగలదనే సంతోషంగూడా పాశ్చాత్యులకు లేకపోలేదు.

అందుకనే, పాశ్చాత్యరాజ్యములలో యేవీ, (హాలండ్ వినా) ఆసియామహాసభను విమర్శించ సాహసించవేదు.

మహాసభ జరుగుట ఆవశ్యకమైన పరిస్థితులు, మహాసభాలక్ష్యములను వివరించుచూ అధ్యక్షుడు చేసిన ప్రసంగము, మహాసభా తీర్మానములు పరికించిన ట్లయితే, వీరి విమర్శలూ కుశంకలూ, ఎంత అర్థరహితములైనవో స్పష్టముగా తెలియగలవు.

ఇండొనీషియాపై డచ్చివారు జరుపుచున్నది కేవలం దురాక్రమణ చర్యయే నని యీ చర్య ప్రపంచశాంతి భద్రతలకు ప్రమాదకరమని, గుర్తించి భద్రతామండలి, వెంటనే యుద్ధమును విరమించి రిపబ్లికన్ నాయకులను విడుదలచేయ వలసినదిగ డచ్చిప్రభుత్వము నాదేశించినది కాని యీ ఆదేశమును డచ్చిప్రభుత్వం తృణీకరించగా డచ్చివారిని అదుపులోకి తెచ్చి, వారు తన ఉత్తర్వులను పాటించునట్లు చేయగల సామర్థ్యం లేక నిస్సహాయస్థితిలో పడి, భద్రతామండలి అనవసరకాలయాపన చేయుచూ, డచ్చివారి దురాక్రమణచర్య కొనసాగుటకు ఒకవిధముగా తోడ్పడుచున్న ట్లగుపించెను. అసలే డచ్చి సైనికచర్యకు ఆగ్రహావేశులైన ఆసియా ప్రజలకు భద్రతామండలి నిస్సహాయస్థితి అగ్నికి ఆజ్యము తోడైన ట్లైనది.

ఈ పరిస్థితిలో భద్రతామండలికి తక్షణ కర్తవ్యమును సూచించుట ఇండొనీషియా విషయంలో తామంతా ఒక్క తాటిమీదనే నడుస్తున్నామని స్పష్టము చేయుట అవసరమని, ఆసియారాజ్యములకు తోచెను. ఈ మహాసభను జరుపవలసినదిగా బర్మాప్రధాని థాకిన్ నూ సూచించగా, ఆ సూచనకు వెంటనే అందుకొని కార్యరూపందాల్చేటట్లు చేయుటకు భారత ప్రధాని పండిట్ జవహరలాల్ నెహ్రూ పూనుకొనెను. మహాసభాలక్ష్యములను, ప్రధానకర్తవ్యములను మహాసభ అధ్యక్షుడు పండిట్ నెహ్రూ యీ విధముగా వివరించెను.

మహాసభాలక్ష్యములు

"ఇండొనీషియాలో తక్షణం శాంతి యేర్పడుటకు, ఇండొనీషియా ప్రజలు వీలైనంత త్వరలో స్వాతంత్ర్యము చేపట్టుటకు వీలుగా, ప్రతిపాదనలను తయారుచేసి భద్రతామండలికి నివేదించుట, ఈ ప్రతిపాదనల ప్రకారం ఉభయపక్షములలో యే ఒకరైనా నడుచుకో నిరాకరించినట్లైతే భద్రతామండలి ఎట్టి చర్యగైకొనవలెనో సూచించుట, ఇప్పుడీమహాసభ ఏ లక్ష్యమును దృష్టియందుంచుకొని సమావేశమగుచున్నదో ఆ లక్ష్యము సిద్ధించునట్లు చూచుటకు. యిందు పాల్గొన్న రాజ్యములన్నీ పరస్పరం సమాలోచించుకొనుటకు ఉమ్మడిగా ఒక సంస్థను నెలకొల్పుకొను విషయం ఆలోచించుట యీ మూడు యిప్పుడు యీ మహాసభా ప్రధానకర్తవ్యములు.

"ఐక్యరాజ్యసమితి ప్రణాళిక నిబంధనలకు లోబడియే మన మిక్కడ యీనాడు సమావేశమగుచున్నాము. భద్రతామండలి కృషికి చేయూతనిచ్చి, ఐక్యరాజ్యసమితిని మరింత బలవత్తరం చేయుటకేగాని, సమితిని త్రోసిరాజనుటకు గాదు, మన మిక్కడ సమావేశ మగుచున్నది. ఏదేశముపైనా మనకు శత్రుత్వము లేదు. సమస్త ప్రజలకు స్వాతంత్ర్యము లభించి తద్వారా ప్రపంచమున శాంతి పెంపొందునట్లు కృషిచేయుటకే మన మిక్కడ సమావేశమైనది."

"మన పొరుగురాజ్యముయొక్క స్వాతంత్ర్యమునకు ప్రమాదము సంభవించుటచేత, మరణాసన్నమైన పూర్వయుగ సామ్రాజ్య తత్వము తిరిగి తలయెత్తి నవ్యప్రపంచ నిర్మాణోద్యమము సాగించు అభ్యుదయ శక్తులకు సవాలుగా నిలుచుటచేత, యీ ప్రమాద నివారణోపాయమును అన్వేషించుటకు, యీ సవాలు నెదుర్కొన ప్రయత్నించుటకు, మన మిప్పుడు సమావేశమైనాము"

తీర్మానములు

భద్రతామండలి కృషికి చేయూత నివ్వవలెనని, ఐక్యరాజ్యసమితిని బలపర్చవలెననే మహాసభ ఆశయం, అధ్యక్షుని ప్రసంగములోనేకాక సభ్యులందరి ప్రసంగములలోగూడ వ్యక్తమైనది.

డచ్చి దురాక్రమణ చర్యను విమర్శించినప్పటికి, సభ్యులెవరూ డచ్చిజాతిని తూలనాడలేదు. పైగా డచ్చి ప్రజల సద్గుణములను, వారి ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంలో, పాకిస్థాన్ ప్రతినిధి జఫ్రుల్లా ప్రసంగం గమనించవచ్చు.

మహాసభ తీర్మానములుగూడా ఆశించినంత ఘాటుగా లేక గాంభీర్యాన్ని హుందాతనాన్ని ప్రదర్శిస్తూ, సౌమ్యపదజాలంతో కూడుకొని ఉన్నవి. డచ్చివారిపై పోరాటములో ఇండొనీషియా రిపబ్లిక్ కు అర్థబలమును, ఆయుధబలమును చేకూర్చుటకు యీ మహాసభ తీర్మానించుకొనునని అనుకొనిరిగాని అట్టిదేమీ జరుగలేదు. మహాసభ ఆమోదించిన మూడు తీర్మానములలో మొదటిది ఇండొనీషియా సమస్యాపరిష్కార మార్గమును భద్రతా మండలికి సూచించేటటు వంటిది. మూడవది పరస్పర సమాలోచనలకు, అన్యోన్యసహకారమునకు, ఆసియారాజ్యములో ఐక్యరాజ్యసమితి ప్రణాళిక నిబంధనల చట్రమునకు లోబడి, శాశ్వతముగా ఒక ఉమ్మడిసంస్థను యేర్పాటుచేసుకోవలెనని సూచించుచున్నది.

ఇండొనీషియా రిపబ్లికన్ నాయకులను వెంటనే విడుదలచేసి వారు యథేచ్ఛగా తిరుగుటకు వీలు కల్పించవలెనని, ఇండొనీషియా రిపబ్లిక్ ప్రభుత్వమును పునరుద్ధరించవలెనని, 1949 మార్చి 1 లోగా రిపబ్లిక్ ఆక్రమిత భూభాగములనుండి వైదొలగి డచ్చిసేనలు, డిసెంబర్ 18 వ తేదీ నాటికి (దురాక్రమణచర్య ప్రారంభమైన తేదీ) పూర్వమున్న స్థావరములకు తిరోగమించవలెనని, 1949 అక్టోబర్ 1 లోగా ఎన్నికలు జరిపి రాజ్యాంగపరిషత్తును యేర్పాటుచేయవలెనని. ఎన్నికల అనంతరం, ఇండొనీషియా సంయుక్తరాష్ట్రముల ప్రభుత్వము నేర్పాటుచేసి విదేశాంగ వ్యవహారాలపైనా, సైన్యాలపైనా సర్వాధిపత్యమును, యావత్తు పరిపాలనాధికారమును ఒప్పగింతపెట్టి, 1950 జనవరి 1 తేదీ లోగా వైదొలగవలెనని, ఈ మహాసభ తన మొదటి తీర్మానముద్వారా డచ్చిప్రభుత్వమును ఆదేశించినది. డచ్చిసేనల తిరోగమనమునకు ఇండొనీషియానుంచి డచ్చివారి నిష్క్రమణకు యిదమిత్థముగా తేదీ నిర్ణయించుటవల్ల, యీ తీర్మానము డచ్చివారికి అంత్యసందేశమువలె కన్పించుటలో అతిశయోక్తి లేదు. ఈ తీర్మానమును భద్రతామండలి ఆమోదించి, డచ్చివారిచే అమలు జరిపించుటకు పూనుకొని ఉన్నట్లయితే, వచ్చేసంవత్సరం యీ రోజులకల్లా, ఆగ్నేయ ఆసియాఖండమున, మరియొక నూతన స్వతంత్ర రాజ్యము వెలయుటకు అవకాశము గలదు.

రెండవ తీర్మానము, ఈ మహాసభయందు పాల్గొన్న వివిధదేశముల తరఫున, ఐక్యరాజ్య సమితిలోనున్న ప్రతినిధులు, పరస్పరం సమాలోచించుకొనుచూ, ఇండొనీషియా సమస్యా పరిష్కారయత్నంలో ఐక్యతాబద్ధమైన వైఖరిని అవలంబించవలెనని ఆదేశించుచున్నది.

ఈ మూడింటిలో మొదటి రెండుతీర్మానములు తక్షణసమస్యకు (ఇండొనీషియాకు) సంబంధించినవి. మూడవది ఆసియారాజ్యముల భవిష్యత్తుకు సంబంధించినది. మహాసభ తీర్మానములను గురించి డాక్టరు రూములో మాటల్లో చెప్పవలెనంటే "మొరటుతనం లేకుండా దృఢ మనోనిశ్చయాన్ని, బెదరింపులకు, నిందలకు లొంగకుండా, సామ్రాజ్యతత్వంపట్ల తీవ్ర ప్రతికూలవైఖరిని మహాసభ ప్రకటించింది. మిత్రులైన వారి నెవరినీ కోల్పోకుండా ఎవరితోనూ శత్రుత్వం తెచ్చుకోకుండా, ఇండొనీషియా ఆశయాలకు అండగా నిలచింది.

ఆసియామహాసభను పర్యాలోకించేయెడల రెండు విషయములు గమనార్హములుగా కన్పించును. మొదటిది. విశాలభూభాగమునకు, కోటానుకోట్ల జనాభాకు ప్రాతినిధ్యం వహించే అనేక రాజ్యాలు, స్వల్పవ్యవధిలో మహాసభకు రాగలుగుట రెండవది, చర్చలతో కాలయాపన లేకుండా అనుకొన్న గడువులోపుగానే కార్యకలాపమును ముగించుట. ఇందుకు రెండుకారణములు కన్పిస్తున్నవి. ఒకటి, ఇండొనీషియా సమస్యా పరిష్కారమునకు తోడ్పడవలెననే గాఢమైన ఆకాంక్ష; రెండవది, అంతర్జాతీయ సమస్యలయెడ ఆసియారాజ్యములన్నీ సమైక్యతా వైఖరిని ప్రదర్శించుటకూ వీలయ్యేపని చేయాలనే దృఢసంకల్పం.

నేటి ప్రపంచం, పరస్పరవైషమ్యం గలిగిన రెండు భిన్నకూటములుగా చీలిపోయినది. పశ్చిమ రాజ్యకూటమి, కమ్యూనిస్టు రాజ్యకూటమి, ఒకదాని నొకటి నాశనంచేయాలనే ఉద్దేశ్యంతో ప్రపంచాధిపత్యంకోసం ప్రాకులాడుతున్నవి.

(21వ పేజీ చూడుడు)

హామీలుగా ఉపకరింపవు. ఆర్థిక దిగ్బంధనము ప్రయోగించి తమ కోర్కెల సాధింపదలచు పారిశ్రామికవేత్తలపట్ల, ప్రభుత్వము ప్రస్తుత విధానము విరమించి, తీవ్ర విధాన మవలంబించినగాని, ఆర్థిక సమస్యల పరిష్కారమునకు తగు మార్గము లభింపదు.

న్వక్షేమ మభిలషించి చూచికొని నన్నుగూడ, ప్రజల కొనుగోలుశక్తిని పెంపొందింపజూచుట, పారిశ్రామిక వేత్తల కత్యవసరము. భారత దేశమున ఎగుమతి వ్యాపారము తగ్గి, దిగుమతి వ్యాపారము హెచ్చుటవలన రాగల ప్రమాదమును అరికట్టుటకూడ అత్యావసరము. ధరలు స్థిరపరచుట ప్రభుత్వ సంకల్ప మని ఆర్థికమంత్రి చేసిన ప్రకటనకు, ప్రతికూలముగా ఉత్పత్తిని తగ్గించి, ధరలను పెంచచూచిన, పారిశ్రామికులకన్న ఎక్కువ నష్టపడువారుండరు.

మన ఎగుమతి వ్యాపారమును వృద్ధిచేయవలసియుండు నని ప్రభుత్వ మంత్రులు పదే పదే హెచ్చరించుచుండిరి. అంతమాత్రమున "ఎగుమతి వ్యాపారము తగ్గుటే దేశఆర్థికదుస్థితికి" కారణ మని ప్రభుత్వప్రతినిధులు సాకు చెప్పుకొనిన చాలదు. కారణము లేమైనను ఈ పరిస్థితికి, ప్రభుత్వమూ పారిశ్రామికులూ, పూర్తిబాధ్యత వహింపవలసి యుండును. వీ రిరువురి విధానములు మారినగాని దేశము దరి జేరగల అవకాశము లభించదు.

పెద్దకథ :

ఆద్యంతాలు

(First & The Last)

మూలం: గాల్స్‌వర్దీ. అనుకరణ: శ్రీ జనమంచి రామకృష్ణ.

సాయంత్రం ఆరైంది. ఆఫీసుగదిలో దీపం వెలుగుతూంది. బల్లమీద పుస్తకాలు చిందర వందరగా పడి ఉన్నాయి. దీపంవెలుగు నీడల్లో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నాడు బారిష్టరు నీలకంఠం. తెల్లవారి లేచినప్పటినుంచీ తిరిగి కోర్టువదిలే పర్యంతం ఊపిరాడకుండా ఏదో ఒక కేసులో ఆలోచనలతో పడేవుంటాడు. సందె వేళ భోజనానికి లేచేముందు, ఒక రెండు గంటలు మాత్రం పూర్తిగా, మరోధ్యాస ఏమీ పెట్టుకోకుండా విశ్రాంతి తీసుకోవడం అతని కలవాటు.

ఏదైనా కులాసాగా చదువుకుందామని ప్రయత్నించాడు. కాని మనస్సు పోయింది కాదు. చివరకు అరేబియన్ కథలు, చంటి పిల్లల్లా చదవడం ప్రారంభించాడు. చదవలేక పుస్తకం మూసివేసి రెప్పవెయ్యకుండా దీపం లోకి చూస్తూ కుర్చీలో జేలాపడ్డాడు నీలకంఠం. భోజనానికి పిలుపువచ్చేలోగా ఓ కునుకు తీద్దామని కళ్లు మూశాడు. కాని మనస్సు పరిపరి విధాల పరుగెత్త ప్రారంభించింది.

“చిట్టితల్లి శారదకి ఎప్పుడు సెలవ లిస్తారో, ఎప్పు డింటికి వస్తుందో”. అని ఒక్కగాని ఒక్క కూతుర్ని తల్చుకోడం మొదలెట్టాడు. భార్య పోయి చాలాకాల మవడంచేత, నీలకంఠం తన యావజ్జీవితాన్నీ, శారదమీదనే నిక్షిప్తం చేసుకున్నాడు. ఆవేళ రాత్రిమాత్రం, కూతురుకోసం ఎప్పుడూ లేని ప్రాకులాట ఎక్కువైంది.

అప్రయత్నంగా నీలకంఠం, తన సోదరుడు అనంతాన్ని తల్చుకోడం మొదలెట్టాడు. అనంతం బొత్తిగా స్త్రీలోలుడు; పర్యవసానం పూర్తిగా శారీరకంగా, మానసికంగా నైతికంగా చితికిపోయాడు. సప్త వ్యసనాలు, అనంతంలో మూర్తీభవించాయి. నీలకంఠం, అనంతం, ఒక్క తల్లికడుపున పుట్టిన బిడ్డలే; కాని ఇద్దరికీ ధృవాల భేదా ! పరమేశ్వరుని సృష్టివైచిత్రి కాబోలు !

ఆ కుర్చీలోనే, నీలకంఠం కాస్సేపు ఒరిగాడు ...కాని, ఏదో కదలినట్లు అలికిడి అవడంచేత, ఉబ్బెత్తుగ లేచి గది గుమ్మంవైపు చూశాడు.

“ఎవరు వారు ?” దీపం హెచ్చించి, “ఎవరక్కడ ?”

తలుపుచాటునుంచి ఆయాసంతో భయంతో “నేను...అనంతాన్ని !”

నీలకంఠం, ఎందుకో, ఒక్కసారి వణికి పోయాడు.

“నిద్రపోతున్నా.. లోపలికి రారా !”

లోపలికి ఎవరు వచ్చిందీ తెలియడంచేత నీలకంఠం లేవకండా, అనంతంవైపు తలైనా తిప్పకండా కూర్చున్నాడు. అనంతం ఎప్పుడూ ఊరికే రాడు. అతను వచ్చేడంటే, ఏదో కొంప మునిగిన విషయం జరిగిందనే చెప్పవచ్చును. అనంతం ఆయాసంగా ఊపిరి పీలుస్తున్నాడు. నీలకంఠానికి సారావాసన కొట్టింది. సోదరు డింటికి వస్తున్నప్పుడైనా, అనంతం తాగకండా ఎందుకు రాకూడదో ;

“అనంతం ! ఏమిటిరా సంగతి !” అని నీలకంఠం ప్రశ్నించాడు.

నీలకంఠానికి, అనంతంపట్ల పరమద్వేష మున్నా రక్తసంబంధంమూలాన, కష్టాలనుండి సోదరుని రక్షించేందుకు ఎప్పుడూ ముందుకు వచ్చేవాడు.

“ఏరా అనంతం ! లోపలి కొచ్చి కూర్చో! ఏం అట్లా వున్నావు ? జబ్బుగా ఉందా ?”

‘లే’ దన్నట్లు తల - ఊపేడేగాని, నోరు విప్పి సమాధానం చెప్పలేదు అనంతం.

అనంతం మూగతనాన్ని చూసి, నీలకంఠం సహించలేకపోయాడు. సారావాసన కొడుతూన్న కొద్దీ నీలకంఠం కోపోద్రిక్తు డవడం మొదలెట్టాడు.

“ఊరకరారు మహాను భావులు ! ఏమిటి జరిగిందిఅనంతం ? మళ్లా ఎవర్నైనా చంపావా ? నీ హావ భావ వేషాలు చూస్తే హంతకుల్లా కనిపిస్తున్నావు !”

ఒక్కక్షణంవరకూ సమాధానం రాలేదు. తర్వాత రహస్యంగా ‘ఔ!’ అన్నాడు అనంతం.

ఒక్కసారి చకితుడై నీలకంఠం—

“ఒరేయి ; ఐతే ఇంకా తాగుతూనే వున్నా వన్నమాట !......ఇలా, ఈ వెలుగులో కొచ్చి సంగతంతా చెప్పు !” అనంతం భయంతో దుముకుతూ, వణికిపోతూ, నీలకంఠం ఎదురుగా నిలబడి.

“అది నిజమే నన్నయ్యా !” అన్నాడు.

నీలకంఠం కోపంతో ఒళ్ళు మర్చిపోయి—

“ఇన్నేళ్లొచ్చాయి, ఇంకా నీకు బుద్ధి లేదురా ! ఏమిటిరా ఈ జీవితం ?”

తలుపు తెరచివుండడంచూసి, ఒక్క అంగలో వెళ్ళి తలుపుగడియ పెట్టి వచ్చి, అనంతం కుర్చీకి చేరువగా తనకుర్చీ లాక్కొని, నీలకంఠం—

“అనంతం ! అలా బిత్తరిచూపులు చూడక ధైర్యం తెచ్చుకొని, సంగతంతా జరిగింది జరిగినట్లు చెప్పు !” అని ఆత్రంతో అడిగాడు.

“నిజం అన్నయ్యా ! నేను ఓ మనిషిని చంపాను!” అని చెప్పి అనంతం భోరున ఏడ్వడం మొదలెట్టాడు. నీలకంఠంపేగు కదిలింది.

“అనంతం ! ఇంతపనిచేసి ఇక్కడి కెందు కొచ్చినట్లు? నా కెందు కిదంతా చెప్పడం ?”

“ఇంకెవరితో చెప్పకోను అన్నయ్యా ! పరిస్థితిలో నేను ఏం చేయాల్సివుంటుందో తెలుసుకోడానికి వచ్చాను ? పోలీసులకి లొంగిపో మంటావా? లేకపోతే మనోగత్యంతరం ఏమేనా వుందా? ”

నిజస్థితి తెలుసుకోగానే నీలకంఠంగుండె కొట్టుకోడం మొదలెట్టింది. ఏమి టిదంతా జరిగిందా ? నీలకంఠాని కెందుకో, సమస్తం లీలగా తోచింది.

“హత్యకి కారణ మేమిటో చెప్పరా.. ఎప్పుడు చంపావు ?

“నిన్న రాత్రి”.

అనంతరం ముఖంలో అమాయకత గోచరించింది. చంటిపిల్లవానిలా యథార్థం చెప్పాడు ! న్యాయవిచారణ చేస్తే బ్రతికే సూచన లుండవు !

“ఎలా చంపావు ? ఎక్కడ ? శాంతంగా మొదటినుంచీ చెప్పు.. ఇదిగో ! కాఫీ తాగు... కాస్త తమాయించుకో !”

అనంతం, ఒక్క గుటకలో కప్పు ఖాళీ చేశాడు.

“ఔను ! ఈ విధంగా జరిగిం దన్నయ్యా : కొన్ని మాసాలనుంచి ఓ పిల్ల నెరుగుదును”...

“స్త్రీ!” నీలకంఠం పళ్ళు కొరికాడు.

“ఆమెకీ ప్రపంచంలో ‘నా’ అన్నవాళ్లెవరూ లేరు. చాలా అందంగా ఉంటుంది. శోభనాచలం పెళ్లి చేసుకుంటానని ఆమె మానం చెరిచాడు. ఆ రెన్నెల్ల పసికూనతో, ఆమెను వదిలి పోయాడు. ఆ పసికూన, చివరకు చనిపోయినది. ఆమె తిండిలేక మలమల మాడిపోతుంటే, ఇంకొక డెవ్వడో, ఆమెను చేరదీశాడు అతని తోటి రెండుసంవత్సరాలు, సుఖంగా ఉండగా తిరిగి ఒకనాడు మొట్టమొదట చేరదీసిన, ఆ శోభనాచలం వచ్చి తిరిగి తనతో ఉండమని బలవంతంచేసి ఆమెను లాక్కుపోయాడు. పశువు కన్నా కనిష్టంగా ప్రవర్తించి నానాబాధలు పెడుతూండేవాడు. అతను, మళ్లా ఆమెను వదిలి పెట్టేశాడు. ఆ సమయంలో ఆమె నాకు పరిచయమైంది ” శాంతంగా చెప్పడం ఆపి అనంతం, నీలకంఠంముఖంలోకి చూశాడు.

“అంత నిజాయితీ గలదానినీ, అంత దయాని హృదయం కలదానిని, నే నింతవరకూ ఎక్కడా చూడలేదు. మహావుంటే ఇరవై ఏళ్లుంటాయేమో!.. రాత్రి ఆమె ఇంటికి వెళ్లగానే—ఆ క్రూరుడు—ఆ త్రాగుబోతు శోభనాచలం అక్కడికి వచ్చాడు; నామీదికి తూలుతూ తిడుతూ వచ్చి పడ్డాడు.. ఇదిగో, ఇక్కడ చూడు అన్నయ్యా !” అంటూ నుదుటి మీది గాయం, అన్నకు చూపిస్తూ— “అప్పుడు నేను లేచి, వాడిగొంతుక రెండు చేతులతో పట్టుకుని... ఏమైందో తెలియదు.. తర్వాత వదిలేటప్పటికి...”

“ఊ! వదిలేటప్పటికి ?”

“చచ్చి కింద పడ్డాడు. నా కాసంగతి అసలు తెలియనేలేదు !” అనంతం ఆవేశంతో చేతుల్లో ముఖం దాచుకున్నాడు.

బొంగురు గొంతుకతో బారిష్టరునీలకంఠం—

“అప్పు డేం చేశావురా ?”

“నేనూ ఆమే, చాలా...చాలాసేపు ఆశవం దగ్గిర చతికిల పడ్డాము. తర్వాత ఆ శవాన్ని భుజాన్నేసుకుని ఆ ఆర్చి మూలకి మోసుకు పోయాను.”

“ఎంత దూరం మోసుకు పోయావు ?”

“రమారమీ ఏభైగజాల దూరము.”

“ఎవరూ—నిన్నెవరూ చూడలేదుకదా?”

“ఊహూఁ !”

“ఏ వేళప్పుడు ?”

“తెల్లారు ఝామున మూడు గంటలకి.”

“తర్వాత ?”

“తిరిగి ఆమె దగ్గిర కెళ్లిపోయాను.”

“ఎందుకు ? ఎందు కెళ్లావురా మళ్ళీ అక్కడికి ?

“భయపడిపోతూ ఒంటరిగా ఆమె వుండిపోయింది; నేనుకూడా నంతేనన్నయ్యా !”

“మీ రుంటూన్న దెక్కడ ?”

“42 క్లైవుస్ట్రీట్”

“ఆ ఆర్చి ఎక్కడుంది ?”

“ఫకీర్ డిక్రాజ్ మూలలో.

“ఓరినీ ! ఇంకనే ! ఈ హత్యగురించే పత్రికలో చదివాను !” అంటూ బల్లమీద వున్న పత్రిక తీసి, తిరిగి నీలకంఠం చదవడం మొదలెట్టాడు. ఈవేళ ప్రొద్దున్న ఒక పురుషుని శవం-ఫకీర్ డిక్రాజ్ మూలనున్న ఆర్చిక్రింద కనిపించింది. గొంతుక పిసికి చంపినట్లు, గొంతుకమీది ఆనమాళ్లపట్టి తెలుస్తూంది. మనిషిని గుర్తుపట్టేందుకు, ఎటువంటి ఆనమాళ్లూ దొరకలేదు. ఆ మనిషిని దొంగిలించి చంపినట్లుగా కనపడుతూంది.

నీలకంఠం పత్రిక చదివి పెద్దగా నిట్టూర్చాడు. హత్య ! తన సోదరుడే హత్యచేయడం ! అనంతంకేసి తిరిగి నీలకంఠం ! “పత్రికల్లోకి కూడా ఎక్కావు చూశావా ? ఎటువంటి ఘనకార్యం చేశావు! ఆలోచించుకో! కలకాదోయ్-నిజంగా నువ్వు హత్యచేశావు ! నేను చెప్తూన్నది అర్థమవుతూందా ?”

“అన్నా ! అన్నా ! నేను చెయ్యాలని చేయలేదు. అంత పని జరుగుతుం దని తెలిస్తే అతని గొంతుక పట్టుకుండేవాణ్ణి కాను !”

నీలకంఠం కొదామ రెత్తిన ట్లైపోయాడు.

“ఆశవం వంటిమీదనున్న వేమైనా తీసుకున్నావా ?”

“మేమిద్దరం ఇటూ అటూ పెనగులాడు కుంటూంటే, ఇది క్రింద పడిం”దంటూ ఒక ఎడ్రెసుమాత్రం వ్రాసిన ఖాళీకవరు నీలకంఠం చేతి కందిచ్చాడు

“తగలపెట్టేయి !... ఐతే ఇక్కడి కొచ్చి నాకెందు కిదంతా చెబుతున్నావు?”

“నన్ను గురించి నీకు తెలుసకదా అన్నయ్యా! అన్నయ్యా ! అతన్ని నేను చంపా లనుకోలేదు. ఆపెల్లని వళ్లంతా కళ్లుచేసుకుని ప్రేమిస్తున్నాను. నన్నేంచెయ్యమంటావు అన్నయ్యా ?”

ఎంత సులభంగా, నిర్భయంగా, ఏమీ ఎరగనట్లు హత్య చేయనట్లు, అనంతం ఎట్లా మాట్లాతున్నాడో !

నీలకంఠం తమ్ముడుముఖంలోకి చూస్తూ “నిన్నెవరూ చూడలే దంటావురా ?”

“ఆవీధి చాలా చీకటిగా వుంటుంది. మనుష్య సంచారం వుండదు.”

“రెండోసారి ఆ పిల్లని ఎప్పుడు విడిచి పెట్టావురా?”

“ఏడు గంటలకి ”

“విడిచిపెట్టి ఎక్కడెక్కడి కెళ్లావు ?”

“నా బస కెళ్లాను.”

“చిట్టూర్పురు రోడ్డులోనేనా ?”

“ఔను.”

“నీ బసలోకి వెడుతూన్నప్పుడు ఎవరేనా చూశారా ?”

“లేదు ”

“అప్పట్నించి ఇంతవరకూ ఏం చేస్తున్నావు?”

“ఊరికే నా గదిలో దీపం ఆర్పుకొని కూర్చున్నాను ”

“ఐతే బైటికి రానేలే దన్నమాట ?

“లేదు అన్నయ్యా ”

“మళ్లావెళ్లి ఆ పిల్లని చూడలేదుకదా ?”

“లేదు ”

“ఆమె అప్పణ్ణించి ఏం చేస్తూందో నీకు తెలియ దన్నమాట.

“ఊహూఁ”

“మీ ఇద్దరికీ సంబంధం ఉన్నట్లు మరెవరికేనా తెలుసునా ?”

“ఊహూఁ ! ఎవ్వరికీ తెలియదు.”

“నిజం చెప్పరా అనంతం !”

“నిజంగా అన్నయ్యా !”

“నిన్న రాత్రి, ఆమెఇంట్లోకి వెడుతూంటేని న్నెవరేనా చూశారా ?”

“అబ్బే లేదు: పైగా తలుపుతట్టి పిలవనక్కరలేకుండా నా దగ్గిరే ఉన్నాయి తాళాలు.”

“ఏవీ ! ఆ తాళాలు ఇలా ఇయ్యి ! ఆమె తాలూకు వస్తువులు మరేమైనా నీ దగ్గిరకాని, నీ గదిలోకాని ఉన్నాయా ?”

“ఏమీ లేవు ”

“ఫోటోలు ? ఉత్తరాలు ?”

“ఊహూఁ !”

“జాగ్రత్త సుమా !”

“అలాగే అన్నయ్యా !”

“ఆమెఇంట్లోంచి ప్రొద్దున్న బైట కొస్తూన్నప్పుడు, నిన్నెవరూ చూడలేదుకదా ?”

“లేదు !”

“అదృష్టవంతుడవు...కూర్చోరా ! కాస్త నన్ను ఆలోచించనీ !” అన్నాడు నీలకంఠం. ఆలోచన! జరిగిన అమానుషకృత్యాన్ని గురించి ఆలోచన! నీలకంఠం ఆలోచించలేక పోయాడు. అనంతంవేపు తిరిగి—

“ఏరా అనంతం! శోభనాచలం తిరిగి రావడం అదే మొదటిసారా ?”

“ఔను అన్నయ్యా !”

“అలా అని ఆమె చెప్పిందా ?”

“ఔను !”

“ఆమె ఎక్కడున్నదీ అతనికెట్లా తెలిసిందట?”

“ఏమో, నాకు తెలియదు !”

“ఐతే, అతన్ని చంపుదామనే ఉద్దేశం నీ కసలు లే దన్నమాట !”

“లేదన్నయ్యా!. దేముడికే తెలియాలి !”

“ఉహూఁ ! ఆ ఆర్చిక్రింద కెందుకు తీసికెళ్ళి ఆ శవాన్ని పారేశావు ?”

“చీకటిగా, జనసమ్మర్దంలేకుండా, చేరువుగా ఉన్న ప్రదేశము.”

“శోభనాచలంముఖంలో, గొంతుక నులిమిన సూచన లేమైనా ఉన్నాయా ?”

“ఊహూఁ!”

“ఏమిటి ! ముఖంలో ఏ మార్పూ లేదూ ?”

“ఉం దన్నయ్యా, భయంకరంగా మారిపోయింది.”

“ఎవరూకూడా శోభనాచలాన్ని గుర్తుపట్టలేనంతగా మారిపోయిందా ?”

“ఔను.”

“మొట్టమొదట ఆమే, శోభనాచలం ఎక్కడుండేవాడు ?”

“చాందినీలో అనుకుంటాను.”

“ఇప్పు డుంటూన్న 42 క్లైవు వీధిలో కా దన్నమాట ?”

“కాదు ”

“వాళ్లిద్దరూ భార్యాభర్త లని ఎవరికేనా తెలుసునా ?”

“తెలియ దనుకుంటాను అన్నయ్యా !”

“శోభనాచలం ఏంపని చేసేవాడు ?”

(19 వ పేజీ చూడుడు)

స్వర్గీయ సర్ తేజ్ బహదూర్ సప్రూ

శ్రీ ఆర్. యన్. శర్మ

అది 1945 వ సంవత్సరం మార్చి నెల. సర్ తేజ్ బహదూర్ సప్రూ చెన్నపురి హైకోర్టులో ప్రసిద్ధమైన సబు కలెక్టరు కేసులో వాదించి ఫలానా తేదీని తిరిగి అలహాబాదు వెడతారని పత్రికలు ప్రకటించినవి. ఆ ప్రతిభాశాలిని స్టేషనులో దర్శించడానికి, వీలయితే వారిసంతకాన్ని సంపాదించడానికీ రాజమండ్రి సర్కారు కళాశాల విద్యార్థులు కొందరము బయలుదేరినాము. వారిని దర్శించడానికి వచ్చిన కొందరు పెద్దలతోటి విద్యార్థులతోటి వారు తమకు పరిచితులైన న్యాపతి సుబ్బారావు, మోచర్ల రామచంద్రరావు, సి వై. చింతామణి మున్నగు ఆంధ్రనాయకులనుగూర్చి రాజమహేంద్రవరంలోని విద్యాసంస్థలనుగూర్చి పలు విషయాలు ఒక వంక ప్రస్తావిస్తూ, ఒక వంక తమని అడిగిన విద్యార్థులందరికీ సంతకాలు ప్రసాదిస్తూ తమ్ము చూడడానికి వచ్చినవారిని ఆదరించి పంపిరి. వారు మాట్లాడిన విషయములకన్నను తెల్లని పైజామా, పలుచని లాల్చీ ధరించి ఒకపాదుషా తీవిలో కూర్చొనియున్న ఆవృద్ధునిచూచి వచ్చినవారందరు ముగ్ధులైరి. ఆ మహావ్యక్తియందు కేవల ప్రతిభయేగాక ఏదో అనిర్వచనీయమైన ఘనత, ఉన్నతత్వం గోచరించినవి.

అట్టి ఘనత, హృదయౌన్నత్యము గల వ్యక్తి కావుననే తేజబహదరుమరణవార్త విని కుల, భాషా, పక్ష విచక్షణలేక భారతీయులెల్లరు శోకించినారు. ఆయన పెద్దన్యాయవాదియైనా అందులో మునిగి ప్రజాజీవితాన్ని నిర్లక్ష్యం చెయ్యలేదు. రాజకీయవేత్తయైకూడా హృదయ మృదుత్వాన్ని సౌజన్యభావాన్ని కోల్పోవలేదు. వృద్ధుడైనపిదపకూడ - తనశరీరారోగ్యముపై పూర్తిగ అధీనము తప్పేదాకా - ప్రజాసమస్యలయందుత్సాహము విడనాడలేదు. నిర్విరామమగు వృత్తిసంబంధములగు పనులు, ఎడతెరిపిలేని రాజకీయ కార్యాలు ఉన్నా విజ్ఞాన విషయాలలో ప్రమేయం లేకుండా వుండలేదు.

సర్ తేజబహదూర్ సప్రూ ఉత్తర హిందూస్థానమున వివిధ ఉద్యమాల్లో ముందంజవేసిన కాశ్మీర్ బ్రాహ్మణకుటుంబమున 1875 వ సం|| డిశంబరు 8 వ తేదీన నవీన ముస్లిం విజ్ఞాన కేంద్రమగు అలిఘరుపట్టణమున జన్మించెను. విద్యార్థిదశలోనే అసమానప్రతిభను ప్రదర్శించి 1890 లో మెట్రిక్యులేషను పరీక్షను, 1894 లో ఆగ్రాకళాశాల విద్యార్థిగా పట్టపరీక్షను, 1896 లో ఎం. ఏ. పరీక్షను అత్యున్నతశ్రేణిలో నెగ్గి పిదప న్యాయశాస్త్ర మభ్యసించెను. మొదట కొలదికాలము మొరాదాబాదులో న్యాయవాదివృత్తికార్యములు నెరవేర్చి, 1898 లో నాయన అలహాబాదు హైకోర్టు వకీలయ్యెను.

అలహాబాదు పట్టణ ప్రవేశముతో సప్రూ మహాశయుని జీవితమున ఒక నూతనాధ్యాయము ప్రారంభమాయెనని చెప్పవచ్చును. అలహాబాదులో వృద్ధిలోనికి వచ్చిన సప్రూ ఆ పట్టణమునకే గౌరవము తెచ్చెను. నెహ్రూ పండితుడు ఆయన కుమారునకు సానుభూతి సందేశమంపుచు ఆయనలేని ఆ పట్టణము బావురుమని చిన్నపోగలదని వ్రాసియున్నాడు. ఆల్బర్టురోడ్డునందలి ఆయన గృహము అతిథిసత్కారమునకును, ఎడతెగని విజ్ఞానచర్చలకును పేరుపడియుండెను.

అలహాబాదు న్యాయవాదియైన పిదప సప్రూ తదుపరి జీవితములో మూడురంగములలో ముఖ్యముగ కృషిచేసెను. అందు మొదటిది న్యాయశాస్త్రము; రెండవది ప్రజాజీవితము; మూడవది విజ్ఞానరంగము.

న్యాయవాదరంగము

సర్ తేజబహదూర్ భారత దేశమందేగాక ప్రపంచమందలి గొప్ప న్యాయవాదులలో నొకడు. న్యాయవాదిగా ఆయనఘనత సర్వతోముఖమైనది. న్యాయశాస్త్రమునందలి అన్ని భాగములును-ఆస్తిసంబంధములైనవైనను, నేరసంబంధములైనవైనను, రాజ్యాంగ న్యాయశాస్త్రవిషయములైనను-ఆయనకు కొట్టిన పిండివంటివి. భారతదేశములోని అన్ని న్యాయస్థానములందును పెద్దపెద్ద వ్యాజ్యములందు హాజరయ్యెను. సర్ సి. పి. రామస్వామయ్యరుగారి జీవితమున బిసంటు కేసువలె ఈయన జీవితమున ప్రసిద్ధమగు *wakf case* (1916), ఒక మైలురాయివంటిదై, ఆయన అనేకమంది జమీందారులు, సంస్థానాధీశులతరఫునసేగాక, 1945లో బోసువీరులపై ప్రభుత్వము తెచ్చిన అభియోగమునందును, హిందూస్థాన్ టైమ్సు, అమృతబజారు పత్రిక మున్నగు పై కోర్టు ధిక్కరణ నేరములారోపింపబడినప్పుడును, ఉత్తరమునను దక్షిణదేశమునను అనేకమంది I. C. S. ఉద్యోగులపై తేబడిన అభియోగములలోను మిగుల సామర్థ్యముతో పనిచేసెను.

శ్రీ అల్లాడికృష్ణస్వామయ్యరుగారాయనను *"Facile princeps of the bar of India"* అని వర్ణించిరి. టైమ్సు పత్రిక ఈయనను *"a Lawyer of outstanding ability"* అని వాకొనెను. న్యాయవాదిగ ఈయనలో గల ప్రధాన లక్షణము సమగ్రమగు పాండిత్యముతో పాటు చక్కని వాదనాకౌశల్యము కల్గియుండుట. ఈ రెండు విధములగు ప్రతిభయు కల్గియుండుట బంగారమునకు సువాసనయుండుటవంటిది.

తేజబహదర్ సప్రూ న్యాయశాస్త్ర పాండిత్యమును ఆయన పొందిన గౌరవములే ఋజువు చేయగలవు. ఆయన అనేక భారతీయ విశ్వవిద్యాలయములందు గౌరవ Ll. D. పట్టము పొందుటయేగాక ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయపు D. C L. పట్టమును, 27 వ ఏట తన స్వయంకృషివలన 1902 లో న్యాయశాస్త్రమున డాక్టర్ పట్టమును పొందెను. 1934 లో ప్రీవీ కౌన్సిలర్ గౌరవ మీయనను వరించినది. అనేక అంతర్జాతీయ న్యాయశాస్త్ర పత్రికలకు సంపాదకుడు. భారత ప్రభుత్వ న్యాయశాఖ సభ్యుడుగ నుండి క్రిమినల్ ప్రొసీజర్ కోడునుండి భారతీయుల కభ్యంతరకరములగు కొన్ని భాగములు తొలగించెను.

కేసులు నడపుటలో ఆయనకు గల శ్రద్ధ, సత్యసంధత, వాదనాపటిమ, న్యాయమూర్తుల చిక్కు ప్రశ్నలకు సమయానుకూలముగా వెంటనే జవాబు చెప్పగల సామర్థ్యము మున్నగు సద్గుణములను గురించి పత్రికలు విశేషముగ ప్రశంసించియున్నవి. అనేకమంది ప్రసిద్ధన్యాయశాస్త్రవేత్త లీయనప్రతిభనుగూర్చి పొగడియున్నారు. సర్ సి. పి. రామస్వామయ్యర్ గారు నుడివినట్లు— *"His first and last preoccupation was with law and lawyers he never felt as happy or so much at home as when preparing for and arguing complicated cases, civil, criminal or constitutional.. He was so meticulous that although he was fully cognisant of all aspects of the case he still prepared and maintained elaborate notes so as to guard himself against the slightest inaccuracy or slipshodness . Not even Lord Sinha in the plentitude of his work had a clientele so diverse and devoted as Dr. Sapru commanded."*

భారతదేశపు మాజీ ప్రధాన న్యాయమూర్తి సర్.మారిస్ గయర్ గారి మాటలుగూడ ఉల్లేఖింపదగినవి. "....... *he always insisted that the maintainence of the highest possible professional standards is an essential element in the proper administration of Justice; and that the most upright Bench may not be important unless it has at all times the assistance of a strong, honest and independent bar."*

ప్రజాజీవితరంగము

భారతదేశప్రజాజీవితమున కూడ, సప్రూ దాదాపు మూడుదశాబ్దులకాలము మహోన్నతస్థానమలంకరించెను. 1913 లో సంయుక్తరాష్ట్రశాసనసభ్యత్వము, సాంఘిక మహాసభ అగ్రాసనాధిపత్యము అను రెండు గౌరవములతోను ప్రారంభమైన ఆయన ప్రజాహితజీవితము అనేక సంఘటనలతో నిండియున్నది. ప్రజాప్రతినిధిగా భారత సామ్రాజ్య శాసనసభయందును, భారతప్రభుత్వ ప్రతినిధిగ సామ్రాజ్య మహాసభయందును ఖండాంతర భారతీయులకొరకును, సౌత్‌బరో, ముడీమన్ కమీషనులలో సభ్యుడుగను, 1935లో *U. P.* ప్రభుత్వము నియమించిన విద్యావంతులలోని నిరుద్యోగసమస్యావిచారణసంఘమునందును, పనిచేసి దేశాభ్యుదయమునకు పాటుబడెను. రౌండు టేబిలు సమావేశములో భారత రాజ్యాంగము ఫెడరలు విధానము ననుసరింపవలెనను సూత్రమును అంగీకరింపచేయుటకును, నెహ్రూనివేదికారచనయందునుగూడ అపారకృషి చేసెను.

సప్రూ మహాశయుని రాజకీయజీవితమును గూర్చిన మూడు విషయములు మరువరానివి. అందు మొదటిది ఆయన సహనభావము. గాంధి మహాత్ముని సత్యాగ్రహోద్యమము ఆయనకు నచ్చకున్నను ఆయనకు వ్యక్తిగతముగా గాంధీజీయందు గల గౌరవము అపారమైనది. గాంధిజీ కరుడుగట్టిన భారతీయ ఆత్మగౌరవ చిహ్నము అని వాకొనియున్నాడు. అట్లే పాకిస్థాన్‌వాదము నచ్చకున్నను ఆయన జిన్నాగారి ప్రియమిత్రుడు. అట్టి సహనభావము మూలముననే ఆయన కులపక్షవిభేదములేక భారతీయులెల్లరిచేతను గౌరవింపబడెను. రెండవ లక్షణము ఆయన నినాదములయెడ, భావోద్రేకము ఎడ సానుభూతి లేక ప్రజాసమస్యలను తార్కికదృష్టితో తిలకించెను. మొదట కాంగ్రెసు పక్షమునను, 1919 తర్వాత 1931 వరకు లిబరలు పక్షమునను సభ్యుడై, 1923, 1927 సం. ఆ సంస్థ కధ్యక్షుడై పనిచేసెను. కాని ఒకపక్షమున కనుబంధింపబడియుండుటవలన తన స్వాతంత్ర్యమున కాటంకము కల్గునని తోచగనే అందుండి విరమించెను. ఐతే ఆ విషయము తెలియక కొందరును, ఆయన తదుపరి రాజకీయములుకూడ లిబరలు సూత్రములకు సన్నిహితముగ నుండుటవలన కొందరును ఈయనను లిబరలు నాయకునిగనే పరిగణించుచుండిరి.

ఆయన రాజకీయజీవితములోని మరొక ముఖ్యవిషయము శాంతి స్థాపకుడుగ ఆయన చేసిన కృషి. ఇటీవల భారతరాజకీయములలోనే ప్రతిష్టంభన వచ్చినను అందుకు ప్రధాన రాజకీయ సంస్థయగు కాంగ్రెసుకు ప్రభుత్వమునకు గల విభేదములుగాని వివిధ రాజకీయ సంస్థలమధ్య గల వైషమ్యములుగాని ఈ రెంటిలో నొకటి కారణమగుచుండెను. డాక్టర్ సప్రూ ఈ రెండువిధములగు వ్యత్యాసములనుగూడ నివారించుటకు యత్నించినాడు. మొదటిరకపు విభేదముల నివారించుటకు ఆయన చేసిన యత్నములకు రెండు ఉదాహరణముల నీయవచ్చును. గాంధీ మహాత్మునకు యిర్విను ప్రభువునకును మధ్య రాజాజీ ఈయనయు జయకరుగారును కలసి చేసిన యత్నములు, 1943 ఫిబ్రవరిలో గాంధిమహాత్ముడు నిరాహారదీక్ష పూనినపుడు ప్రభుత్వమునకు మహాత్మునకు రాజీ కుదుర్చుటకు ఈయన చేసిన యత్నములు ఈయనను దేశీయుల కృతజ్ఞతకు పాత్రుని చేసినవి.

పూనా ఒడంబడికను, 1941 లో పక్షాతీతులగు రాజకీయవేత్తల సమావేశము నేర్పరచియు, తదుపరి సుహృద్భావసమితిద్వారా దేశీయులెల్లరకు అంగీకారయోగ్యమగు రాజ్యాంగము నిర్మించి తద్వారా, దేశమునందలి రాజకీయ ప్రతిష్టంభన అంతమొందించుటకును అతడు చేసిన యత్నములు రెండవరకపు, వ్యత్యాసములంతమొందించుటకాయన చేసిన కృషియై యున్నది. ఈకృషియందాయన అనేకుల విమర్శలకు గురికావలసి వచ్చెను. 1941 లో పక్షాతీతులగు రాజకీయవేత్తల సమావేశము నేర్పరచి తద్వారా బ్రిటిష్ వారు ఒక నిర్ణీతమైన తేదీలోగా ఇండియాను వదలవలయుననియు, వెంటనే కేంద్రమున తాత్కాలిక జాతీయ ప్రభుత్వ మేర్పరుపవలయుననియు సూచించినపుడు ముస్లిం లీగు రాజకీయవేత్తలీయనను *"Political orphan"* అనియు, యీయన ఏర్పరచిన సమావేశమును *"Dutch Navy without any Privates"* అనియు నిరసించిరి. ఆయన ఏర్పరచిన సుహృద్భావ సంఘము చేసిన ప్రధాన సూచన దేశవిభజన కూడదనియు, అందు ప్రతిఫలముగా ముస్లిములకు కేంద్రశాసనసభయందును, ప్రజాపరిషత్తునందును, కార్యనిర్వాహకశాఖయందును సవర్ణ హిందువులతో సమానప్రాతినిధ్య ముండవలయుననియు యున్నది. కాని దురదృష్టవశమున ఆ ప్రయత్నము లేవియు ఫలించక దేశవిభజనయే జరుగవలసివచ్చెను.

పెథిక్ లారెన్సు ప్రభువు నుడివినట్లు 25 సంవత్సరముల క్రిందట కాకున్న ఐదారుసంవత్సరముల క్రిందటనైనను స్వాతంత్ర్య ప్రదానము జరిగియున్నయెడల ఆయన అమూల్య ప్రతిభ దేశపరిపాలనలోను, ముఖ్యముగ రాజ్యాంగ నిర్మాణములోను అద్భుతముగ తోడ్పడియుండెడిది. కాని దురదృష్టవశాత్తు ఆయన స్వాతంత్ర్య ప్రదానమునాటికే అనారోగ్యగ్రస్తుడై, నూతన భరతవర్ష నిర్మాణమున నిమగ్నులైన మన నాయకుల నాశీర్వదించుటకు మాత్రమే శక్తి గల్గియుండెను. అయితే ఒక్కవిషయమున రోగగ్రస్తుడైన ఆయనకు అపార ఆనందము నొసంగియుండును. 1915 వ సం||న ప్రథమ పర్యాయము నెహ్రూ అలహాబాదులో ఆంగ్లమున ప్రసంగించినపుడు, ప్రజాజీవితరంగమున కాలిడుచున్న ఆ యువకుని సప్రూ బహిరంగముగ కౌగలించుకొని అభినందించెనట. నాడు తాను కౌగలించుకొన్న యువకుడే స్వతంత్ర భారతవర్ష ప్రథమప్రధానియై కార్యభారము ప్రశంసనీయముగ నిర్వహించుచుండుట ఆ వృద్ధునికి తుదిదినములలో కొంత ఆనంద మొసంగియుండును.

సప్రూ మహాశయుడు ప్రజాజీవితములో తనకు తానేర్పరచుకొన్న ఒక నిబంధన యున్నది. అది స్థానిక సంస్థలనుండి సన్మానపత్రములు స్వీకరింపకుండుట !

విజ్ఞానరంగము

డాక్టరు సప్రూ వృత్తిభార మెంత యున్నను, రాజకీయ కార్యము లెన్నియున్నను విజ్ఞాన విషయములు వదలలేదు. ఆంగ్ల, ఉర్దూ, పర్షియన్ సాహిత్యములలో పండితుడు. ఆంగ్ల సాహిత్యమున ఆయన, ప్రసిద్ధ కలకత్తా న్యాయవాదియగు డాక్టర్ రస బిహారీ ఘోష్ వలెనే పండితుడైనను రసబిహారీఘోష్ ఉపన్యాసమువలె యీయన ఉపన్యాసములలో కాని, న్యాయశాస్త్రవాదనలలోగాని ఆ విషయము గోచరించదు. ఇందులకు కారణము సప్రూ తను చెప్పదలచుకొన్న విషయములకేగాని చెప్పు విధమునకు ప్రాముఖ్య మీయకుండుటయే. అంజుమాన్ - తరా ఉరుదు అను సంస్థకు చిరకాలము అధ్యక్షుడు. ఉర్దూ హిందీ విభేదములు నిరసించుచు, సర్ సుల్తాన్ మహమ్మద్ ఒకసారి యిట్లు వాకొనియుండిరి: *"I claim that the Rt. Hon. Sir Tej Bahadur Sapru and I speak Urudu, but the Urudu which has been used by some Urudu Papers will not be understood either by him or by me. Here we find a deleberate attempt by extremists of both communities to create a split where no difference existed."*

ఆయన హిందు, ముస్లిం, ఆంగ్లసంస్కృతుల అద్భుత సమ్మేళనము. 1941 లో ఆయన కాశీవిశ్వవిద్యాలయమందొసంగిన స్నాతకోపన్యాసమున భారతవిజ్ఞానైక్యతనుగూర్చి ఆయన పలికిన మాటలు మరువరానివి:—

"I should like our young men to remember that Indian Culture is a variegated mosaic and indeed it would be difficult to claim for any culture in the world that in the course of development it had not been influenced by

(18 వ పేజీ చూడుడు)

చిక్కప్ప వడయార్

శ్రీ అవ్వారి నారాయణ

[అనంతమయిన కష్టముల ననుభవించి, స్వార్థరహితులై, నిత్యము పరోపకారులై, శాశ్వతకీర్తి సంపాదించిన వారు కొందరుగలరు. వారిలో చిక్కప్పవడయార్ ఒకడు. ఇతడు గొప్ప మహనీయుడు. ధీశాలి. రాజుల గౌరవము బడసిన వ్యక్తి. అగ్రహారములు, తటాకములు, సత్రములు, మొదలగునవి కట్టించి, శాశ్వతకీర్తి నిలుపుకొనెను. బుక్కరాయ సముద్రము, అనంతపురము, నాగసముద్రము అను గ్రామములును, రెండు తటాకములను కట్టించెను. ఇవి యిప్పటికిని నిలచియున్నవి. అనంతపురము రానురాను పెద్ద పట్టణమై రాయలసీమ కేంద్ర మయినది. ఇతని పరోపకారము చరిత్రాంశమై యున్నది. ఇతని జీవితచరిత్ర చాల యింపుగానున్నది. కనుక యిచ్చట సంగ్రహముగ వివరింతును.]

బుక్కరాయసముద్రముచేరువ నొక కొండ కలదు. దానిపేరు దేవర కొండ. ఆ కొండచెంతనే పూర్వమొక గ్రామ ముండెను. దానిపేరు ఓరూరు. (ఇది యిప్పుడు శిథిలమై యున్నది. పాడుపడినగోడలు, పునాదు లిప్పటికి చిహ్నములుగ నున్నవి.) ఆ యూరిలో భార్యాభర్త లిరువురు నివసించుచుండిరి. భార్య పేరు వేశమ్మ.. (భర్తపేరు తెలియదు) వారు మిక్కిలి నిర్భాగ్యులు. రాత్రింబగళ్లు కష్టించినను తమకూటికే కరువుగానుండెను. కొంతకాలమైన తరువాత భర్త చనిపోయెను. ఆమె ఒక్కతె నిలచిపోయెను. ఆమె అప్పుడు నిండుగర్భిణిగానుండెను. కుమారు డుదయించిన తరువాత జీవితము గడుపుట దుర్భరముగా నామెకు గనిపించెను. అందువలన నామె ఊరూర భిక్షమెత్తి కాలముగడుప నారంభించెను.

ఇట్లు కొంతకాలము జరిగెను. ఆమె ఊరూరు తిరుగజొచ్చెను. కాని జీవితము సరిపడలేదు. చేసిన ఖర్మ మనభవింపక తప్పదని తలంచి, నిగాళియై భిక్షావృత్తినే ఆధారముగ జేసికొని కాలము గడుప నిశ్చయించెను.

ఒకనాడామె మట్టమధ్యాహ్నమున ఒక యూరినుంచి మరియొక యూరికి బయలుదేరెను. ఆ యూరిచెంతనే ఒక దేవాలయ ముండెను.

ఆ ఆలయములో నొక చిన్న బట్ట పరచి, దానిపై తన కుమారుని పరుండబెట్టి, నిద్రపోనిచ్చి తర్వాత నామె భిక్షమునకై యూరలోనికి పోయెను. ఆమె వీథివీథిని, యింటింటికిని పోయి అడుగుచుండెను. అందువలన చాల కాల మయ్యెను. ఎండవేడిమి అధికమయ్యెను. ఆ ఎండ దేవాలయములో పండుకొనియున్న పిల్లవానిపై బడుచుండెను. పాపమా శిశువునకు పైనిండ పూర్తిగ బట్ట కప్పబడియుండలేదు. అయిన నతడు గాఢనిద్రావస్థలో నున్నందున ఎండవేడిమి కనబడదయ్యెను. ఆ దేవాలయము ప్రక్కనే ఒక పెద్ద పుట్ట యుండెను. అందులో నొక పెద్దనాగుపాము నివసించుచుండెను. (ఆమె ఆ పుట్టను చూడక తన కుమారుని పండబెట్టి యూరిలోని కేగెను.) అది బయటికి వచ్చి వానికి ఎండ తగులకుండ తన పడగను విప్పి ఛత్రమువలె కాపాడుచుండెను. ఆ దేవాలయము సమీపమున నొక బాట కలదు. ఆ సమయముననే ఒక పాములవాడు ఆ దారిగుండా పోవుచు దానిని గాంచెను. ఆశ్చర్యపడెను. పిల్లవాని కేమి హాని చేయునో యని అనుమానించి, చూచెదగాక యని అచటనున్న నొక గోడచాటున దాగుకొని, కంటిపై రెప్ప వేయక నిరీక్షించుచుండెను ఇట్లు కొంతసేపు జరిగెను. కాని సర్ప మతని కేమియు హానిచేయక ఎండనుండి కాపాడుచునే యుండెను. భిక్షావృత్తి ముగించుకొని అతని తల్లి దేవాలయమునకు రా నారంభించెను అంతలోనే పాము తన పడగను ముడుచుకొని పుట్టలోని కేగెను. పిల్లవాడు నిద్రనుండి లేచెను. ఆ పిల్లవాడెవడో చూతమని పాములవాడచటి కేగి ఎత్తుకొని ముద్దిడెను అంతట నామె అచ్చటికి రాగ, జరిగిన సంగతినంతయు పాములవాడు చెప్పి, నీ కుమారుడు చాల అదృష్టవంతుడనియు, భాగ్యవంతుడు, మహత్తర కార్యములు చేయు నని జోస్యము చెప్పి, దీవించి వెడలిపోయెను.

ఆ కాలమున బుక్కరాయలు, హరిహరరాయలు రాజ్య మేలుచుండిరి. వారి రాజ్యము సకల సంపదలచేత తులతూగుచున్నదనియు, పాడిపంటలకు కొదువలేదనియు నామె వినెను. అక్కడి కేగి తనజీవితముభద్రము చేసుకొందునని తలంచి ఆమె విజయనగరమునకు బయలుదేరెను. మునుపటికన్న అక్కడామె జీవితము బాగుపడెను. దారిద్ర్యము కొంత కొంత తొలగిపోవుచుండెను. చుట్టుప్రక్కలవారిలో మర్యాద సంపాదించుకొనుచుండెను. ఉత్తమురాలుకనుక అందరామెను మెచ్చుకొనుచుండిరి. ఆమె తన కుమారునకు చిక్కప్పయను నామ మిడెను. ఆ బాలుడు దైవప్రసాదుడు కాబోలు దినదినప్రవర్ధమానుడై పెరుగుచుండెను. ముఖమున రూపరేఖలు వికసించుచుండెను. మంచి తెలివితేటలు గల బాలుడు. సద్గుణపుంజుడు. సాధువు. కనుక ఎట్టివారినైన సులభముగ నాకర్షించుచుండెను. అతనికి ముగ్గురు కొల్లలు. పొగడ్తలు పెక్కులు చూడ చిన్నవాడు కడు చక్కనివాడు కొంచెము యుక్తవయస్సు వచ్చినతరువాత గొప్పవారి సాయముచేత నతడు రాయలవారి కొలువులో నొక సేవకుడుగా నియమింపబడెను.

అతని తెలివితేటలు కనుబరచుటకిప్పుడు సమయము దొరికినది. మెరుగుపెట్టిన బంగారువలె నతడు తక్కిన సేవకులకన్న మిన్నయై యుండెను. అతనికీర్తి రాయల కొలువంతట వ్యాపించెను. శీఘ్రకాలములోనే యున్నత పదవులను పొందెను. తుదకు రాయలవారి ముఖ్యబంటు నయ్యెను. రాయలవారి ఆస్థానములోనే ఉద్యోగిగా నియమింపబడెను. బుక్కరాయలు చిక్కప్ప తెలివితేటల కాశ్చర్యపడి మెచ్చుకొనుచుండెను. గౌరవించుచుండెను. అప్పుడప్పు డతని మనస్సు చిక్కప్పపై మరల్చుచుండెను. రాజకీయవిషయములు చర్చించుచుండెను. అతడును దానికి తగిన సమాధానము చెప్పుచుండెను.

ఒల్లండ రాయలవారి కొకనాడు తన బంధువులనుండి ఒక యుత్తరము వచ్చెను. దానిలో విషయములు వివరములతో సహా వ్రాయబడియుండెను. రాయలవారి సభాముఖమున నాయుత్తరము చదువబడెను. చిక్కప్పకూడ ఒకచోట కూర్చుండి యుత్తరములోని విషయమంతయు శ్రద్ధగా వినుచుండెను. పూర్తిగా చదివిన తరువాత యుత్తరము యింటిలో నెచ్చటనో పెట్టిరి. కొన్ని మాసములు జరిగిన తరువాత రాయలవారు ఉత్తరములోని విషయమంతయు మరచిపోయియుండెను.

ఉత్తరములోని తేదీలు అవసరము పడినందున నతడు జాబును వెదకుమని సేవకుల కాజ్ఞాపించెను. ఎంత వెదకినను జాబు కనబడలేదు. ఇలంత వెదకిరి; పెట్టెలు బుట్టలు వెదకిరి. కాని కనిపించలేదు. అవసరమయిన విషయము కనుపించనందున రాయలవారు మిక్కిలి విచారపడుచుండిరి. ప్రధానమంత్రిని, తక్కిన యుద్యోగులనందరిని అడిగెను. కాని ఎవరును మోసుకొనలేదు. దానిలోని విషయమైన సమగ్రముగ చెప్పలేదు. అంతట రాయలు చిక్కప్పను రప్పించి తనకేమైన నుత్తరములోని విషయము తెలియునా యని యడిగెను. చిక్కప్ప తాను వినిన విషయమంతయు పూసగ్రుచ్చినట్లు విపులముగా చెప్పదొడంగెను అతడు చెప్పుచుండగా మరచిపోయిన విషయములు జ్ఞప్తికి తెచ్చుకొనుచు నిజమే యని తల నూపుచుండెను కొంతకాలమయిన తరువాత యింటిలో నెచ్చటనో యుత్తరము కనబడెను. అది యింటిపైకప్పున దంతులలో చెక్కబడియుండెను దానిని తీసిచదువగా చిక్కప్ప చెప్పినదానికిని ఉత్తరములోని దానికిని ఏమాత్రము భేదము లేకుండెను. బుక్కరాయలు చిక్కప్పగారి జ్ఞాపకశక్తికి మెచ్చుకొని మిక్కిలి కొనియాడెను. అతనికి ఉన్నతోద్యోగము నిచ్చెను.

ఇట్లు కొంతకాలము జరిగెను. చిక్కప్పగారి కీర్తి రాజ్యమంతటను వెల్లడియయ్యెను. నానాదిక్కులనుండి గౌరవవార్తలు వచ్చుచుండెను. పొగడ్తలు చూఱగొనుచుండెను. ఒకనాడు రాయలవారు ప్రధానమంత్రిని, సైన్యమును, దండనాయకుని వెంటబెట్టుకొని యితరదేశములపై దండెత్తి తలంచి, చిక్కప్పను పిలిపించి "రాజాధికారమునంతయు నీ చేతిలో నుంచితిని. నేను దండెత్తిపోవుచున్నాను కనక నేను తిరిగి వచ్చువరకు నీవె ఏలుచుండవలెను" అని యనుమతి నిచ్చి తాను వెడలిపోయెను. చిక్కప్ప గర్వపడక, రాజభక్తిగలవాడై ప్రజల క్షేమము నరయుచుండెను. అప్పుడతని తేజఃకిరణములు రాజ్యమంతటను వ్యాపించెను ప్రతిసభలయందును, అతనిని స్తుతింపని వారులేరు రాజ్యము రామరాజ్యమా యనిపించుచుండెను. ఇట్లతడు ఒకవారము ఏలెను. రాయలు తిరిగి వచ్చెను. ప్రజల సంతోషాతిశయము గని, చిక్కప్పగారి రాజభక్తిని మెచ్చుకొని అతనికి వడయార్ అను బిరుదము నొసంగెను అతనిని తన చెంత చేరదీసి "చిక్కప్పా! నీ రాజభక్తికి మెచ్చితిని. నీ తెలివితేటలకు సంతసించితిని. ఏమి వరము కావలయునో కోరుకొనుము దానిని తీర్చెదను" అని పలుక, చిక్కప్ప "ప్రభూ! శరీరములు బుద్బుదప్రాయములు కనుక తినవుపై నాకాశ లేదు. కాని కీర్తిని శాశ్వతముగ నిలుపుకొనుటకుగాను తటాకములు, అగ్రహారములు కట్టించెదను. దానికి తగిన సహాయము చేయుము" అని ప్రత్యుత్తర మిచ్చెను అతని కోరిక ప్రకారము రాయలు వెంటనే బొక్కసములోని ధనము తీయించి అతని కొసంగెను. వెంటనే చిక్కప్ప తన తన జన్మస్థానమున కరుదెంచి రెండుగ్రామములను, ఒకపెద్ద తటాకమును కట్టించెను. తన రాయల పేరుతో నొక గ్రామమునకు



5 వ ఆంధ్రరాష్ట్రి వ్యాయామకళా పోటీపరీక్షలు.

ఏలూరులో జనవరి 9 వ తేదీన శ్రీ రాజా ఎం. రంగయ్యాప్పారావుగారి అధ్యక్షతను జరిగెను. ప్రొఫెసర్ రాజగోపాల్ గారు పోటీలను నడిపిరి. ఏలూరు పురపాలకసంఘాధ్యక్షులు శ్రీ శీర్ల బ్రహ్మయ్య, మద్రాసుకౌన్సిలు అధ్యక్షులు ఆర్. బి. రామకృష్ణంరాజుగారు మున్నగువారు హాజరైరి.

భారత రాజకీయాలు :

సర్వోదయ దినము

లోకం ఒకసారి తిరిగి గతాన్ని స్మరించింది

అజాతశత్రువైన గాంధీ మహాత్ముడు నిర్భాగ్యుడైన ఒక యువకుని పిస్తోలుగుండు కెరయై దేహం చాలించి సంవత్సరం గడిచిపోయింది. ఆ నాటి ప్రజల శోకార్తరవాలు ఈనాటికీ మన హృదయాన్ని స్పందింపచేస్తున్నాయి. సర్వదేశాలమధ్య సౌజన్య సౌహృదాలను సాధించాలనే తలపుతో స్థాపించబడిన ఐక్యరాజ్యసమితి ఈ విషాదవార్త విని సంచలితమైపోయింది. కరుణామూర్తియైన గాంధీమహాత్ముని శరీరవాణి మణగిపోయినా, అశరీరవాణి తరతరాలకూ సంశ్రవణం కాగలదనీ, మానవసాన్నిధ్యంలో రూప మంతరించినా తత్ప్రకాశం ధ్రువజ్యోతి వలె విశ్వవ్యాప్తమై స్థిరంగా ప్రకాశించగలదనీ సర్వదేశ నాయకులూ సంభావించారు. అకస్మాత్తుగా భగ త్సాక్షాత్కారం చేసుకొన్నవానివలె సర్వదేశపతాకలూ శిరస్సులు వంచి భక్తి వినమ్రత ప్రకటించాయి. సంతప్తహృదయులైన భారతీయులు కన్నీరు తుడుచుకొని ఆత్మగ్లానినుంచి కొంచెం తెప్పరిల్లారు. పుణ్యతిథినాడు తిరిగి సర్వం మనకు మనోగోచర మౌతున్నది. ప్రతి పల్లెలోనూ, ప్రతి బస్తీలోనూ, ప్రతి నగరంలోని ప్రతి మూలనూ తిరిగి ప్రజలు ఆనాటి విషాద ఘట్టాన్ని సంస్మరించుకొన్నారు. వీథి వీథిలో బాలబాలికలు రామధ్వని కీర్తిస్తూ గాంధీ మహాత్ముని ప్రతిరూపాల నూరేగించారు. గుమ్మాలలో నిలబడి స్త్రీ పురుషులు కన్నీరు తుడుచుకున్నారు.

అన్యదేశాలలో పీడిత ప్రజలు అహింసా సత్యాగ్రహ సిద్ధాంతాలను మననం చేసుకొని ఏ నాయకుడైనా ఈ రీతిని ముక్తి ప్రసాదించి ద్వేషపూరిత విశ్వంలో ప్రేమ సౌభ్రాతృత్వాలను వ్యాప్తిచేయగలడా అని నిరీక్షిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అయోమయంలో పడి దరి కానకున్నది ఈ సమయంలో గాంధీమహాత్ముని ఆత్మసంపదకు వారసుడైన పండిట్ నెహ్రూ పీడితప్రజలకు ఆశాసందేశాన్నిచ్చాడు. ఢిల్లీలో అఖిల ఆసియా ప్రభుత్వాల సమావేశం జరిపి పరపీడననూ అన్యాయాన్ని ప్రజానీక ఇంకెంత మాత్రం సహించజాలదని ప్రకటించాడు. ఇండోనీషియాలో నిరాయుధులైన ప్రజలపై దురాక్రమణకు దిగిన డచ్ ప్రభుత్వాన్ని, పూర్వ సామ్రాజ్యమనస్తత్వాన్ని విడిచి చరిత్ర గతిని గ్రహించి వర్తించాలని హెచ్చరించాడు. ఆసియా దేశాలొకటై దృఢనిశ్చయంతో విదేశ శాసనసత్వాన్ని నిర్మూలించాలని ఆదేశమిచ్చాడు.

ఇందులో అహంకారం లేదు, విద్వేషం లేదు, తంత్రం లేదు. అంగుకల్లనే పరస్పర కలహాలలో మునిగియున్న దేశాలుకూడా ఈ సమావేశంలో ఏకకంఠంతో డచ్ దురాక్రమణను ఖండించాయి.

ఐక్యరాజ్యసమితి నిస్సహాయస్థితిలో నుంచిగా తిరిగి జీవంపోసి విశ్వసౌభ్రాతృత్వ సాధన ఒక్కటే ఈ సమావేశ లక్ష్యమని పండిట్ నెహ్రూ స్పష్టపరిచాడు. ఐక్యరాజ్యసమితి ఢిల్లీ సూచనల నంగీకరించలేకపోతే ఆసియా రాజ్యాలన్నీ కర్తవ్యం గ్రహించి అవసరమైతే డచ్ రాజ్యాన్ని ఆర్థికంగా వెలివేయాలని సూచించాడు. అమెరికా ఢిల్లీ సమావేశానికి హర్షం ప్రకటించింది. కాని క్రియలో ఆసియా దేశాలను తృప్తిపరచలేక పోయింది.

అయితే భారతీయుల సహృదయతనూ, సత్యశీలతనూ అమెరికా గ్రహించగలిగింది. ఇకనుంచి ఆసియా రాజ్యాలను నిరాదరణతో పరిగణించడం లాభదాయకం కాదని గ్రహించింది. ఆర్థిక సహాయ కార్యక్రమంలో ఆసియా రాజ్యాలకూ, ముఖ్యంగా భారతదేశానికీ ఈ పర్యాయం స్థాన ముంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ ప్రకటించాడు.

* * *

పండిట్ నెహ్రూ భారతదేశానికి ఆసియాలో ప్రధానస్థానం తెచ్చిపెట్టగలిగాడు. కాని ఆంతరంగికంగా దేశం బలపడాలనీ, అప్పుడే ఈ నాయకత్వం నిలుస్తుందనీ హెచ్చరించాడు. ముందు ఆర్థికస్వయంసంపూర్ణత సాధించడం అత్యవసరం.

దేశంలో పరిశ్రమల యజమానులు కార్మికులు సంపద్వృద్ధికి ఎంతైనా కృషి చేయవలసి ఉండగా, వారు బాధ్యత గుర్తించినవారివలె వర్తించడంలేదని పండిట్ నెహ్రూ చెప్పాడు. ప్రభుత్వాన్ని సందేహించి పరిశ్రమలను వృద్ధిపరచకుండా పరిశ్రమల యజమానులు దేశఆర్థికస్థితిని హీనపరుస్తున్నారు. ఏయే పరిశ్రమలను ఏ రీతిగా నియమబద్ధం చేయగలరో, వీనిని ఇదివరలో ప్రభుత్వం అనేకసార్లు స్పష్టపరిచింది. ముఖ్యపరిశ్రమ లన్నిటినీ ప్రభుత్వం వశపరుచుకోదని వాగ్దాన మిచ్చారు. ధనవంతులు వ్యక్తిగతంగా వృద్ధిపరచడానికి అపారమైన అవకాశాలు ఇస్తున్నారు. సందేహాలనూ, స్వార్థభయాశయాలను వదిలి దేశఆర్థికస్థితిని చక్కబరచడానికి ధనవంతులు కృషి చేయ్యకపోతే దేశం అధోగతిపాలవుతుందని హెచ్చరించాడు.

కార్మికులలో సంచలనంకూడా అధికంగా ఉంది. ఒకవైపున రైల్వేకార్మికులు, మరొకవైపున తంతితపాలశాఖవారు కూడ సమ్మెచేయగలరని బెదిరిస్తున్నారు. చెన్నపట్నంలో బస్సుకార్మికులు అకస్మాత్తుగా సమ్మెచేశారు. రాష్ట్రప్రభుత్వం ఈ సమ్మెను అతి కఠినంగా అణచివేసింది. దీనివల్ల ఎంతోమంది కార్మికులు జీవనాధారం పోగొట్టుకొన్నారు. రవాణా సౌకర్యానికి అలవాటుపడిన ప్రజలు చాలా ఇబ్బందులకు లోనైనారు. ప్రజలకు కార్మికులపట్ల క్రోధం కలిగింది. ఇతర కార్మికసంస్థలు ప్రభుత్వచర్యపట్ల క్రోధం వహించినప్పటికీ అణచుకొని పరిస్థితిలో జోక్యం చేసుకోకపోవడం ప్రజల అదృష్టమే. రైల్వేకార్మికులు, తంతి తపాలాశాఖోద్యోగులను సంతృప్తిపరచడానికి భారతప్రభుత్వం కొంత యత్నించింది. ఆ సంఘాల నాయకులతో సంప్రతింపులు జరుపుతున్నది. తంతి తపాలా శాఖవారికి చేయగలిగినంత చేశారనీ, ఇంక మరి కోర్కెలు తీర్చడానికి ప్రభుత్వానికి తగిన ఆర్థికబలం లేదనీ తంతి తపాలాశాఖా మంత్రి రఫీఅహ్మద్ కిద్వాయ్ చెప్పాడు. ఉద్యోగులు మాత్రం తృప్తిపడలేదు. మార్చిలో సమ్మెచేసి తీరగలరని బెదిరిస్తున్నారు.

కార్మికులు అన్నిరంగాలలోనూ యజమానులపట్ల విరోధంవహించి సమ్మెచేయగలరని బెదిరించడంకూడా పైరీతిగానే సమర్థనీయమైనది కాదని పండిట్ నెహ్రూ చెప్పాడు. కష్టాలుంటే ప్రభుత్వం ఏర్పాటుచేసిన పరిష్కారసంస్థలద్వారా తీర్చుకోడానికి యత్నించాలి. ప్రభుత్వం ఇరుపక్షాలలూ విచారించి, దేశపరిస్థితుల కనుగుణంగా న్యాయానికి విరుద్ధంగాకుండా ఇచ్చేతీర్పును ఇరుపక్షాలూ అంగీకరించాలి. కార్మికులకు పూర్తి సంతృప్తి కలిగించలేకపోవచ్చును. కాని ప్రస్తుత పరిస్థితులే క్లిష్టంగా ఉన్నందువల్ల కొంతకాలం కార్మికులు కొంత కష్టాన్ని సహించాలి. అది దేశంకోసం చేస్తున్న త్యాగమని వారు భావించాలి. కార్మికులు, వారి యజమానులు పరస్పర ద్వేషాలు నిత్యవిరోధం పెట్టుకోవడం వారి క్షేమం కాదు, దేశానికీ క్షేమం కాదని పండిట్ నెహ్రూ హితవు చెప్పాడు.

* * *

దేశంలో ఆంతరంగికంగా బలానికి ముప్పు తెస్తున్న కమ్యూనిస్టుల బాధ నివారించడానికి కాంగ్రెస్ సంఘాలు ఇప్పుడిప్పుడే యోచిస్తున్నాయి. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమ్యూనిష్టు పార్టీని నిరోధించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. హైద్రాబాదులో కమ్యూనిస్టుల ముప్పు అరికట్టడానికి ప్రజల్ని తయారు చెయ్యాలనీ, కాంగ్రెసువాదులు పూర్వసేవాదీక్షతో తిరిగి కృషిచేస్తేనేగాని ప్రజల్ని రక్షించడం సాధ్యపడదనీ రాష్ట్రపతి డా॥ పట్టాభిసీతారామయ్యగారు ఆంధ్రదేశ పర్యటనలో ఉపన్యసిస్తూ చెప్పాడు.

రాష్ట్రపతి డా॥ పట్టాభిగారు ఆంధ్రదేశం పర్యటించి, స్వగ్రామం కూడా దర్శించారు.

ఆంధ్రదేశం పట్టాభిగారిని ప్రేమాదరాలతో సత్కరించింది. వారు 29వ తేదిని ఢిల్లీ వెళ్లిపోయారు. మద్రాసు రెవిన్యూమంత్రిపదవికి రాజీనామా నిచ్చి, అఖిలభారత కాంగ్రెస్ కార్యదర్శిపదవిలో శ్రీ కళావెంకట్రావుగారు ఢిల్లీలో చేరారు.



మచిలీపట్నం పురపాలకసంఘం తరఫున పురపాలకసంఘ అధ్యక్షుడు అచ్యుత రామయ్యగారు పట్టాభిగారికి పౌరస్వాతంత్ర్యపత్రాన్ని సమర్పిస్తూ ఉండగా తీసిన ఛాయాచిత్రం.

చిక్కరాయసముద్ర మనియు, గెంతవ గ్రామమునకు రాయలవారి భార్యయగు వసంతమ్మ అను పేరుతో అనంతసాగరమనియు పేరుపెట్టెను. (అనంతసాగర మిపుడు అనంతపురముగా మారినది). తనకు దోస్యము చెప్పి, దీవించిన పాముల వాని పేరుతో వేరొకచోట నొక గ్రామము కట్టించి దానికి నాగసముద్ర మను పేరుపెట్టెను. (పాములవాని పేరు నాగప్ప). అచ్చట నొక చిన్న తటాకముగూడ కట్టించియున్నాడు. ఇవి యిప్పటికిని నిలిచియున్నవి. మునుపటికన్న నానాటికి వృద్ధియగుచున్నవి. దేవరకొండమీద నొక ఆంజనేయస్వాములవారి దేవాలయము, కొండసమీపమున సత్రములు కట్టించియున్నాడు.

రాయలవారి మన్ననపొంది, పెద్దపెద్ద తటాకములు కట్టించిన చిక్కప్పవడెయార్ గొప్ప అదృష్టపురుషుడు. శాశ్వతకీర్తితేజుడు. జీవితధన్యుడు. స్వార్థరహితుడు. ఇన్ని గ్రామములు కట్టించి, తటాకములు నిర్మించిన చిక్కప్ప వడెయార్ తన పేరుతో నొక కట్టడమైన కట్టించియుండలేదు. ఇది యతని స్వార్థరాహిత్యమును వెల్లడిచేయుచున్నది. స్వార్థరాహిత్యమే గొప్పవారి ముఖ్య అభిప్రాయము. చిక్కప్పవడెయారును కన్న తల్లిగర్భము ధన్యమయ్యెను. నిత్యమతని కీర్తి అలరారుగాక !

భారతదేశంలో గృహవసతిలోపం

ఐక్యరాజ్యసమితి సాంఘిక వ్యవహారసంఘ నివేదిక

భారతదేశంలో దుస్సహంగా ఉన్న గృహవసతి లోపం గురించి ఐక్యరాజ్యసమితి సాంఘిక వ్యవహార శాఖ ఒక నివేదికను తయారుచేసింది.

ప్రపంచంలో గృహవసతిలోపం గురించి ఈ శాఖ తయారుచేస్తున్న నివేదికల్లో ఇదే మొదటిది ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళిక నొకదాన్ని వెంటనే తయారుచేసి అమలు జరుపవలసిన అవసరం ఉందని ఈ నివేదిక సూచిస్తూన్నది.

ఇంత దుస్సహ పరిస్థితికి హేతువు జనాభా పెరుగుదల అధికంగా ఉండి, ఆర్థిక జీవనప్రమాణం అతిహీనంగా ఉండడం వల్లనని నివేదిక చెపుతున్నది.

ప్రజారోగ్య సమితి అభివృద్ధి సూచనలకై 1945 లో కొందరు నిపుణులతో ఈ శాఖ నియమింపబడింది

యుద్ధం ప్రారంభమవడానికి ముందే, అవగా జనాభా బస్తీలకు అత్యధికసంఖ్యాకులుగా వెళ్ల డానికిముందే పరిస్థితులు సామాన్యంగా ఉన్నప్పుడే, భారతదేశంలో మొత్తం జనాభాలో నూటికి 4 వంతులమంది మాత్రమే కొంత వైశాల్యము, చోటు గల ఇళ్లలో నివసించేవారని నివేదికలో చెప్పబడింది

గృహవసతిలోపం తీర్చడానికి ముఖ్యకారణాలు నాలుగు వివరించారు :

1. యుద్ధఫలితంగా ఆహారోత్పత్తి వృద్ధిపరచడానికే సర్వసాధనలూ వినియోగించవలసి వస్తున్నది. 2 క్రమంగా పాడౌతున్న యరిత్రె పరికరాల్ని తీసేసి కొత్తవి తేవడం దుస్సాధ్యమయింది. 3. దేశవిభజనఅనంతరం సంభవించిన కల్లోలం ఫలితంగా పంజాబ్, పశ్చిమోత్తరరాష్ట్రం, సింధురాష్ట్రాలనుంచి దాదాపు కోటిమంది ప్రజలు నివాసాలు కోల్పోయినారు. 4. గృహనిర్మాణానికి సంబంధించిన నియమాలను ప్రభుత్వం అమలుజరుపజాలకపోయింది.

ధనవంతులైన వారిలో గృహనిర్మాణం చేసేవారు ఎవరికి గృహవసతి ఎంత చేకూర్చాలో శ్రద్ధ వహించలేదు. అద్దెలధికంగా రావడం వలననూ, అమ్మకపు ధరలు చాలా హెచ్చుగా ఉండడం వల్లనూ, ధనవంతులైనవారికే గృహవసతి చేకూర్చడంలో గృహనిర్మాణకర్తలు నియుక్తులైనారేకాని మధ్యతరగతివారి అవసరాలనూ, పేదల అవసరాలనూ పాటించలేదు. చాలాధనం సినిమామందిరాలు, వ్యాపారభవనాల నిర్మాణానికి వెచ్చిస్తున్నారు.

అందువల్ల ఈ సమస్యను పరిష్కరించాలంటే గృహనిర్మాణ నిర్వహణా సంస్థ నొకదానిని (పబ్లిక్ హౌసింగ్ అథారిటీ) స్థాపించాలని ఈ శాఖవారు సూచించారు.

గృహ వసతి చిక్కుల్ని ముందుగానే గమనించి మద్రాసువంటి కొన్ని రాష్ట్రాలు ముందే జాగ్రత్తపడి శాసనాలుచేసినప్పటికీ, ప్రస్తుతపరిస్థితులకనులంగా వానిని అమలుపరచలేకున్నా రని నివేదికలో చెప్పబడింది.



డాక్టర్ పట్టాభిగారిని ఊరేగించుతూవున్న దృశ్యం

భారతీయనాటకసాహిత్యం

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

సంస్కృత నాటకసాహిత్యం అతి సమృద్ధముగా ఉన్నది. కాని దానికి వారసులైన తెలుగులోమాత్రం 50 ఏండ్ల క్రిందటి వరకూ నాటకసాహిత్యం శూన్యమని చెప్పవచ్చును. ఆశ్చర్యకరమైన విషయ మేమంటే, భారతదేశంలోని ఏభాషలోకూడా ఆధునిక సమయంవరకూ నాటకములే రచింపబడలేదు. కథోపకథనములతో సంభాషణారూపకంగా గ్రంథములు వ్రాయబడినన్నూ వాటిని నాటకములనడమునకు వీలులేదు. మనం ఆదర్శమైన సంస్కృతనాటకములను వదలి సంగీతమయమైన వీథినాటకములను అలవాటు చేసుకొన్నాము. యిల్లే ప్రతిప్రాంతీయవాసులూ తమఅభిరుచులకు ప్రజాసామాన్యభావములకూ తగినట్లు నృత్యములన్నూ నాటకవినోదములనూ ఏర్పాటు చేసుకున్నారు. ఆదర్శనాటకశాలలు లేనందువలన సంస్కృతములోవలె ఆదర్శ నాటకములు తయారుకాలేదు.

నేడు ప్రాంతీయ భాషలలో ముఖ్యంగా బెంగాలీ, హిందీ, గుజరాతీ, ఆంధ్రభాషలలో నాటక సాహిత్యం వృద్ధి పొందినది. యిండియాలో ముఖ్యనగరములలో అనేక థియేటర్లూ నాటకసమాజములూ వెలసినవి. ప్రజల్లో నాటకాభిరుచి వృద్ధిపొందినది. సినిమాలవలన నాటకాభిరుచి వృద్ధిబొందినదే కాని క్షీణించలేదు. అనేకమైన ఉత్తమనాటకములు లిఖించబడినవి. ఎక్కువభాగం పౌరాణికనాటకములే యైనా సాంఘిక నాటకములకు కూడా కొఱత లేదు. సాంఘికనాటకములపైన యిబ్సన్, బెర్నార్డ్‌షాల ప్రభావం ఎక్కువగాకన్పిస్తున్నది. ప్రాచ్య పాశ్చాత్యపద్ధతుల కలయికతో అనేక నాటకములు తయారైనవి. నాటకసాహిత్యంపై పాశ్చాత్య నాటకసాహిత్యప్రభావం ఎక్కువగాఉన్ననూ, భారత జాతీయతకు వ్యతిరేకమైన దుఃఖాంత నాటకపద్ధతిని మనవారు అనుకరించక పోవడం ముదావహమైనది.

ఆధునిక నాటక సాహిత్యం బెంగాలీలో అతి ఉత్తమమైనదున్నది. యితర ప్రాంతీయ భాషలలో వలె బెంగాలీలోకూడా 19వ శతాబ్దమునకు ముందు నాటకసాహిత్యంలేదు. అప్పుడు జయదేవునియొక్క కృష్ణలీలలను అభినయం చేసేవారు. వాటినే సంగీతనాటకములవలె ప్రదర్శించేవారు. కానీ అవి నేటినాటకములకుగానీ ప్రాచీన సంస్కృతనాటకములకు గానీ సంబంధించవు. కేవలం భక్తి భావనా ప్రదర్శనమునకే ఆ నాటకము లుపయోగపడుచుండెను. మొట్టమొదట 1757 లో కలకత్తాలో నాటకశాల నిర్మించబడినది. కానీ దానిలో కేవలం ఆంగ్ల నాటకములనే ప్రదర్శించేవారు. ప్రాంతీయభాష కందులో స్థానం లేదు. ఈ ఆంగ్ల థియేటర్ కలకత్తాలోని పెద్దల నాకర్షించినది. ప్రాంతీయభాషల్లో కూడా నాటకప్రదర్శనములు చూడవలెనను ఆసక్తి ప్రజలకు కలిగినది. తత్ఫలితంగా 1857 లో కలకత్తాలో శ్యాంబజారులో "విద్యాసుందర్" నాటకము ప్రదర్శించబడినది. క్రమంగా నాటక ప్రచారంతోబాటు "నాటకమండల్" లు యెక్కువైనవి. చాలాకాలం వరకూ బెంగాలీ నాటకములను ఏ పెద్దమనిషియింటిలోనో ప్రదర్శించేవారు. చాలాకాలం వరకూ నాటకములు సామాన్య ప్రజల కందుబాటులో లేవు. చాలాకాలం తరువాత గిరిజా చంద్రఘోష్ మొదలగు, పెద్దలతో (*National Theatre*) స్థాపించబడేవరకూ నాటకములకూ, ప్రజా సామాన్యమునకూ సంబంధం ఉండేదికాదు. తరువాత అనేక ప్రజా ప్రదర్శన సంఘములు తయారైనవి. అప్పటి నాటకములు వరకట్నంవంటి సాంఘిక సమస్యా పరిష్కారములుగా ఉండేవి. కేవలం దుస్తులతో పొందే సభ్యతాగర్వాన్నీ ప్రాశ్చాత్య వ్యామోహాన్నీ ఆ కాలపు నాటకాల్లో తీవ్రంగా విమర్శించేవారు.

మైకేల్ మధుసూదనదత్తు డియల్‌రాయ్ రవీంద్రనాథ్‌టాగూర్ బెంగాలీనాటక సామ్రాట్టులు. "ఏకకేకే సబాలే సభ్యతా, కృష్ణకుమారీ" మొదలగునవి మైకేల్‌దత్తుగారి అమూల్యగ్రంథములు. రాజారాణీ విసర్జన వాల్మీకి ప్రతిభ మొదలైనవి రవీంద్రుని ప్రముఖ నాటకములు. రవీంద్రుని నాటకములు కూడా అతని కవితవలెనే అతిగంభీరమైనవి గనుక ప్రజాసామాన్యుల స్టేజీకి పనికిరావు. అతని నాటకాలనూ చూచే దర్శకులుకూడా విద్యావంతులైతేనే కానీ అర్థంచేసుకొనజాలరు. బెంగాలీ నాటక సాహిత్యంలో యుగాంతరాన్ని స్థాపించినవి. అతని నాటకములలో ఉన్నత జాతీయాభిమానం పవిత్ర త్యాగభావనా తొణకిసలాడుచుండును. ఇతిహాసక్రమం చెడకుండా భావుకత్వం కెంపో బిగువు చెడని ధారాప్రవాహంతో యీ నాటకములు నిండియున్నవి. యితని నాటకములలో అంతర్ద్వంద్వములకే ప్రాధాన్య మివ్వబడినది. నిస్సందేహంగా డియల్ రాయ్‌ని "భారత షేక్‌స్పియర్" అనవచ్చును. యితని నాటకములను ఆంధ్రములో అనువదిస్తే ప్రజాసామాన్యాభిరుచి ఉత్తమనాటకసాహిత్యంవైపు మళ్లించవచ్చును.

మరాఠీనాటకసాహిత్యంకూడా నవీనమైనదే. కర్నాటక నాటకాదర్శంలో మరాఠీనాటక సాహిత్యం నిర్మించబడినది. మొట్టమొదట మహారాష్ట్రంలో సంస్కృతనాటకానువాదములను ప్రదర్శించేవారు. మహారాష్ట్ర నాటకరంగం నిర్మాతలలో ముఖ్యుడు సాంగ్లీరాజా. మహారాష్ట్రంలో "శివాజీ" వంటి ఐతిహాసిక నాటకములకు ఎక్కువ ప్రచారమున్నది. యిక మహారాష్ట్రంలో "శారద" వంటి సాంఘిక నాటకములకు కూడా కొదవలేదు. మహారాష్ట్ర నాటకసాహిత్యం నేడు సమృద్ధంగా ఉన్నది.

గుజరాతీ ఆధునిక నాటకసాహిత్యం కూడా సంస్కృతానువాదములతో ప్రారంభించబడినది. ప్రథమంలో గుజరాతీ భాషాప్రాంతమంతా ఫారసీ నాటక కంపెనీలతో నిండియుండేది. ఆ ఫారసీ థియేటర్లవారు అతి అశ్లీలంగా వివేకశూన్యంగా అసంగతవిషయాలతో నిండిన నాటకములను ప్రదర్శించేవారు. భారత సంస్కృతిని నాశనంచేసే యీ కంపెనీలతో విరక్తిజెందిన కొందరు పెద్దలు స్వతంత్ర గుజరాతీ నాటకరచనకు ప్రదర్శనకు పూనుకోవడంతో ఆధునిక గుజరాతీనాటక సాహిత్య ప్రారంభమైనది.

ఇక సంస్కృత కావ్యానువాదాలతో నిండిన విశాల హిందీప్రాంతంలో కూడా 19వ శతాబ్దంవరకూ నాటకములే నిర్మింపబడలేదు. ప్రాచీనహిందీలో గద్యం లేకపోవడమే యిందుకు కారణం కావచ్చును. గద్యంలేకుండా నాటకరచన అసంభవముకదా. హిందీప్రాంతవాసులు ముఖ్యంగా మహమ్మదీయుల సహాయం లేనందువల్లనే నాటకనిర్మాణం జరగలేదందురు. లలితకళాపిపాసువులైన మహమ్మదీయ ప్రభువులు హిందీకావ్యాలకు ప్రోత్సాహ మిచ్చికూడా నాటకరచన కెందుకు దోహదం చేయలేదో అనూహ్యం. హిందీనాటక సాహిత్యశైశవావస్థలో హిందీప్రాంతం పారసీథియేటర్లమాత్రమే ఉండెను. వారిభాష ఉర్దూ ప్రపంచములో అత్యనుచితనాటకములను ప్రదర్శించునది ముఖ్యంగా యీ పారసీ థియేటర్లవారే. వీరు సీతను పార్సీదుస్తులతో అలంకరించి శ్రీరాముని బంట్రోతుగా హనుమంతుని నేటి బిళ్లజవాను వేషంలో నిలబెట్టేవారు. భారతేందు హరిశ్చంద్ర మొదలగు కవులు అనేక నాటకములను వ్రాసి అనువదించి హిందీ నాటక పితామహులైరి. జయశంకరప్రసాద్ మాఖనలాల్ చతుర్వేద ఉపేంద్రనాథ అశ్క మొదలగువారు ప్రముఖ హిందీనాటకకారులుగా ఎన్నబడుదురు రాజకీయనాయకులైన సేఠ్ గోవిందదాస్, కె. యం. మున్షీ లీలావతి, మున్షీ మొదలగువారుకూడా ఉత్తమనాటకములను రచించిరి హిందీనాటకకారులలో ప్రముఖుడు జయశంకరప్రసాద్. అతడు గాఢమైన యితిహాసాధ్యయనంతోబాటు తన భావుక కవిహృదయాన్ని మేళవించి అనేకైతిహాసికనాటకములను రచించెను. కానీ అతని నాటకములు ప్రదర్శన కసాధ్యమైనవి. హిందీలోని అనేకనాటకములకు ప్రదర్శనభాగ్యం లభించలేదు మొత్తానికి నేడు హిందీప్రాంతవాసులు పారసీథియేటర్లపీడను వదలించుకొన్నారు. వ్యాపారసంఘాలేగాక సాహిత్యరసికులుకూడా అనేకనాటక సంఘముల నేర్పాటుచేసుకొన్నారు. అనేక సాహిత్యక హిందీనాటకములు రేడియోలో ప్రసారం చేయబడుచున్నవి.

యిక తెలుగునాటకసాహిత్యం అందరికిన్నీ సుపరిచితమే. మనకుగూడా ప్రాచీన నాటక సాహిత్యంలేనట్లే తెలుగువాళ్ళు రంగస్థలాన్నంతగా నిర్లక్ష్యం చేయలేదు నాటకము లెక్కువగా రచించబడినా ప్రదర్శించబడిన వాటి సంఖ్య తక్కువ యిప్పటికే పట్నాల్లోగానీ పల్లెల్లోకానీ పౌరాణికనాటకములే ప్రదర్శింపబడుచుండును ప్రదర్శించబడే తెలుగు సాంఘిక నాటకముల సంఖ్య చాలా తక్కువ. మా రాయలసీమలో కేవలం కనకతార కృష్ణలీలలనే ఎక్కువగా ప్రదర్శిస్తారు నాటకములను సాంఘిక సమస్యాపరిష్కారములకు మన మంతగా ఉపయోగించలేదు. మనతెలుగుల్లో ప్రతాపరుద్రీయమువంటి ఉజ్వలైతిహాసికనాటకములూ కన్యాశుల్కంవంటి ఉత్తమోత్తమసాంఘిక నాటకములూ ఉన్నవి. యివి అనేకమార్లు సఫలంగా ప్రదర్శించబడినవి. ఎంత క్లిష్టమైన నాటకమునైనా నిపుణులైన విద్యాధికనటులు సాఫల్యంగా ప్రదర్శించగలరు. తెలుగునాటకాలపై అభిరుచి ప్రజల్లో ఏమీ తగ్గలేదు. కానీ పేరుపొందిన పెద్దనటుల ఘృణితమైన నీచప్రవర్తన చూస్తుంటే తెలుగునాటకరంగం భవిష్యత్తు విషయమైనా కంత ఆశావహంగా లేదు యిక యీ పెద్దనటులతో తెలుగునాటకరంగం వృద్ధిపొందడం కల్ల. నాటకరంగంపై ఆసక్తి గల రచయితలూ విద్యాధికనటులూ పూనుకొంటేనే తెలుగు నాటకరంగం సంస్కరించబడగలదు. ఒక నాటకోజ్వలతార యీ ప్రొహిబిషన్ రోజుల్లో కూడా మదిరాపానమత్తుడై చిన్న స్త్రీయాక్టర్లతో అసహ్యంగా ప్రవర్తించడం నేను చూచితిని. మననటుల స్థితి యిట్లున్నది.

మన తెలుగులోనే గాక అనేకభాషల్లోని రచయితలు కూడా నాటకానికి స్టేజీకీ ఉన్న అవినాభావసంబంధమును మరిచిపోతున్నారు నాటకం సాహిత్యంలో మణివలె ఉత్కృష్టమైనదైనా స్టేజీ కుపయుక్తం కానట్లయిన గాజు పూసతో సమాన మేకదా. స్టేజీపై ప్రదర్శించబడినప్పుడే నాటకంరచయితపరిశ్రమకూడా సార్థకమగును. విజ్ఞులైన లేఖకులుకూడా నాటకములను అతిదీర్ఘంగా రంగస్థలప్రదర్శనాసాధ్యమైన పద్ధతుల్లో రచించడం విచారకరమైనది. సంక్షిప్తమైన సినిమాలు చూచే యీ రోజుల్లో మానవులంతా కార్యభారంలో నిమగ్నులై ఉండడంవల్ల అతి దీర్ఘ నాటకములను చూడడానికి ప్రేక్షకులంతగా ఉత్సహించరు పైగా నాటకంలో కొన్ని అంకములు సంక్షిప్తం జేసి ప్రదర్శిస్తే నాటకంలోని బిగువు చెడిపోవును. రంగస్థలంపై దృష్టి పూర్తిగా కేంద్రీకరించి రచించబడిన నాటకములే జయప్రద మగును

తెలుగులో అనేక ఏకాంకనాటకములు రచింపబడినవి. నాటక మొక సాగరమైతే ఏకాంకనాటక మొక చిన్న సెలయేరు. ఏకాంకనాటకం, నాటకంవలె దీర్ఘరసోద్రేకాన్ని కల్గించకున్ననూ చల్లని శీకరములవలె ఆనందింపజేయును. నేటి ఏకాంకికలు ప్రాచీనరూపకములకంటే పాశ్చాత్యరూపకములను ఎక్కువగా అనుకరిస్తున్నవి. అవి రేడియోల కెక్కువ ఉపకరించును. దీర్ఘమైన కథాసరిత్సాగరములను వదలి చిన్ని చిన్ని కథానికల నాశ్రయించినాము. నాటకములకంటే ఏకాంకికలవైపు మొగ్గుతున్నాము. కావ్యాలకంటే వర్ణనాత్మక ముక్తకములకే ప్రాధాన్య మిస్తున్నాము. మన తెలుగులో ప్రహసనములు తక్కువ. అనేక ప్రహసనము లున్నా హాస్యరసోద్రేకమును కల్గించునవి చాలా తక్కువ. తెలుగులో హాస్యరసమే తక్కువ. ఎవరో ఒక రిద్దరు తప్ప హాస్యరసాత్మక రచనలను సాఫల్యంతో చేసినవారు తక్కువ. ఉర్దూ అరవవార్ల రచనలోవలె మన రచనల్లో హాస్యతత్వం అంతగా ఉండదు. నేడు ప్రహసనముల అవసరం ఎంతైనా ఉన్నది.

అన్నిటికన్నా ముఖ్యమైనది జాతీయనాటకశాల. సరియైన నాటకగృహాము లేనిదియే చివికిపోయిన డేరాలలో నాట్యభారతి వికసిస్తుందనుకోవడం భ్రమయే యగును. మన పూర్వీకులు నేటి యూరపియన్ థియేటర్లవంటి నాటక గృహములను నిర్మించేవారు. ఆ గృహములను రంగస్థల దర్శకస్థలములుగా విభజించేవారు ధనికులకూ జనసామాన్యమునకూ వేర్వేరుగా నాటకగృహాము లుండేవి. కులాలవారీగా దర్శకస్థానములు, విదేశీయులకు ప్రత్యేక స్థానములూ ఏర్పాటుచేయబడేవి. రంగస్థలంలో నేపథ్యమునకూ వేషధారణకూ వేర్వేరు భాగములు ఏర్పాటుచేయబడేవి. మొత్తంమీద నాటకగృహములు సర్వసమగ్రముగా ఉండుననుటకు సందేహము లేదు. ప్రాచీనస్థితితో పోల్చినట్లయిన నేటి నాటకరంగముల స్థితి అతిశోచనీయముగా ఉన్నదనుటలో సందేహము లేదు. ప్రాచీనకాలంలో నాటకములకు రాజాశ్రయముండేది. నేడు రాజాశ్రయం ప్రజాశ్రయం లేని మన నాటకస్థితి "ఎవరికి పుట్టితివిరా వెక్కి వెక్కి ఏడుస్తున్నా"వన్న ట్లున్నది.

నేడు మన నాటకములూ నాటకసమాజములూ పూర్తిగా సంస్కరించబడవలెను. ప్రజల్లో ఉత్తమనాటకాభిరుచి పెంపొందజేయవలయును. దీనికిగాను, ముఖ్యంగా సంస్కృతనాటకములూ డియల్‌రాయ్ నాటకములూ అనువదింపబడవలయును. ఉత్తమమైన నాటకగృహములు నిర్మించబడవలయును. ముఖ్యంగా విద్యావంతులైన యువకులు నాటకరంగంలో ప్రవేశింపవలయును. అప్పుడే మన నాటకసాహిత్యం నాటకరంగం సుసంస్కృతం కాగలవు. మనం నాటకాల్ని వాటి కర్మానికి వదిలివేస్తూ అవి బాగుపడలేదని చింతించడం అవివేకమే కాగలదు.

కథానిక :

తండ్రీ - కొడుకులు

శ్రీ వెం" చా" శా.

తండ్రి

వెంపదట్నుంచీ వ్యాపారమే వృత్తిగా పెట్టుకుని బోలెడు ఆస్థి సంపాయించాడు. వ్యాపారంలో కూడా అతనికి ముఖ్యం వడ్డీ వ్యాపారం. సంపాయించిన డబ్బును చిన్న చిన్న పరిశ్రమలలోనూ, చిన్న చిన్న బ్యాంకులు స్థాపించడానికి వినియోగించాడు. డబ్బు పెద జిల్లడంతో ప్రతీదాంట్లోనూ నే వన్నానని అనిపించుకున్నాడు. ఊళ్లోకల్లా అందమైన మేడ అతనిది. అతని కింకేం కావాలి ఉదారపురుషుడు అని పేరు పొందాడు. స్థాపించబడిన కంపెనీలన్నింటికీ (ఆ ప్రాంతాలలో) డైరక్టరుగానో, భాగస్థుడుగానో ఉండేవాడు.

ఒక్కొక్కప్పుడు ఏకాంతంగా ఉన్నపుడు కూచుని ఇంతడబ్బు నేను ఎలా సంపాయించగలిగాను? అని అనుకుంటూ ఉండేవాడు. ప్రారంభదశలో వేరుశెనక్కాయలు, పకోడీలు, గారెలు, తయారుచేసి విద్యార్థులకు అమ్మి జీవితం గడిపినరోజులు అతనికి జ్ఞాపకానికి వచ్చేవి అతనికి ఆశ్చర్యమూ దుఃఖమూ రెండూ వచ్చేవి. ఆతర్వాత జీవితంలోని నిచ్చెనమెట్లన్నీ ఎక్కి అంత ఉన్నతస్థితికి స్వయంకృషివల్లనే రాగలిగానని గర్వపడుతూ ఉండేవాడు.

ఇంత డబ్బు ఉన్నప్పటికీ అతనికి ఒక్క దురలవాటు లేదు. ఆఖరుకు సిగిరెట్టయినా కాల్చడు. ఏంసిగిరెట్టు, ఎందుకు కాల్చాలి? డబ్బు తగలెయ్యడమేగా వృథాగా, అని తనలో తను తర్కించుకుంటేవాడు

బీదవాళ్లు అంటేసరి ఎవరికైనా సహాయం చేసేవాడు. ఆ ఊళ్లో అతనంటే ప్రతీవాడు చేయెత్తి దణ్ణంపెట్టేవాడే. మహారాజు అని అనిపించుకున్నాడు.

అతనికి వయసువచ్చి ముసలివాడు అయ్యే కొద్దీ, డబ్బుమీద ఆసక్తి ఇంకా ఎక్కువైంది కాని తగ్గలేదు. ఇంకా డబ్బు సంపాయించి ఏం చేద్దామనో? కాని అలాంటి చర్చలు మనకు అనవసరం

కొడుకులు

ఇక అతనికి కలిగిన నలుగురు కొడుకులూ నాలుగురత్నాలు. తండ్రిమాటకు ఒక్కడూ ఎదురు చెప్ప ఎరుగడు. కొడుకులు అడిగింది కాదనకుండా వాళ్లకోర్కెలు తీర్చేవాడు. గారాబంగా పెరిగినప్పటికి చదువులో ఏ ఒక్కడూ తీసిపోలేదు. పాపం నలుగురూ తండ్రికి సాయంగానే ఉంటూవచ్చారు. తండ్రిమనస్తత్వ మెలాటిదో కొడుకులదీ అంతే.

పుస్తకాలమీద బోలెడు డబ్బు ఖర్చు పెట్టారు కొడుకులు. మార్కెట్లోకి వచ్చిన ప్రతి క్రొత్తపుస్తకమూ కొనేవాళ్ళు. అందులోనూ పెద్దవాడికి పుస్తకాలంటే మరీపిచ్చి. ఎప్పుడూ చదువుతూనే ఉంటాడు. రెండోవాడికి అందమైన ఆడపిల్లలంటే ఇష్టం. ఎక్కడ మంచి బొమ్మలు కన్పించినా అన్నీ సేకరించి, ఒక్కడూ కూర్చుని ఈమెను పెళ్ళిచేసుకుంటే బావుంటుంది, ఆమెను చేసుకొంటే బావుంటుంది అని ఉవ్విళ్లూరుతూ ఉండేవాడు. ఒక్కొక్కపుడు తండ్రిదగ్గరకు వచ్చి 'నాన్నా ఈమెచూడూ ఎంత అందంగా ఉందో! దేవకన్యను జ్ఞప్తికి తెస్తున్నది కదూ? అనేవాడు. కొడుకుమాటలు విన్నతండ్రికి ఆనందం ఇంతా అంతా కాదు. మురిసిపోయేవాడు. అలాగే నాయనా నీవు కోరినపిల్లనే పెళ్లాడుదుగాని ఏమీ అభ్యంతరం చెప్పను. అనేవాడు.

మూడోకొడుకు మచ్చుకైనవాడు. తండ్రికి చాలముఖ్యుడు. డబ్బులెక్కలూ అవీ చూస్తూ ఉంటాడు. అతనికి వ్యాపారం అంటే ఇష్టం తండ్రివలె. తండ్రికి అతనంటే పంచప్రాణాలు. ఈ వ్యాపారం బావుంటుంది, అది బావుంటుంది అని తండ్రికి సలహా లిస్తూఉంటాడు.

నాలుగోకొడులో ఓ విశిష్టత ఉంది. ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడడు. చూడగానే వేదాంతివలె కన్పిస్తాడు. మౌనం అతనికి ఇష్టం. ఇప్పుడూ భగవంతునిగురించి, సృష్టి అనీ, పారమార్థికం అనీ ఆలోచిస్తూ ఉంటాడు.

౨

నలుగురు కొడుకులూ పెద్దవాళ్లయినారు. జీవితంలో ప్రవేశించే ఈడు వచ్చింది. భవిష్యత్తు సంగతి వాళ్లూ ఏమీ ఆలోచించటంలేదు. తండ్రికి కొంచెం కష్టంగా తోచింది. తనవలెనే కొడుకులుగూడ సంపాయించాలని అతనికి ఆశ. తనకన్నా పెద్దవాళ్లు కాగలరు కొడుకులు అని అతని కోరిక. ఎన్నో కలలు కనేవాడు. కొడుకుల విషయం తల్చుకున్నపుడల్లా అతనికి నిద్రపట్టేది కాదు.

నల్గురి కొడుకులనూ వాళ్ల వాళ్ల వృత్తులలో ప్రవేశపెడ్దామనుకున్నాడు. ప్రతిరోజూ కొడుకులను పిలిచి సలహా లిద్దామనే చివరకు కొడుకులకు ఇష్టమైనట్లే చేద్దాం, అంతా వాళ్లకే వదిలిపెడ్దాం అని నిశ్చయం చేసుకున్నాడు

ఒకరోజు సాయంకాలం సముద్రపు ఒడ్డుకు షికారుకెళ్లినపుడు తనతోకూడా కొడుకులను తీసుకువెళ్లాడు. అక్కడ మాటలసందర్భంలో "ఒరే అబ్బాయిలూ మీ భవిష్యత్తును గురించి ఏమైనా ఆలోచించారా? ఏం చేయదల్చుకున్నారు? అని అడిగాడు. "ఏం వృత్తిలో ప్రవేశిస్తారో నిశ్చయం చేసుకోండి మీ ఇష్టం వచ్చినట్లే నేనూ పోతాను. మొగమాటం పడకండి. జీవితంతోకూడిన పని ఇది. నదురూ బెదురూ లేకుండా చెప్పివెయ్యండి" అని అన్నాడు.

నలుగురు కొడుకులూ ఒకరిమొగం ఒకరు చూసుకున్నారు. పెద్దవాడి ముఖాన చిరునవ్వు తాండవిస్తోంది.

"నాన్నా....." అన్నాడు పెద్దవాడు.

"ఊ " అని ముందుకు వచ్చాడు.

"నాన్నా నేను న్యాయశాస్త్రం చదువుకుని ప్లీడరైపోతాను. ప్లీడరువృత్తిలో బాగా సంపాయించగలననే ధైర్యం ఉంది. పైగా అదంటే నాకెంతో ఇష్టంకూడా. అది స్వతంత్రమైన జీవనం ఇంకొకరిక్రింద బానిసగా పని చేయక్కర్లేదు.. అదే నిశ్చయం చేసుకున్నాను." అని అన్నాడు.

"భేష్ " అన్నాడు తండ్రి.

రెండోవాడు ముందుకు వచ్చాడు."నాన్నా వైద్యశాస్త్రం చదువుకుని నేను డాక్టర్ని అవుతాను. ఎంతమందినో రక్షించవచ్చును. ఎంతో ప్రజోపకారం చేయవచ్చును. ప్రపంచములో ప్రజోపకారానికి మించిన దేముంది? నాకు వైద్యమంటే ఎంతోఇష్టం. డబ్బేకాకుండా బోలెడు పేరు కూడా సంపాయించవచ్చును. అది తప్ప నేను మరోటి చేయను. అదే నా నిశ్చయం" అన్నాడు.

"శభాష్ " అన్నాడు తండ్రి.

మూడోవాడు ముందుకు వచ్చి తండ్రిముఖం వైపు చూశాడు..

"నాన్నా' మనిద్దరం ఒకటే . వ్యాపారం తప్ప మరోదానికి నా మనసు పోదు. వ్యాపారం చేసి నీవలె పెద్ద ధనికుణ్ణి అవుతాను. డబ్బు సంపాయించడానికి అంతకన్నా సులభమార్గమేది? అందులోనూ నీ సహాయంతో ముందుకు పోతాను. నాకు అంతకన్నా ఏం కావాలీ? లక్షాధికారి అయింతర్వాత ఇక చేసే దేముంది? అదీగాక వ్యాపారం స్వతంత్ర జీవనం. ఒకడిక్రింద సేవకావృత్తి చేయ నవసరం లేదు. నిన్ను మనసులో ఉంచుకుని వ్యాపారం సాగిస్తాను. అదే నా నిశ్చయం..."అని ఘట్టిగా చెప్పాడు.

"రైట్" అన్నాడు తండ్రి.

నాలుగోవాడు నలుగురి ముఖాలు వింతగా చూస్తూ ఒక వికటాట్టహాసంచేసి సముద్రం వైపు చూస్తూ "మనది దొంగతనమోయ్...దొంగతనం ఎంత మంచి వృత్తి...మీ కేం తెలుసు? గజదొంగనై పోతాను. స్వతంత్రజీవనం" అన్నాడు.

"ఛీ...నా కడుపున చెడపుట్టావు......" అన్నాడు తండ్రి.

"ఇంత నీచపుబుద్ధి పుట్టిందేం నీకు?..." అని ముగ్గురు కొడుకులూ అన్నారు.

నాలుగోవాడు ఏమీ మాట్లాడలేదు. నా అభిప్రాయం మార్చుకోను అన్నట్లుగా ఇసకలో వ్రేళ్లు గుచ్చాడు. అతన్ని చూసి సముద్రం కూడా నవ్వింది.

"నేను మీకు అక్కరలేకపోతే ఇంట్లోంచి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాను. నేను దొంగతనమే చేస్తాను. నాకు నే నడిగినంత డబ్బు ఇవ్వండి.. తక్షణం వెళ్లిపోతాను. "

నలుగురూ శిలాప్రతిమల్లా ఉండిపోయారు.

"మాట్లాడ రేం? ఏదో సమాధానం ఇవ్వండి... రేపే వెళ్లిపోతాను" అన్నాడు.

"వెళ్లిపో.. ఏ జైల్లోనో బాధలు పడ్తుంటే విని విచారిస్తాము, అంతే.. నీమీద నేను ఆశలు పెట్టుకోలేదు. రేపే చెక్కు రాసిస్తాను" అన్నాడు తండ్రి...

సముద్రపు హోరు వెకిలిగా నవ్వింది.

*　　*　　*

—దాదాపు ఇరవై సంవత్సరాలయినప్పటి విషయం.

తండ్రి మనోవ్యథతో కుంగి కృశించి మంచమెక్కాడు. కంచుగంట కొట్టినట్లుగా దగ్గుతున్నాడు. మంచంచుట్టూ ముగ్గురు కొడుకులూ ముసలమ్మలవలె కూర్చున్నారు—పీక్కుపోయిన కళ్లతో.

ఆ వాతావరణంలో వెనకటి హుందా లేదు. ఇల్లంతా కళావిహీనంగా ఉంది.

"ఇల్లుకూడా అమ్ముకున్నతర్వాత ఇంక చేసే దేముందీ?" అని అంటున్నాడు పెద్ద కొడుకు.

"ఫర్నిచర్ అమ్మితే తీసుకుంటా నన్నాడు కంపెనీవాడు; వాడితో నిన్న మాట్లాడాను." అని అన్నాడు రెండోవాడు సమాధానంగా. మూడోకొడుకు ఎండిపోయిన పెదవులూ, రేగిన జుత్తూ, చినగిన చొక్కాతో బండి తోలేవాణ్ణి జ్ఞప్తికి తెస్తూ బీడీ కాలుస్తూ కూర్చున్నాడు.

"ఏంరా ఏదీ మాట్లాడ వేం?" అని అతన్ని గదమాయిస్తున్నారు.

"ఆత్మహత్యచేసుకుందామా వద్దా అని ఆలోచిస్తున్నాను" అని అన్నాడు. "ఆలోచించటం ఎందుకూ వెంటనే చేసుకోక? ఒకడు తగ్గినా తగ్గనట్టే"...అని మిగతా ఇద్దరూ. ఇదీ అప్పటి వాతావరణం.

మరి మన కందరకూ ఆశ్చర్యం వేయదూ?

"మిగతే ఈ విధంగా ఉండే, ఆ నాలుగోవాడు అసలు ఉన్నాడో ఊడేడో? ఎవరికి తెలుసు? బ్రతికి ఉంటే ఇన్నాళ్లకు తిరిగి రాకుండా ఉంటాడా?" అని మళ్లీ తండ్రిహీన స్వరం వినపడుతోంది.

"ఎప్పుడూ కాలం ఒక తీరుగా ఉంటుందా? వెన్నెలా చీకటీ. ఇక చీకటి రోజులు..." అంటున్నాడు తండ్రి.

"ఇక వెన్నెల రానే రాదు..." అన్నాడు పెద్ద కొడుకు.

"చాల్లేవోయి నీ బోడికవిత్వం...అటు చూడు; నాన్నప్రాణం పోయేట్లు ఉన్నది.. మాట మరీ నీరసం అయిపోయింది...మళ్లీ డాక్టర్ని పిలిచి కొస్తే బావుండు."—అని రెండోవాడు.

"అసలు నీ ముఖం చూస్తే ఏ డాక్టరూ రాడు...నీవుకూడా కొన్నాళ్లు డాక్టరీ వెలగబెట్టావుగా? ఉండు; నేను వెళ్లివస్తాను - నిన్న వచ్చిన డాక్టరు మనకు అక్కర్లేదు..." అని పెద్దవాడు.

"మీ రిద్దరూ ఇలా తగాదా లాడుతూంటే నాకు ఆత్మహత్య తప్పక చేసుకోవా లనిపిస్తున్నది. నే నిక భరించలేను..." అని మూడోవాడు.

తండ్రి మళ్లీ దగ్గుతున్నాడు.

పెద్దవాడు లేచాడు, డాక్టర్ని పిలుచుకురావడానికి. తలుపు తీసి వాకిట్లోకి వెళ్లేటప్పటికి... ఒక కారు ఆగియున్నది కారులోంచి ఎవరో దిగుతున్నారు.

తన తండ్రికోసం ఎవరో వచ్చారని.. వారికి తగిన మర్యాదె చేయా లనీ హడావుడిగా లోపలకు వెళ్లి తండ్రితో చెప్ప తన తమ్ములతో గూడా చెప్పాడు--అన్ని ఏర్పాట్లూ చేయమని. "నే నీలోపల బజారు వెళ్లి ఏదన్నా తీసుకొస్తాను." అని అంటుండగానే కారులోంచి దిగిన ఆజాను బాహు సరాసరి లోపలికి వచ్చి అతనిబుజంమీద చేయి వేసి.. ముఖంలో ముఖం చూసుకుండేటప్పటికి...

"ఓర్ర్.. మనవాడే . ఎంత ఆశ్చర్యం... ఎలా మారిపోయావు.. అసలు నిన్ను గుర్తించలేదు. ఇన్ని సంవత్సరాలకు కనపించినందుకు సంతోషం.. "అన్నాడు పెద్దవాడు.

తండ్రిదగ్గిరకు వచ్చి.. "ఏం నాన్నా, ఆరోగ్యం సరిగా లేదో? ఇల్లు అమ్మేసేరట... మొదట ఆ యింటికి వె[illegible] చెప్పారు. మనవాళ్లు ప్లీడరూ, డాక్టరూ కూడా అయికుండి, ఇంత పని జరిగిందా?"—అని అంటుండగానే తండ్రి అందుకుని—

"నాయనా.. అదంతా ఓ భారతం ఉంది. అన్ని రోజులూ మనవి కావు..ఈ ఇరవై సంవత్సరాలలో బోలెడు మార్పులు వచ్చినయి...అవన్నీ నిదానంగా చెప్తాను నీవు జైల్లో పడకుండా ఇన్నాళ్లూ కాలక్షేపం చేశావా?" అని పరామర్శించాడు.

"జై లేవిటి? నేను ఇప్పుడు ఓ పెద్ద జమీందార్ని.. కొన్ని లక్షలు మూల్గుతున్నయి...ఒక ఫ్యాక్టరీ నిర్మిస్తున్నాను. దాని విషయమై కొంత పనికోసం అమెరికా వెళ్తున్నాను... చూసి పోదామని వచ్చాను.. "అన్నాడు నవ్వుతూ.

ఓరి పిడుగా? అన్నారు, నలుగురూ: ముగ్గురు అన్నలూ అతని చుట్టూ చేరారు. ఏవిటే...ఇన్నాళ్లూ దొంగతనంమీదనే... ఆధారపడ్డావా...ఆ చరిత్ర అంతా మాకు చెప్పవా ఏవిటి?. అన్నారు.

"ఆ విషయాలు తరువాత చెప్తాను. మీరు ఈ ఊరు వదిలివెయ్యండి నేను బొంబాయిలో పెద్ద మేడ ఒకటి కొన్నాను. మీరంతా రేపే విమానంలో వెళ్లి అక్కడ ఉండచ్చు. తర్వాత అన్ని సంగతులూ మాట్లాడుకోవచ్చును. ముందర ఇల్లు ఖాళీచేసి సామాను సర్దే ఏర్పాటు చెయ్యండి...నాన్నకు ఆరోగ్యంకూడా కుదుట పడ్తుంది. అక్కడ పెద్దపెద్ద వైద్యులు కూడా ఉన్నారు –" అన్నాడు.

తన అన్నలకు అసలు మాట్లాడేందుకే అవకాశం ఇవ్వలేదు. ఇంతలో తండ్రి అందుకొని –"ఒరే అబ్బాయ్, అంత తొందర ఏవిటిరా? అన్ని విషయాలూ నిదానంగా మాట్లాడుకుందాం నాలుగురోజులు ఆగేపోవచ్చు.. నీచరిత్ర కొంచెం మాకు విన్పించు...ఆమాత్రం భాగ్యం మాకు లేదా?" అన్నాడు.

"దొంగతనమంటే...కేవలం దొంగతనంమీద ఇన్నాళ్లూ ఆధారపడలేదు...మొదట్లో దొంగతనం చేశాను. కొన్ని సంవత్సరాలు ప్రపంచంలో నిజాయితీకి, న్యాయానికి, సత్యానికి కాలం కాదని, అంతా బూటకం, మోసం చేసే వాళ్లకే రోజు లనీ గ్రహించాను. అందువలన తరువాత ఆ పంథాలోనే జీవితంగడిపాను...... రోజులు గడుస్తున్నకొద్దీ జీవితంలోని అసలు రహస్యం తెలిసిపోయింది—నమ్మించి మోసం చేయటం ఎంత సులభమో నాకు అర్థమయ్యింది...ఒక పెద్ద పెట్టుబడి గల కంపెనీలో చేరికొన్నాళ్లున్న తరువాత...కంపెనీ యజమాని భార్యకూ నాకూ కొంత పరిచయం ఏర్పడి అదే ప్రణయంగా మారి...మేం ఇద్దరం కలసి దేశాంతరం వచ్చేశాం. (ఆమె బోలెడంత డబ్బుతో వచ్చేసింది) ఆతర్వాత రత్నాలవ్యాపారం సాగించాం...దాంట్లో వచ్చిన లాభం అంతా, ఇంతా కాదు......ఆతర్వాత మాయచేసి ఆ వ్యాపారంఅంతా చాల ఎక్కువ విలువకు ఇంకొకరికి అమ్మి...ఆ డబ్బుతో మరో పరిశ్రమ

(16-వ పేజీ చూడుడు)




ఈ నెల 21 వ తేదీన రాష్ట్రపతి భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు మచిలీపట్నం వచ్చినపుడు పౌరులు ఘనమైన స్వాగతం ఇచ్చిరి. కాంగ్రె


రాష్ట్రపతి ఆంధ్రదేశ పర



మంటాడవద్ద బహిరంగసభలో (21-వ తేదీన) ఉపన్యాసం చేస్తున్న పట్టాభి సీతారామయ్యగారు, కృష్ణాజిల్లా కాంగ్రెస్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాకాని వెంకటరత్నం, పేట బాపయ్యగార్లు రాష్ట్రపతి కిరువైపుల నిలబడి ఉన్నారు.



ఆంధ్రబ్యాంకు రజతోత్సవ సభా ముఖద్వారము.



రాష్ట్రపతి భోగరాజు పట్టాభిసీతారామయ్యగారికి 24 తేదీన రాజమహేంద్రవరం పురపాలకసంఘం సన్మాన పత్రమొసగినపుడు తీసిన ఛాయాచిత్రం.


★




21 వ తేదీ సాయంత్రం పట్టాభిగారు విజయవాడలో గాంధీజీ ఉన్న తపోశాల ఆవరణలో పౌరసన్మానము పొంది కమ్యూనిజంను అరికట్టవలసిందిగ ఆంధ్రప్రజల నాదేశించిరి. సభ కధ్యక్షతవహించిన కాశేశ్వరరావుగారు, రాష్ట్రపతి పట్టాభిగారి ఎడమవైపున కూర్చుని ఉన్నారు. పురపాలకసంఘ అధ్యక్షుడు డా. చలపతిరావుగారు వేదికపై సన్మానపత్రం పట్టుకు నిలబడి ఉన్నారు.



మచిలీపట్నం నోబిల్ కళాశాల ఆవరణలో దాదాపు 30 సంస్థలవారు ఇ
వివిధ స్వాగతపత్రములకు రాష్ట్రపతి సమాధా




మ అధ్యక్షులైన తరువాత పట్టాభిగారు ఇచటికి రావడం ఇదే ప్రథమం.



బెజవాడనుండి బందరు వెళ్లుతూ దారిలో వుయ్యూరువద్ద స్వాగత మొసగిన ప్రజలసభలో రాష్ట్రపతి పట్టాభిగారు ఉపన్యసించుచున్నారు.

డా॥ పట్టాభిగారి ర్యటనము




మచిలీపట్టణ పురపాలకసంఘము
రాష్ట్రపతి
శ్రీ డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య
బి.ఏ., ఎం.బి.సి.ఎం. గారికి

మచిలీపట్టణము
పురపాలకసంఘ
అధ్యక్షుడు




బెజవాడలో డాక్టర్ పట్టాభిగారు ఆంధ్రరాష్ట్ర వ్యవసాయకూలీ సంఘ కార్యాలయమునకు ప్రారంభోత్సవము జరిపిరి.



బందరు సభలకు వచ్చిన మహిళామణులు.



ాక్టర్ పట్టాభిగారికి సన్మానపత్రముల సమర్పించిరి.
రం ఇస్తున్న దృశ్యం.



చెన్నపట్నంనుండి విజయవాడ వెళ్లేటప్పుడు (జనవరి 20) ఎక్స్‌ప్రెస్ ఆగిన ప్రతిస్టేషన్‌లోను ప్రజలు శతసహస్రంగా వచ్చి రాష్ట్రపతి పట్టాభిగారికి స్వాగత మిచ్చిరి. నెల్లూరుస్టేషన్‌లో వచ్చిన పొణకా కనకమ్మగారు, కస్తూరిదేవి విద్యాలయ బాలికలు.



'వరం వస్తే సరా?...'

శ్రీ 'ఆచార్య భార్గవ'

అనగనగా ఒకవూళ్లో 'లోలుపు' డనే రాజు ఉండేవాడు. అతడు 'ఆశాపాశ' మనే నగరాన్ని రాజధానిగా చేసికొని ఆ దేశాన్నేలుతూ ఉండేవాడు. అతని పేరే అతని స్వభావాన్ని చెప్పక చెప్పతోంది — 'లోలుపు' డంటే, అత్యాశ— పేరాస—కలవాడని అర్థంగనుక.

ఎందరో బీదల కడుపు కొట్టి ధనం దోచుకుని తన ఖజానా నింపుకోవడమే అతని జీవితపరమావధి. అతని ఆదర్శం ధనఆర్జనమే.

ఇతడికి 'పసిడిబొమ్మ' అనే ఒక ముద్దు కూతు రుండేది. బంగారు బొమ్మలా నిగనిగలాడే నిమ్మపండులాంటి పచ్చటి శరీరంతో అందంగా ఉండటం వల్లనే ఆ అమ్మాయికా పేరు వచ్చింది.

ఇతని మంత్రులు— దుర్బుద్ధి, దుర్యోగులు — ఇతని కార్యకలాపాలన్నిటిలో చేదోడు వాదోడుగా నుండేవాళ్లు.

లోలుపుడికి చిన్నతనంలో పూదోటలంటే తగిన అభిమాన ముండేది. రకరకాల రంగురంగుల పూలచెట్లు తన తోటలో నాటించి స్వయంగా వాటికి దోహదం చేస్తూ, వాట్ని చూచుకుంటూ మురిసి పోయేవాడు. ఆప్యాయంగా ఆ ఉద్యానవనంలో విహరిస్తూ ఉండేవాడు. సంగీత సాహిత్యాలన్నా, ఇతర నాట్యం మొదలయిన లలితకళలన్నా అతగాడికి అమితప్రాణం.

కాని, 'గాడిదపిల్ల కోమలీకం' అన్నట్లు ఈతడు వయస్సొచ్చి పెద్దవాడయ్యే కొద్దీ ఆ అభిమానాలన్నీ అణగారి పోయి, ఒక్క ధనాశాపిశాచమే ఆతణ్ణి ఆవేశించింది. కాలమంతా ధన సేకరణకే వినియోగించేవాడు.

ఇతడికి విచిత్రమైన నిత్యకృత్య మొకటుండేది. తా నొంటరిగా, తన విశాలమైన ధనాగారంలో ప్రవేశించి, లోపల తలుపులు బిడాయించుకొనేవాడు. తన కున్న డబ్బంతా ఓ వంద సార్లైనా లెక్కపెట్టుకొనేవాడు. అలా, అంతులేని ఆ డబ్బంతా చూచుకుంటూ, సంతోషం పొంగి పొర్లగా ఉబ్బి తబ్బిబ్బయ్యేవాడు.

ఆ గదిలోనే ఒక మూల బంగారపు అచ్చులు, దొంతులు దొంతులుగా, ఒక దాని మీద ఒకటిగా, పేర్చి పేర్చబడి వున్నాయి. వాట్ని ఒక్కొక్కటిగా లెక్కించుకునేవాడు. ఆ గదిలోని సన్నటి కిటికీ గుండా కొద్దిపాటి సూర్యకిరణం వాటిమీద పడినప్పుడు ఆ బంగారు అచ్చులన్నీ మిలమిలా మిరుమిట్లు గొలుపుతూ మెఱుపులా మెఱిసేవి. వాటిని చూచుకొని అనిర్వాచ్యమైన ఆనందాన్ని అనుభవించేవాడు లోలుపుడు.

కాని, ఉత్తరక్షణంలోనే మళ్లీ నిరాశ. నేను సేకరించిన ధనం, బంగారం చాల తక్కువ. ప్రపంచంలో ఇంకా చాల వెండి, బంగారా లున్నాయి. నేను సంపాదించింది ఇంతకూ 'ఆవగింజలో అర్ధభాగమే' అని నిరాశ చెందేవాడు. ఆశకు అంతు ఏముంది? ఇంకా బాగా డబ్బు సంపాదించుకోవడం ఎలాగా అని ఆలోచిస్తుండేవాడు. తన మంత్రుల సలహాలు తీసుకునేవాడు.

ఇలా ఉండగా, ఒకనాడు లోలుపుడు ఖజానాకొట్లో ఉంటగా ఒక అద్భుతసంఘటన జరిగింది !—

కిటికీలోంచి వచ్చే సూర్యకిరణాల్లో, తన దివ్యతేజస్సులో ఆ గది నలుమూలలూ వెలిగింపజేస్తూన్న సుందరాకారుడైన ఒక వ్యక్తి కనపడీ కనపడకుండా కంటపడ్డాడు. లోలుపుడి కళ్లు జిగేలు మన్నాయి. ఆలాటి వ్యక్తిని మన మెప్పుడూ చూడలేము సరిగదా, ఆ సౌందర్యమూ, ఆ వర్చస్సూ ఆ రూపురేఖలూ మన మూహించను కూడా ఊహించలేము. అలాటి వ్యక్తిని చూచినప్పుడు మన లోలుపుడి మనస్సెలా ఉంటుందో ఆలోచించండి !

లోలుపుడిలా ఆలోచించాడు: 'ఇతడు-ఈ జ్యోతిస్స్వరూపుడు మనుష్యమాత్రుడుగా ఉంటాడా?—కాడు, ఎన్నటికీ కాడు. ఈ దివ్యతేజస్సు మనుష్యుడి కెలా వుంటుంది? ఆదీ కాక, మనుష్యుడే అయితే లోపలితట్టు పదిలంగా బంధించిన గదిలో కెలా రాగలుగుతాడు? అందుచేత ఇతడు ఎవడో, నా తపస్సు ఫలించి, నన్నేల వచ్చిన దివ్యపురుడుడే, దేవుడే!

ఈలా ఆలోచిస్తూండగానే మేఘగర్జనంలా గంభీరమైన కంఠస్వరం వినపడింది— 'నీ వెంతటి ధనవంతుడవోయీ !' అని.

తృప్తిలేని లోలుపుడు ఇలా గొణిగాడు: 'ఇదీ ఒక ధనమా? నేనూ ఒక ధనవంతుణ్ణేనా? ధనవంతుడుగా కావాలంటే వాడికి కనీసం వెయ్యేళ్లు అయినా ఆయుర్దాయం ఉండి తీరాలి. అప్ప డతడు అవిరళంగా కృషిచేస్తే నిజమైన ధనవంతు డవగలుగుతాడేమో !'

"అయితే, నీ కింత సిరీ, సంపదా ఉండీ నీకు తృప్తి కలుగ లేదా? నిన్నేది తృప్తిపరచగలదో చెప్పు; నీ కోరిక నేను తప్పక తీరుస్తాను. కోరుకో' అన్నాడు ఆ ఆగంతుకుడు.

లోలుపుడు ఆశతో ఆలోచించాడు: 'నాకు కలిగిన ఈ అలభ్యమైన అవకాశాన్ని చేజార్చుకోరాదు. ఇంతకాలమూ డబ్బు సేకరణకై నేను పడిన పాట్లు ఆ పరాత్పరుడికే ఎరుక. ఈ కష్టం లేకుండా ధనం వచ్చే వుపాయం యేదైనా కోరుకోవాలి! అది ఏది?'...

ఈ విధంగా ఆలోచించగా, ఆలోచించగా అద్భుతమైన ఆనందకరమైన ఉపాయం ఒకటి అతడి మెదడులో మెఱుపులా మెఱిసింది. అతడి ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

'అలా అయితే, దేవా, నాస్పర్శ మాత్రాన ప్రతి వస్తువూ బంగారం అయేలా వరం ప్రసాదించండి. ఈ ఒక్క వరం తప్పితే నా కితరవరా లేవీ వొద్దు.'

'నీ కోరిక ఫలించుగాక! రేపు సూర్యోదయంనుండి నీవు పట్టిందల్లా బంగారమే. ఇప్పుడు నీకు ఆశాపూర్తి అయిందా? ఇక గొణగకు...' అంటూనే ఆ దేవత అదృశ్యమయ్యాడు.

మన రాజుగారు ఈ సంఘటనను నమ్మలేకపోయాడు పూర్తిగా. ఒకవేళ ఇది కల ఏమో అనుకున్నాడు. 'కల ఏమిటి, కల? నేను నిద్రపోందే?' అయినా పరీక్షించిచూద్దా మనుకున్నాడు. ఆ రాత్రంతా అతగాడి కంటికి కూరుకు వస్తే వొట్టు. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు వరాన్ని ఉపయోగించుకొందామా, అనే ఆశతో ఆత్రంతో ఎదురు తెన్నులు చూస్తూన్నాడు— తెల్లవారు జామునకు. ఒక్కొక్క నిమిషం ఒక్కొక్క యుగంగా తోచిందా ఆత్రగాడికి.

ఎల్లా గయితే నేం — తూరుపు తెల్లబడుతోంది— మన రాజుగారి ముఖమల్లే. పక్షులు తమ కిలకిల ధ్వనుల్తో లోకాన్ని మేలు కొలుపుతున్నాయి. ఎప్పటిమల్లే కాకుండా ఆ రోజు చాలా దేదీవ్యమానంగా ఉన్నాయి, ఆ బాలసూర్యుడి బంగారు కిరణాలు. ఒక తొలి కిరణం పడకగదిలోని కిటికీసన్నసందులోంచి మెల్లగా జారుకుంటూ పాన్పుమీదికి ప్రసరించింది. ఆశ్చర్యం! పక్కమీది బెడ్ షీటు బంగారురేకులా మిలమిలా మెరిసింది.

మన లోలుపుడికి మాటలతో చెప్పడాని కలివిగాని మహానందం కలిగింది.

ఎంతమాత్రం జపతపాలు చేయకుండానే తన కీ గొప్ప వరం లభించిందని ఎగిరి గంతేశాడు. ఇంతకాలంగా తను కంటూన్న కలలు నిజమైన రూపునుపొందడం చూసి ఉప్పొంగిపోయాడు.

వొళ్లు తెలియని ఆనందంతో మంచుపు కోళ్లనూ, పట్టెలనూ చేత్తో తాకాడు. అంతా బంగారం! కిటికీ దగ్గరకెళ్లి నిల్చోగానే కిటికీ కట్టిన 'కర్టన్' (గుడ్డ) బంగారు రేకు అయిపోయింది.

ఈ విధంగా తనకు దొరికిన వరాన్ని బాగా ఉపయోగించుకోటంలో విధీ విరామం లేకుండ కనపడ్డ దాన్నంతా తాకేస్తున్నాడు. శ్రమ కలిగి చెమటొచ్చి, మొహం తుడుచుకుందా మని రుమాలు తీసుకునేప్పటికి అదీ బంగారమే అయింది. తన పనితనమంతా చూపి, ఎంతో కష్టపడి, తన ముద్దుల కూతురు కుట్టియిచ్చిందా రుమాలు. దీన్ని చూసి 'పసిడిబొమ్మ' ఎంతగా దుఃఖిస్తుందో అనుకున్నాడు. అయినా, ఇప్పుడాలాటి చిన్న చిన్న విషయాలను గురించి ఆట్టే విచారించటం తెలివి తక్కువ! అతని బట్టలన్నీ బంగారం అయి భారమైనా, దాన్ని లక్ష్య పెట్టలేదు. కాని అతని కంటి అద్దాలుకూడా బంగారు అయిపోయేటప్పటికి అతని మనస్సు చివుక్కు మన్నది— ఇక తనకు సరియైన చూపు ఎలాగా అని. ఇది వరంవల్ల అతని జీవితానికి తగిలిన మొదటి పెట్టు!

తన ఆశలు సఫల మాతున్నందుకు, సంతోషంతో అక్కడినుండీ, వెఱ్ఱిగా తన ప్రియమైన తోటవేపు పరిగెత్తాడు. అప్పుడే విచ్చుకున్న పూలు అతన్ని పిలుస్తున్న ట్లున్నాయి. వేగిరంగా వెళ్లి అన్నిట్నీ అదే పనిగా తాకి తాకి వొదిలిపెట్టాడు. తోటంతా బంగారం. చెట్లూ, చేమలూ, పూలూ, ఫలాలూ —అంతా బంగారం!

ఈలా తిరిగి తిరిగి ఈ పనితో కొంత సేపటికి అలసి పోయాడు అతడు. 'ఈ పూట కిది చాలు' అనుకున్నాడు. ఆకలి అయింది. దప్పిక దహిస్తోంది. ప్రొద్దుటిపూట అల్పాహారానికి భోజనశాలకు వెళ్లి కూచున్నాడు.

కూడా కూతురు కూచొని కూడు కుడువక పోతే లోలుపుడికి నోట్లోకి ముద్ద దిగదు. అప్పుడు అక్కడ ఇద్దరికీ అల్పాహారానికి, అంతా రొట్టె, బిస్కత్తులు, పండ్లూ, పాలూ— సిద్ధం చేయించి కూతురుకు కబురు చేశాడు. చాల సేపయింది.

కుమార్తె— పసిడిబొమ్మ ఇంకా రాలేదు. ఏమా రాలేదని ఆలోచిస్తూండగా వెక్కివెక్కి ఏడుస్తూ, కడవల కొలదీ కన్నీళ్లు కుమ్మరిస్తూ అమ్మాయి వచ్చింది. వస్తూనే రోజా తోట వంకకు చేయి చూపి చూపిస్తూ చెప్పబోయిం దేదో. కాని శోకభారంవల్ల ఆమెనోటినుండి ఒక్క పలుకూ పెగిలి రాలేదు.

'అమ్మాయీ, ఎందు కలా రోజామొక్కల్ని చూపిస్తూ, కడు పుబ్బేలా

(16-వ పేజీ చూడుడు)

పిల్లల కథ:

హంసల రాణి


శ్రీ సూరిశెట్టి జీవరక్షణరావు

అనగా అనగా ఒకరాజు. అతని కొక కొడుకూ, కూతురూ ఉండేవారు. ఒకనాడు ఆ యిద్దరూ తోటలోనికి ఆడుకొనటానికి దూరంగా పోయారు. సాయంత్రం అయిపోయింది. అప్పుడు వాళ్ళకి యింటి తలంపు పుట్టింది. అప్పుడా చెల్లెలు ఏమందో తెలుసా! "అన్నయ్యా! సాయంత్రం అయింది; ఇక పోదాము?" అంది. వాళ్ల అన్నయ్య పేరు కిశోర్. ఆ పిల్లపేరు లత.

కిశోర్ ఆట మానేసి "అరెరే! ఆడుకుంటూ యిక్కడికి వచ్చేశామే! ఇప్పుడెలాగ యింటికి వెళ్లటం?" అని నాలుగు ప్రక్కలా చూశాడు. ఇంతలో ఎక్కణ్ణుంచో "ఓ రాజకుమారా? భయపడకండి. మీకు సాయం చేయటానికే మేము వస్తున్నాము" అంటూ వినిపించింది. ఆ మాటలు వచ్చినవైపు చూశాడు కిశోర్. ఆ తోట ప్రక్కనే చిన్న సెలయేరొకటుంది. ఆ సెలయేట్లోంచి ఒక హంసతమవేపే రావటంచూశారు లతా, కిశోర్ లిద్దరూ. ఆ మాటలా హంసే చెప్పింది. హంస వాళ్లదగ్గర కెళ్లి, "మీ రేం భయపడకండి మీ కోసమొక పడవ పంపిస్తాను. దాని మీద నెక్కి మా యింటికి రండేం!" అని చెప్పి వెళ్లిపోయింది.

కొంత సేపటికి వాళ్లని తీసుకు వెళ్లటానికి ఒక మాంచి రంగు రంగుల అందమైన పడవ వచ్చింది. లతా కిశోర్ లిద్దరూ దానిమీద కూర్చున్నారు. ఆ పడవని హంసలు నడిపి వాళ్లిద్దర్నీ హంసల రాజ్యంలోనికి తీసుకపోయినవి. ఆ దేశంలో యెక్కడ చూసినా హంసలే. లత "అన్నయ్యా! ఈ దేశం యెంత అందంగా వుందో! ఇక్కడెక్కడ చూసినా హంసలే! మనుష్యులొక్కరూ కనిపించటం లేదే!" అంది. ఇంతలో అక్కడికొక హంసలరాకుమారి వచ్చి వాళ్లకి స్వాగతమిచ్చింది. "పదండి! మిమ్మల్ని మా రాజుగారు తీసుకరమ్మన్నారు" అనిచెప్పి హంసల దర్బార్ లోనికి లతా కిశోర్ లను తీసుకెళ్లింది. హంసల దర్బార్ నిండుగా వుంది. ఒక్క సింహాసనం మీద హంసల రాజు కూచుని ఉన్నాడు. మన లతా కిశోర్ లాతనికి వంగి దండం పెట్టారు. ఆ హంసల రాజు ప్రేమతో వాళ్లిద్దర్నీ దగ్గిర కూర్చొనబెట్టుకొని మీ కాకలి వేస్తోంది గాబోలు. పళ్లు తెప్పిస్తాను. తినండని, పళ్లు తీసుక రమ్మని సేవకుల కాజ్ఞాపించాడు. రకరకాల పళ్లన్నీ తెచ్చారు. ఆకలిగా వుందేమో! గబగబా తినేశారు లతా కిశోర్ లిద్దరూ. అవి తినేసేసి ఒక మెత్తని పరుపుమీద పండుకున్నారు.

ప్రొద్దున్నే లేచాక "నాతో వేటకి వస్తావా? అని" కిశోర్ నడిగాడా రాజు. ఓ వస్తా నన్నాడు కిశోర్. వాళ్లిద్దరూ వేట కెళ్లారు. కొంత దూరం పోయాక ఒక హంస గర్జిస్తూ వాళ్ల పై కెగిరింది. వెంటనే మన కిశోర్ దాన్ని చంపేశాడు. ఆ హంసశవంలో నుంచి ఒక రాకుమారి పైకి వచ్చి నమస్కరించింది. కిశోర్ "ఈ అమ్మాయి యెవ"రనిఅడిగాడు. "కిశోర్! దీన్ని చంపి నీ వొక ఘనకార్యం సాధించా వన్నమాట! దాన్ని చంపటానికి దేశదేశాల్నుంచి యెంతోమంది వచ్చి చేతకాక వెళ్లిపోయారు. ఇప్పుడీమెనీ..." అని వాళ్లిద్దర్నీ తన రాజ్యంలోనికి తీసుకవచ్చి పెళ్లి చేశాడు. అప్పుడు కిశోర్ పెళ్లికూతురు, లతలతో తమ దేశానికి వచ్చేశాడు.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౧౨

పెద తిరుమలయ్య రచన: (సంపు. ౨; ప. ౮౭)

రామక్రియరాగం - ఆదితాళం

[పల్లవి]

(౧) స రి ని సా గ రి గ గ ప గా రి సా , ,
వె ల యు ని న్ని యును వృ థా వృ థా

(౨) స రి ని స గ రి గ మ మ ధ మా గా రి సా , ,
వె ల యు ని న్ని యును వృ థా వృ థా

(3) స రి స రి స ని స రి గా రి గ మ ప ధ ని సే ని ధ ప మ గ రి సా , ,
వె ల యు ని న్ని యు ను వృ . . థా వృ థా

(౧) స స గ రి గ పా , మ ప మ మ ప ధ ప ధ మా గ రి
త ల పు న శ్రీ హ రి ద ల గి న ను

(౨) స స గ రి గ మ ప ధ ప మ పా ధ సే ని ధ ప మ ప ధ ప మ గ రి స ని
త ల పు న శ్రీ హ రి ద ల గి న ను

(3) స స ప మ గ రి గ మ ప ధ ప ధ నీ సే రి సే ని ధ ప గ మ ప ధ ని ధ ప మ గ రి ‖ (వెలయు)
త ల పు న శ్రీ హ రి ద ల గి న ను

[చరణం]

గ గ గ గ గా గ గ గ ప మ రి గ మ పా
ఎ డ య ని పు ణ్య ము లె న్ని యై నా
ప ధ ప ధ సా , ని ధ ప ప ధ మా గా మ పా , ,
వి డు వ క చే యు ట వృ థా వృ థా

(౧) ప ధ ప ధ నీ సా ని ని నీ , రీ సా
బ డి బ డి నే శ్రీ ప తి నా త్మ లో

(౨) ధ ని ధ మ ధ ని ధ ని సా స రి గా రి గ సా
బ డి బ డి నే శ్రీ ప తి నా త్మ లో

(౧) స స స స ని ధ స స స రి నీ ధ మ ప ధ మా గ రి
ద డ వ క యి త ర ము ద డ వి న ను

(౨) స రి స స రి ని ధ ని స స రి స ని ధ ప గ మ ప ధ ని ధ ప మ గ రి ‖ (వెలయు)
ద డ వ క యి త ర ము ద డ వి న ను

ఇట్లే ఈ క్రింది చరణాలు:

(౨) ఎరవుల తపముల కెంతైనా
విరవిర వీగుట - వృథా వృథా
హరి నచ్యుతు బర - మాత్ముని
మరిగి తలంచక - మఱచినను ‖ (వెలయు)

(3) దైవము నెఱుగక - తమకమున
వేవేలైన - వృథా వృథా,
శ్రీ వేంకటగిరి - చెలువుని
సేవించక మతి - జెదరినను ‖ (వెలయు)

లఘుటీక:

ఎడయని=తప్పని; బడిబడినే=వెంట వెంటనే; ఎరవుల తపములు=అప్పుదెచ్చుకొన్న తపస్సులు, సహజములుగాక ఒకరిని చూచి ఆకస్మికముగా అనుకరించినవి.

ముద్రితపాఠము:

వేలయు నిన్ని, హరి దలసినను; పరమాత్ముని, చెలువుని అనే పదములతర్వాత, నే నూహించిన గీతచ్ఛందస్సే సరియైతే, నాల్గుమాత్రల కాలమునకు సరిపోవు, మఱి ఒక్కొక్కపద ముండవలె నేమో! లేకున్నా పాడేవారిడ్చి సరిపుచ్చుకోగల రనేది వేఱుమాట.

వరం వస్తే సరా?

(14 వ పేజి తరువాయి)

ఏడుస్తావు? నిన్నెవరైనా ఏమన్నారా తల్లీ?' అని బుజ్జగిస్తూ— 'అలా అందమైన ఆ రోజా పూలు చూడు' అని అన్నాడు సమాధానపరచాలని.

'ఛీ! ఆ రోజాపూలు అందంగా ఉన్నాయా? నాన్నా, నిజంగా నీవు వాటిని నాశనం చేశావు! వాటి అందమంతా చెరిపేశావు. ముందటి వన్నె-వాసీ, వాసనా, వాటికే దీ ఆ స్వాదు మార్దవం మాయమైంది; కఠినంగా తయారైంది' అని యేడుస్తూ చెప్పింది.

బొమ్మను బంగారమయినందుకు సంతోషిస్తున్నాడే గాని ఆ అమ్మాయి లేత మనస్సును ఎంతగా నొప్పించాడో తెలుసుకోలేక పోయాడు— ఆ ఉబ్బులో మన రాజు— తగ్గాడు!

ఎలాగో ఓలాగు ఆ అమ్మాయిని ఓదార్చి భోజనానికి కూర్చున్నాడు ఆకలికి ఆగలేక మనుటిస్తూ. ద్రాక్షపండు తాకే సరికల్లా ప్రతివస్తువూ బంగారంగా మారింది. పాలు కరిగిన బంగారంలా అయింది. తన నోట మట్టే! ఇక నేం చేస్తాడు? ఏం తిని జీవిస్తాడు? ఆకలితో చావాల్సిందేనా? దిగులు పట్టుకొంది.

అతనికి ఒక మంచి ఊహ తట్టింది: 'ఒక పదార్థం తీసికొని, వెంటనే— బంగారంగా మారేలోపుగానే— గబుక్కున నోట్లో వేసుకుని, గుటుక్కున మింగేస్తే సరిపోతుంది?' అనుకొన్నాడు.

వేడిగా వుండే ఒక రొట్టెముక్క తీసి చటుక్కున అంగిట్లో వేసికున్నాడు; అది బంగారం అయింది. వేడిగా ఉందిగదా? అటు కడుపులోకి పోకుండా, ఇటు కక్కడానికీ వీలుగాక, గొంతులో ఇరుక్కుని గొంతంతా కాల్చేసింది. బాధ కోర్వలేక నెత్తీ, నోరూ, మొత్తుకున్నాడు. విలా విలా తన్నుకున్నాడు.

మళ్లీ మంచి ఉపాయం ఆలోచించాడు: 'తాను తాకకుండానే తన కూతురిచేత నేరుగా గొంతులో పాలైగా పోయించుకోవచ్చు' అనుకుని, అనుకున్నట్టు చేశాడు. అదీ అతని ప్రాణానికే వచ్చింది. అతని దేహస్పర్శ తగిలేప్పటికి పాలు కరిగిన బంగారం అయింది. మరింత బాధ పడ్డాడు.

ఓ పక్క ఆకలి దహించుకుపోతోంది; ఇంకో ప్రక్క తాను కోరి తెచ్చుకున్న వరం తన ఉసురుకే మోసం తెచ్చేలా తయారైంది. పాపం! అతని స్థితి ఎలా వుండాలో ఆలోచించండి. ఏదీ సాధ్యంగాక ఇక ఏడుపు సాగించాడు.

అతన్ని సమదాయించడానికి పసిడి బొమ్మ దగ్గరగా వచ్చింది. వాళ్లు తెలియని దుఃఖంలో బాధలో, ఆ అమ్మాయిని రెండు చేతులా దగ్గరకు లాక్కొని ముద్దు పెట్టుకొన్నాడు పాపం— వాత్సల్యంతో.

ఇంకేముంది! కొంప మునిగింది! అమ్మాయి నిజంగా బంగరు బొమ్మే అయింది. నోట మాట లేదు. గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. చైతన్యం శూన్యం. కదలలేదు. బొమ్మ!

తాను చచ్చేస్థితిలో తన కూతుర్ని పోగొట్టుకొన్నాడు. ఇప్పుడెంత ఏడిస్తే ఏం లాభం? పశ్చాత్తాపం పడితే ఏం ఉపయోగం? 'చేయికాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లే' అవుతుంది. తన వరమే— ఆశతో కోరుకున్నది— ఇంతటి దీన స్థితిని తెచ్చిపెట్టింది.

తాను బతకగలడా? తన ప్రాణాని కంటే మిన్న అయిన తన కూతురు మళ్లీ ప్రాణం పోసుకుంటుందా?— ఈ విచారంలో మిటికి, మంటికి ఏకధారగా ఏడుస్తున్నాడు— తన హృదయమే కరిగి కన్నీరైనట్లు.

లోలుపుడు పడే పడరాని పాట్లు చూచి మనస్సు కరిగి కనికరం, కలిగింది కాబోలు— మునుపు వరం ఇచ్చిన దేవుడు మళ్లీ అతని యెదుట ప్రత్యక్షమయ్యాడు.

'లోలుపా, క్షేమంగా వున్నావా? ఇప్పటికన్నా నీవరం నిన్ను తృప్తిపరచగలిగిందా?' అని అడిగాడు.

ఆ మాటలు వినేటప్పటికి లోలుపుడికి 'ఉరిసిన పుండుమీద ఉప్పు పెట్టిన' ట్లయింది. కాని కొంత ఊరట మాత్రం కలిగింది లోలోపల. ఆ దివ్య పుణ్యుణ్ణి చూచేటప్పటికి, అతడి దుఃఖమంతా కట్టతెగిన ప్రవాహంలా ఒక్కసారిగా పొంగి పొర్లింది. 'దేవా, క్షేమమెక్కడి క్షేమం? సర్వనాశనమైపోయాను!...' ఇక మాట్లాడలేక పోయాడు. గొంతు బొంగురుపోయింది. దేవుడి పాదాల మీద పడిపోయాడు.

కొంచెం సేపటికి తెప్పరిల్లుకుని 'దేవా, జ్ఞానం కలిగింది. ఇక నెప్పుడూ అనువుకాని దానికంకా ఆశపడను. నాకీ వరమొద్దు. దీన్ని నువ్వే తీసుకుని నాకొక గ్లాసెడు మంచినీళ్లు ఇయ్యి. ప్రాణం నిలబెట్టుకుంటాను' అని ప్రార్థించాడు.

ఆ వెలుగు వ్యక్తి— 'అలాగైతే నీవు నిజంగా ఆ వరపు పిడికిటిలోంచి తప్పించుకోవాలని తల్లడిల్లుతున్నావా? అదుగో, ఆ కనబడుతూన్న 'ఆశాపాశచ్ఛేదిని' అనే నది నుండి నీళ్లు తెచ్చి, బంగారంగా మారిన వస్తువులన్నిటి మీదా చిలకరించు. అన్నీ పూర్వపు స్థితిని పొందుతాయి. నీకు మేలగుగాక!' అని అంటూ అదృశ్యుడైనాడు.

మన రాజుగారు, వెంటనే, ఎక్కడా ఆగకుండా ఓ పరుగు దీశాడు ఆ ఏటికి. ఒక బిందెడు నీళ్లు తెచ్చాడు. మొట్టమొదట తన ముద్దుకూతురుమీద చల్లాడు. ఆ బొమ్మ మనిషైంది. కారణమేమో తెలియదు కాని ఆమె తల వెంట్రుకలుమాత్రం మునుపటిమల్లే తుమ్మెద రెక్కలల్లే మెరిసే నల్లదనాన్ని పొందలేకపోయాయి. బంగారు తీగలల్లే ఉన్నాయి. ఇది ఆమె సహజ సౌందర్యాన్ని పాడుచేయలేదు. పైగా మించిన వన్నెచే తెచ్చిపెట్టాయి ఆమెకు ఆ బంగరుకురులు. కాని, ఆమెకు చాల చిరాకేసింది, తన బట్టలన్నీ తడిసి పాడైనందుకు. తర్వాత జరిగిన కథంతా విని తెలుసుకుని శాంతించింది. తోటలోకి పరుగెత్తి పూల మొక్కలన్నిటిమీదా నది నీళ్లు చిలకరించాడు. అన్నీ మామూలు స్థితి కొచ్చాయి. ఆ పూలన్నీ ఇనుమడించిన అపూర్వ పరిమళాన్ని నలుమూలలా వ్యాపింప జేశాయి— తమ సహజస్వరూపం తమ కొచ్చిన సంతోషంతో కాబోలు!

తారుమారైన పరిస్థితులన్నీ చక్కబడ్డాయి. లోలుపుడిప్పటికి కుదుటపట్టాడు. అది మొదలు బుద్ధి గలిగి మంచివాడుగా ప్రవర్తించసాగాడు.

తండ్రీ-కొడుకులు

(11-వ పేజీ తరవాయి)

స్థాపించాం.. షేర్లవల్ల విపరీతమైన పెట్టుబడి వచ్చింది. డబ్బు బాగా వచ్చినతరువాత... కొన్నాళ్లకు! కంపెనీ దివాలా అని...అనేటప్పటికి...అంతా తలక్రిందైంది...ఒక టేమిటి ఇలాంటివి ఎన్నో చేశాను. నాకు చేతనయినంతవరకూ మోసంచేస్తూనే రోజులు గడుపుతూ వచ్చాను. ఈమధ్య నాలుగుసంవత్సరాలనుండీ నేనంటే ఓవిధమైన గౌరవం ఏర్పడ్డది ప్రజలకు. ఆతర్వాత ప్రజోపకారమైన పనులు చాలా చేశాను. దాంతో ఖ్యాతి ద్విగుణీకృతమయింది. ఏం చెప్పను? అన్నీ ఎందుకు...ప్రస్తుతం నా పని బాగానే ఉంది. నేను అమెరికా వెళ్తున్నాను. ఆరునెలల్లో తిరిగివస్తాను. అక్కడనుంచి ఇంగ్లండుకూడా బహుశా వెళ్తానేమో!—" అంటూ అన్నలవైపు తిరిగి "మీ ప్లీడరీ..... ఏమయింది? డాక్టరి ఏమయింది? ఇంకా ఎంత ఉన్నతస్థితిలో ఉన్నారో అనుకున్నాను" అన్నాడు.

"నాసంగతి చెప్పటానికి నాకే సిగ్గుగా ఉంది. ప్లీడరీలో ప్రవేశించాను. ప్రాక్టీసు వచ్చిన కొత్తల్లో నా దురదృష్టవశాత్తూ నేను తీసికొన్న కేసులు అరడజనూ కూడా నెగ్గలేదు. ఇంక ఏ ప్లీడరు అవి తీసికొన్నప్పటికీ నెగ్గేవి కావు. అలాంటివి తీసికొన్నాను. దాంతో నా పలుకుబడి తగ్గిపోయింది. ఒక్క కేసు రాలేదు...... దమ్మిడీకూడా రాలేదు. నా మనస్సు సరిలేక తిరుగుతూంటే నన్ను పిచ్చివాడు అన్నారు. అంతకన్న దురదృష్టమేముంది?-డాక్టరైవాడు కొన్నాళ్లు వెలగబెట్టాడు. నయంకాని కేసులు వాడి దగ్గరకు వచ్చినయి. వాడేం చేస్తాడు పాపం, అయిదారు రోగులు చచ్చిపోయినారు. దాంతో అందర్నీ చంపుతాడు అని పేరుపడిపోయింది. కొన్నాళ్లయిన తరువాత పిల్లలు రాళ్లు కూడా వేశారు. ఏం చేస్తాడు పాపం...మూడోవాడు వ్యాపారం వెలగబెట్టాడు...మొదల్లో నష్టమే...అయినా ఇంకా చేశాడు...వాడు పెట్టిన కంపెనీలన్నీ ఢభాల్న మునిగిపోయి...ఆ నష్టాన్ని పూడ్చటానికి ఎంత ఆస్తిఅయినా చాలలేదు. ఆస్తిఅంతా పోయింది. దానివల్ల నాన్న ఆస్తికూడా చాలవరకు దెబ్బతిన్నది. నాన్నకు సంబంధించిన కొన్ని బ్యాంకులు కూడా మునిగిపోయినయి. చాల అన్యాయం జరిగింది...... జీవనం గడవటమే ఇప్పుడిప్పుడు కష్టంగా ఉంది..." అని దీనంగా ముగించాడు.

"కేవలం తెలివితేటలే కాదు, అదృష్టంకూడా ఉండాలి..అయినా జీవితం ఓ విచిత్రమైనది... ఏం చెప్పను? న్యాయానికి కాలం లేదు...లేకపోతే మన విధి అనుకుంటాం" అన్నాడు మూడోవాడు......

—"అన్నిటికీ ఆ భగవంతుడే! ఆయన లీలలే!" అన్నాడు తండ్రి దగ్గుతూ.

[ఒక పోర్చుగీసు కథను ఆధారంగా]



తెనాలిలో జరిగిన గుంటూరుజిల్లా మహిళామహాసభ సందర్భంలో తీయబడిన ఛాయాచిత్రము. అధ్యక్షురాలు శ్రీమతి వడ్లమూడి అన్నపూర్ణాదేవి, సభాప్రారంభకురాలు శ్రీమతి కొత్తపల్లి శ్రీకాంతమ్మ, సాధువమ్మ, శ్రీమతి కొల్లా కనకవల్లి తాయారమ్మగార్లు మధ్యగలరు.

అర్థం కోసం అగచాట్లు

శ్రీ పరిణం రామమోహన్

చతుర్విధ పురుషార్థములైన ధర్మార్థ కామ మోక్షములను ఏ యుగంలోను ఏ పురుషుడూ సక్రమంగా అవలంబించినట్లు గోచరించదు. వాట్లింటిలో ఏదో ఒకదానికి ప్రాముఖ్యమును ఇచ్చినవారు కన్పిస్తూనే ఉన్నారు. ప్రస్తుత యుగంలో అర్థం (ధనం) అతిప్రాముఖ్యతను పొందుతూ ఉంది. పురుషుడు, స్త్రీ ఇద్దరూ డబ్బుకై అహర్నిశము తంటాలు పడ్తూనే ఉన్నారు. ఉదయం మొదలుకొని జరిగే కార్యక్రమాదులను పరిశీలించి చూస్తే డబ్బుకై ప్రజలు ఎట్టి దుర్నీతికి పాల్పడుతున్నారో తెలుస్తుంది.

ఉదయాన్నే కాఫీ సేవించటానికి ప్రతివాడికి హోటల్లకు పోవటం ఒక అలవాటై పోయింది. "పదార్థములు స్వచ్ఛమైన నేతితో తయారు చేయబడును" అని బోర్డు వ్రాసి ఉండటం చదువుతాడు. కాని అలా చేసినట్లు కన్పించదు. ఏదో చౌకబారు నూనె, నెయ్యి కలిపి తుక్కువలో పొయ్యేటట్లు చేయించి మనదగ్గర ఎక్కువ డబ్బు కాజేస్తాడు మేనేజరు. కంట్రోల్లు ఉన్న వస్తువు సేకరణకై పోటే; అవి మనకు లభ్యమే కావు. మన కెంత అవసరమున్నా, మన అవసరాన్ని లక్ష్యమైనా చేయక వెంటనే ఆ వస్తువు లేదు పొమ్మంటాడు షావుకారు. మామూలుధరకన్న ఎక్కువ ధర పెట్టేపక్షంలో మనల్ని ఆహ్వానించి తగు మర్యాద చేసి పంపిస్తాడు షావుకారు. 'గవర్నమెంటు నిర్ణయించిన ధరకంటె పైసాగూడ ఎక్కువ ఇవ్వం' అనే రకాలకు అసలు వస్తువే దొరకదు.

'వ్యాపారస్థులలో ఎక్కువగా అక్రమ సంపాదన చేసేవారు కన్పిస్తుంటారు' అని చాల మంది అంటుంటారు. కాని ఇతరులుగూడ వీరికన్న రెండు ఆకులు ఎక్కువే అక్రమధనార్జన విద్యలో చదివి ఉన్నవారని రూఢిఅవుతుంది. మన దేశంలో లక్షాధికారులు, కోటీశ్వరులున్నారని విర్రవీగుతుంటాంగాని, అంత ధనం, ఎంత అక్రమం, అన్యాయం, అధర్మం కనబరచి ఆర్జించబడుతుందో తెలుసుకొని పశ్చాత్తాపం పొందం. న్యాయంగా మనం లక్షలు, కోట్లు గడించలేం. అది చాల దుర్లభం. అక్రమం ద్వారా అది సాధ్యంగాని, ధర్మం, న్యాయంతో సాధ్యం కాదు.

ఈనాటి ప్రభుత్వ ఉద్యోగస్థులలో ధర్మం చాలవరకు నశించిపోయిందని, అన్యాయం చాల ప్రబలిపోతూందని, లంచగొండితనం మితిమీరి పోతూందని ప్రతిపౌరుడు మొత్తుకుంటూనే వున్నాడే. ముప్పై రూపాయలు సంపాదించే జవాను మొదలుకొని, మూడు వేలు నెలజీతం పొందే అధికారివరకు లంచగొండితనం వ్యాపించిపోయింది. ఎంతటి చిన్న పని జరగవలెనన్నా చేతిలో పైసా ఉంచుకోవటం అత్యవసరం అయిపోయింది. తమ ఉద్యోగాదర్శాలను నిర్వహించాల్సిందని గవర్నమెంటువారు ఆదేశించి దానికి తగిన ట్లుగా జీతాలు ఏర్పాటుచేసినా, ఇప్పటి ఉద్యోగస్థులు ప్రజలవద్దనుండి పైసా పుచ్చుకోందే పని చేయుటం లేదు. మన పని జరగాలంటే వారి జేబుల్లో నోట్లు కుక్కటం తప్పని సరి అయి పోయింది. ఇటువంటి అన్యాయాలకు పూనుకోవటం దేనికి?

అధికంగా ధనం సంపాదించి గొప్ప గౌరవం, సుఖం పొందాలనే.. జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని. ఇదేవిధంగా అన్నిరకాల పనుల్లోను ప్రజలు అధర్మంగా ప్రవర్తిస్తుంటారు.

పురుషుడు సంపాదించటం, స్త్రీ, ఆ డబ్బుతో తనికి సకలసౌఖ్యాలు సమకూర్చటం మన గృహాల్లో సామాన్యంగా జరిగే కార్యక్రమం. ధనం సంపాదించేదంతా పురుషుడి మీదపడింది. కనుక పురుషుడే ఈ అధర్మానికి బాధ్యుడు.

మనదేశంలోని స్త్రీలందరూ ధనసంపాదనకు పూనకోరు. కాని రహస్యంగా కొందరు స్త్రీలు తమ భర్తలు సంపాదించే కొద్ది డబ్బుతో కల్గే సుఖంతో సంతృప్తి చెందక, వారిని విడనాడి, తమ మానాభిమానాలను అమ్ముకొని అధికంగా డబ్బు గడిస్తుంటారు. వ్యభిచారం ఇలానే రానురాను అధికమవుతూఉంది. ఒకరాత్రికి పది రూపాయలు తీసుకొని, తమ శరీరాల్ని పగలకొప్పగించి, వారి కౌగిళ్లలో నలిగిపోయి, సిగ్గును విడిచి, పరపురుషుల ఇచ్ఛానుసారం వర్తించే స్వైరిణులు ఈనాడు ఎంతో మంది కన్పిస్తున్నారు. ఈవృత్తి స్త్రీలకు చాల ధన సహాయకారి. దీనిలో స్త్రీలు ఎంతో బాధ, అసహ్యం, కష్టం పొందుతారు. అయినప్పటికీ మాను కోరు. ఎందుకూ! ఒక్కరాత్రిలో వందలు సంపాదించే అవకాశం ఉంది యీ వృత్తిలో. ఆ డబ్బుకోసం ఎంత నీచానికి పాల్పడవలసివస్తున్నదో చూడండి!

"ఇప్పుడున్న ప్రభుత్వాధికారులు, మంత్రులు మాకు బాగా తెలిసినవారే. మీ కే పని గావాలన్నా చేయిస్తాం. పర్మిట్లిప్పిస్తాం. లైసెన్సులు ఇప్పిస్తాం." అని ప్రజలదగ్గర డబ్బు కాజేసే కాంగ్రెసుబురఖాదారుల్లు రానురాను ఎక్కువవుతూ ఉన్నారు.

మనదేశ జనచర్యలను పరికించి చూస్తే ఒక్క ఇవే గావు, ఇంకా ఎంతో అన్యాయం గోచరిస్తుంది.

డబ్బుమీద ప్రతివాడికి ఆశ, మోజు ఎక్కువైపోయింది హద్దులు దాటి పోయింది గూడా! డబ్బుకు అధిక విలువ ఇవ్వటమే దీనికి కారణము.

డబ్బున్నవాడు గౌరవం, సుఖం, ఆనందం ప్రతిష్ఠ పొందుతూ ఉన్నాడు. లేనివాడు బాధలు, కష్టాలు, అవమానాలు, అమర్యాదలు పొందుతున్నాడు.


ప్రతివ్యక్తికీ సుఖం పొందాలనే ఆశ సహజమైనదే. కాని అది ఈనాడు డబ్బుతో లభ్యమవుటం చాల చిక్కైపోయింది. అందుచేతనే ప్రతివ్యక్తి ధనంకై అహర్నిశం తంటాలుపడటం.

ధనంమీద అంత మోజెందుకన్యా అంటే 'ధనమూలమిదం జగత్' అని ప్రారంభిస్తారు తమ చర్యలను సమర్థించుకుంటానికి. నిజంగా ధనం యొక్క విలువ ఎంతవరకుందో ప్రజలకు గ్రాహ్యం కావటం లేదు. పండిట్ నెహ్రూ చెప్పిన "*Money is useless, unless it is used to get something we need*" అనే వాక్యం ఎంతో సత్యమైనది.

మనకు అవసర వస్తువుల సేకరణకై సరిపోయే డబ్బుకన్న మితిమించి ధనముంటేనా ఉపద్రవమే. పూర్వం 'మైడాస్' అనే ప్రభువు ధనంమీద ఉండే అత్యాశచేత భగవంతునిగొద్ద తాకేది ముట్టుకొన్నా, అదెల్లా బంగారమయ్యేటట్లు వరం పొంది, తుదకు తన భోజ్యములైన వస్తువులుగూడ బంగారమై, తినటానికి తన కేమీలేక పస్తులలోపడి చావవలసివచ్చినందుకు ఎంతో విచారించాడట. చూచారా! మితిమించిన ధనం తింటకూడా పెట్టలేకపోయింది.

అట్టిదానికై ఇన్ని వేషాలు వేయటం ఎందుకు? అన్యాయాలు మోసాలు చేసి పాపాలకు గురికావటం ఎందుకు? అత్యాశకు పోక, ఉన్నదానితోనే తృప్తిజెందితే ప్రపంచంలో ఈ కష్టాలే ఉండటానికి ఆస్కారం ఉండదు గదా!

ప్రజలకు అట్టి బుద్ధిజ్ఞానం కలగనప్పుడు ప్రభుత్వమైనా ఆ పని చేయింగాలి. ఎప్పుడైతే డబ్బుకున్న ఎక్కువ విలువ నశించిపోతుందో అప్పుడే ఈ అక్రమాలు, అధర్మాలు, అన్యాయాలు అమానుషాలు నశించిపోతై. అప్పుడే ధర్మబద్ధమైన, నీతినియమాలతో గూడిన శాంతియుత ప్రపంచం ఏర్పడుతుంది. ప్రజలందరూ సుఖంగా జీవించగల్గేది అప్పుడే!



విజయవాడనుండి బందరు వెళుతూ ఉన్నప్పుడు జనవరి 20-వ తేది భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు ఈడుపుగల్లు వద్ద చేసిన గ్రామస్థుల స్వాగతమునకు సమాధాన మిచ్చుచున్న దృశ్యం.

శ్రీ శ్రీ బ్రహ్మశ్రీ కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు

కాకినాడపురవాస్తవ్యులును, సాహిత్యవిశారదబిరుదాంచితులును, విశ్వవిశ్రుత విద్వత్కవులగు సోదర పండితులలో నొకరును, శ్రీ పీఠికాపురసంస్థానవిద్వాంసులును నయిన కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రులుగారు 75 సంవత్సరముల యీడున 2-1-49 తేదీ మధ్యాహ్నము $2\frac{1}{2}$ గం. వేళ ఆకస్మికముగ స్వర్గస్థులైరని తెలుపుట కెంతయు చింతిల్లుచున్నారము.

సుబ్బయ్యశాస్త్రులుగారు బాల్యమున ప్రాచీన సంప్రదాయానుసారముగ గురుకులవాసము చేసి సంస్కృతమున కావ్యనాటకాలంకారాది సాహిత్యగ్రంథములను, భాష్యాంత వ్యాకరణమును సక్రమముగ శ్రీమత్ పరవస్తు రంగాచార్యులవారు మున్నగు పండిత ప్రకాండుల యొద్ద నభ్యసించి అనన్యసామాన్యమైన నైపుణ్యమును పడసిరి. పాండిత్యముతోపాటు సరసమగు కవిత్వమును వీరి కప్పుడే యలవడినది.

పదంపడి శాస్త్రులువారు తమ వాసస్థానమగు కాకినాడ పట్టణమున శ్రీ శ్రీ పీఠికాపుర సంస్థానాధీశ్వరుల కలాశాలలో సంస్కృత ప్రధానపండితపదవి నధిష్ఠించి బహుకాలము నూర్లకొలది విద్యార్థులను తమ యసాధారణ బోధనాకౌశలమున నానందాబ్ధి నోలలాడ్చుచు కృతార్థులను గావించిరి. వీరికి బోధనాకౌశలము నలంకరించిన ఉపన్యాసచాతురి కలదు రసోల్లసితములై, హాస్యప్రాయములైన శాస్త్రులవారి యుపన్యాసములన్నీ ఎల్లవారును విన చెవికోసుకొందురు. వీరి యుపన్యాసము మొదటినుండి చివరవరకును హర్షధ్వనులతోను, కరతాళముల తోను ప్రతిధ్వనించుచుండును. ఒక్కసారి వీరి యుపన్యాసము విన్నవారు ఎన్నటికిని వీరిని మరచిపోరు. సాధారణ సంభాషణయందు సైతము శాస్త్రులుగారు తమ సరస పరిహాసములచే మిత్రవర్గమును కడుపుబ్బ నవ్వింతురు. ఆంధ్రదేశమునందంతటను శాస్త్రులుగారియందాదరాభిమానములు గల ప్రాణమిత్రులు పెక్కండ్రు కలరు.

శ్రీ శ్రీ పీఠికాపురాధీశ్వరులు శాస్త్రులుగారిని శ్రీసూర్యరాయాంధ్రనిఘంటుసంపాదకులుగా నేర్పరచిన నవక నాలుగేండ్లలో "చ"కారము దాఁగా "న్యూనాధిక" పద మంతమందు గల పదసముదాయమును సంకలితము గావించి, ఇంచుమించు రెండువేలపుటలు గల మూడవ, నాల్గవ సంపుటములను ముద్రింపించిరి. మరి రెండేండ్లలో "ప"వర్గాద్యక్షరపదముల నెల్ల సంకలితము గావించి, మరిరెండు వేల పుటలు గల రెండు సంపుటములను అచ్చొత్తించుటకు సిద్ధపరిచించి యుంచిరి కాగితములు కరవగుటవలన ఆ భాగము ముద్రిత స్థితిలో నున్నది. కాని, కాకున్న 5,6 సంపుటములు సైతము వీరి సంపాదకత్వమున ముద్రాపితములై యుండి యుండును.

"నిండు మనంబు నవ్యనవ
నీతసమానము, పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము జ
గన్నుత విప్రులయందు."

అన్న నన్నయవచనము శాస్త్రులుగారి యెడ నత్యంతము అన్వర్థము. వీరు శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటునిర్మాణకార్యమునందలి యాత్రమున సహాయపండితులతో అప్పుడప్పుడు నిర్దాక్షిణ్యముగ ప్రసంగించియు కొంతసేపటికే తిరిగి వచ్చి "పెద్దవాడను, కార్యగౌరవముచే అట్లు పలుకవలసివచ్చినది. ఈ సోదరునియెడ అన్యథాభావ ముంచకుడు" అని వారి ననునయించువారు. వార్ధకమెక్కువయినతరువాత నిఘంటు నిర్మాణకార్యము నిర్వహింపజాలనని తెలిసికొని శాస్త్రులవారు తమయందలి కార్యభారమును తప్పింప ననుగ్రహింపుడని శ్రీ శ్రీ మహారాజావారిని ప్రార్థించి విశ్రాంతి చెందియు అభిమానాతిశయమున తరచు నిఘంటుకార్యాలయమునకు వచ్చి పండితులను హెచ్చరించి ప్రోత్సహించుచుండువారు. కడపటి దినమందు సైతము వీరు నిఘంటు కార్యమున ఆదరమును చూపి రనుట యథార్థకథనము.

సుబ్బయ్యశాస్త్రులవారి కళత్రము మూడేండ్ల క్రిందట ముసలితనమున గౌరీసాయుజ్యము చెందినది. వీరికి పట్టపరీక్షయందు తీర్ణుడై, శ్రీ పీఠాపురాధీశ్వరుల కళాశాలకు సంబంధించిన యున్నత పాఠశాలయందు సహోపాధ్యాయుడై, పితృవాక్యపాలకుడును, సాత్త్వికుడును అయిన యేక పుత్రుడును, సావిత్రీసమానయగు కోడలును, ముప్వురు మనుమలును, ముప్వురు మనుమరాండ్రును కలరు. వీరియిల్లు దోసతోటవలె పిల్లలతో కళకళలాడుచుండును. ఆ కుటుంబము దినదినాభివృద్ధి నొందునట్లీశ్వరు డనుగ్రహించుగాక.

"అనాయాసేన మరణం, వినా దైన్యేన జీవనమ్" మనియెడి రెండు మహాభాగ్యములును శాస్త్రులు గారికి పట్టినవి. పరమేశ్వరుడు వీరి యాత్మకు శాంతి నొసంగుగాక.

శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటు
కార్యాలయ పండితులు.

విజ్ఞానము :

నక్షత్రములు

శ్రీ డి. వి. రాజారావు

ఒక స్వచ్ఛమైనరాత్రి మనము ఎవరికైనను సాధారణదృష్టి (*naked eye*) కి ఎన్ని నక్షత్రములు కన్పించునని ప్రశ్నించినచో ఒక మిలియను అని సమాధానము వచ్చును కాని మన సాధారణదృష్టితో ఒక వెయ్యి నక్షత్రములను మాత్రమే చూడగల్గుదుము. ఇంకా సూక్ష్మదృష్టితో చూచినయెడల 1,500 లేక 2,000 మాత్రము చూడగల్గుదుము. చిన్నదూరదర్శని (*Telescope*) యంత్రము నుపయోగించిచూచిన 120,000 నక్షత్రములను చూడవచ్చును. అదే పెద్ద యంత్రము నుపయోగించి చూచిన 80,000,000 వరకు చూడవచ్చును. ఛాయాగ్రహణపు (*Photographic*) ఏర్పాటుగల దూరదర్శనియంత్రము నుపయోగించిన 30,000,000,000 నక్షత్రములను కనుగొనవచ్చునని అంచనా వేయబడినది

నక్షత్రములు స్వయంప్రకాశములు అందువలన అవి ఒక్కరాత్రులయందేకాక పగలుకూడ ప్రకాశించును. సూర్యునికాంతి నక్షత్రముల కాంతికంటె అధిక మగుటచే అవి సామాన్య దృష్టికి కాన్పించుటలేదు. పెద్దపెద్ద దూరదర్శని యంత్రముల నుపయోగించి చూచినచో పగటియందే నక్షత్రములు, గ్రహములు కన్పించును కాని గ్రహములకు, నక్షత్రములకు భేదము గలదు. గ్రహములు గ్లోబుమండలములవలెను, నక్షత్రములు మిణుకుమిణుకుమను ప్రకాశబిందువుల వలెను ఉండును. అవి కనపడు స్థూలనిర్మాణము (*Physical Constitution*) లో చాల భేదము కలదు. గ్రహములు సూర్యునిచుట్టు తిరుగు గోళములు. ఇవి తోకచుక్కలతోను, ఉల్కలతోను కలిసి మన మనకొను సౌరకుటుంబముగా ఏర్పడెను మనము ప్రతిదినము చూచు సూర్యుడు ఆ నక్షత్రములలో ఒకడే. మనము భూమిని విడిచి ప్లూటో (*Pluto*) దగ్గరకుంవెళ్లిన మనకు సూర్యుడుకూడ ఒక నక్షత్రముగానే కాన్పించును. మన ప్రయాణమును ఇంకా సాగించినచో, దూరము ఎక్కువైనకొలది సూర్యబింబము చిన్నదిచిన్నదై చివరకు ఆ కుటుంబమునకు చెందిన నక్షత్రములతో కలిసిపోవును. ఈ విధమైన కుటుంబములు విశ్వమునందు చాల గలవు.

తక్కిన కుటుంబాలకు చెందిన సూర్యులు, నక్షత్రములు మన సూర్యునికంటె పెద్దవి, కాంతివంతమైనవి. వాటియొక్క ఆకారము రంగును బట్టి మారుచుండును. మనకు సాధారణముగ ఎఱ్ఱటి చుక్కలు, నీలివర్ణపు చుక్కలు కనపించును. ఎఱ్ఱటిచుక్కలు, నీలివర్ణముచుక్కల కంటె చాలదూరములో ఉన్నవి మనము ఆ నక్షత్రముల దూరము మైళ్లలో చెప్పదలచినను, బరువును టన్నులలో చెప్పదలచినను బహుకష్టము. భూమియొక్క ఆకారమునుబట్టి నక్షత్రముల దూరము చెప్పవలయు ననిన ఈ క్రింది విధముగా చెప్పవచ్చును. భూమి ఆకారమునకు సమానమైన 1000 గ్రహములు కలిసిన జూపిటర్ గ్రహమునకు సమానము. సూర్యుడు 1000 జూపిటర్ గ్రహములకు సమానము. నీలివర్ణపు నక్షత్రము 1000 సూర్యులకును, ఒక ఎఱ్ఱనక్షత్రము 1000 నీలివర్ణనక్షత్రములకు సమానము. ఊహించిన సూర్యుని యొక్క బరువుసౌరకుటుంబములోని గ్రహములయొక్క మొత్తము బరువునకు 700 రెట్లని చెప్పవచ్చును.

సాధారణదృష్టితో చూచిన నక్షత్రములు రంగులో భేదము కనబడదు. వేగా (*Vega*) నక్షత్రము నీలివర్ణము రంగును, ఆల్డిబారను (*Aldebaran*) ఎఱుపురంగు కలిగియుండును. వీటినిబట్టిచూచిన యెడల కాలము గడిచిన కొద్ది నక్షత్రములు రంగులో మార్పుచెందును. సిరియస్ (*Sirius*) అనే నక్షత్రము మొట్టమొదట ఎఱుపు వర్ణము కలిగియుండెడిది 2000 సంవత్సరములు గడుచునప్పటికి అది తెల్లగా మారింది. హెర్స్కెల్ కాలములో లియోన నక్షత్రము తెల్లగా ఉండెడిది. అది ఇప్పుడు బంగారు రంగుగా మారింది. ఇదేవిధముగా చాల నక్షత్రముల రంగులు మారినవి

భూమికి దగ్గరగానున్న ప్రాక్సిమా (*Proxima*) నక్షత్రముయొక్క దూరముతో, భూమికి సూర్యునికి గల దూరమును పోల్చిన సూర్యుని దూరము అత్యల్పము ప్రాక్సిమా దూరము మైళ్లలో చెప్పాలంటే షుమారు 25,000,000,000,000. దూరమును ఇంకోవిధంగా చెప్పదలచిన ప్రకాశముతో పోల్చి చెప్పవచ్చును. ప్రకాశము ఒక సెకండుకు 18600 మైళ్లు ప్రయాణముచేస్తుంది. ప్రాక్సిమానుండి ఒక ప్రకాశకిరణము బయలుదేరిందనుకుందాము. అది భూమికి చేరేందుకు పూర్తిగా 4 సంవత్సరాలు పట్టుతుంది. దీనినిబట్టి నక్షత్రముల దూరములు అంచనా వేయవచ్చు ప్రకాశము సంవత్సరానికి 6,000,000,000,000 మైళ్లు ప్రయాణము చేస్తుంది. దీనిని నక్షత్రముల కొలతలలో ప్రకాశసంవత్సరము (*Light year*) అని అంటారు ఈవిధంగా ప్రాక్సిమా దూరము 41/3 ప్రకాశసంవత్సరాలు. నక్షత్రములలో ప్రకాశసంవత్సరమైన సిరియస్ దూరము 8 ప్రకాశసంవత్సరాలు. హెర్క్యులస్ నక్షత్రసముదాయముయొక్క దూరము 36,000 ప్రకాశసంవత్సరాలు.

భూమి తిరుగుటవలన నక్షత్రసముదాయములు కూడ, సూర్యచంద్రులవలె ఉదయించును, అస్తమించును. మనము ఛాయాగ్రహణయంత్రము (*Camera*) తో రెండు, మూడు గంటల వ్యవధితో ఒకే ప్రకాశవంతమైన నక్షత్రముయొక్క ఛాయను తీసిన, నక్షత్రముల కదలిక బాగుగా తెలియును. అదే విధముగా ధృవనక్షత్రమును ఛాయాగ్రహణ యంత్రముతో తీసిన ధృవనక్షత్రముదగ్గర ఒక బిందువుచుట్టు నక్షత్రములు తిరుగుచున్నట్లు చాపములుగాను, వృత్తములుగాను నెగెటివ్ (*Negative*) లో కాన్పించును. భూమియొక్క ఇరుసు ధృవనక్షత్రమువైపు చూపుచుండుటచే నక్షత్ర సముదాయములన్నియు ధృవనక్షత్రము చుట్టును తిరుగుచున్నట్లగుపించును. ఉదాహరణమునకు ఒక నక్షత్రము ధృవనక్షత్రమునకు 1° (చంద్రుని వ్యాసార్థమునకు రెట్టింపు) ఉన్న ధృవనక్షత్రమునకు దగ్గరగా, వృత్తాకారముగా తిరుగును నక్షత్రము 20° ఉన్న పెద్ద వృత్తములో తిరుగును.

భూమి తన మండలములో సూర్యునిచుట్టు తిరుగుటచే నక్షత్రసముదాయములు కొన్నికొన్ని ఋతువులలో మాత్రము కనబడును భూమి తిరుగుటవలన నక్షత్రములు ఉదయించుటలోను, అస్తమించుటలోను దినమునకు 4 నిముషములు ముందునకు వచ్చును. ఆ కాలము సూర్యునికాంతిచే మరుగగును ధృవనక్షత్రమునకు సమీపమున నున్న నక్షత్రములు మాత్రము సంవత్సరమంతయు కాన్పించును కాని తక్కిన స్థలములం దుండునవి కొన్ని వర్షాకాలములయందును, మరికొన్ని వేసవికాలములందును మనకు కాన్పించును.

సౌరకుటుంబము మొట్టమొదట ఒక పెద్ద నెబ్యులా (*Nebula*) నుండి పుట్టినది. ఈ నెబ్యులా ఆకాశములో పొగమంచువలె చాల స్థలమును ఆక్రమించుకొనును. ఈ నెబ్యులాలు ఆకాశములో చాల కలవని శాస్త్రజ్ఞులు కనుగొనినారు. మొదట 1781 లో మెషియర్ (*Messier*) 103 నెబ్యులా లున్నాయని కనిపెట్టినాడు. పెర్రిన్ (*Perrin*) 300,000 ఉన్నాయని కనిపెట్టాడు. కాని ఇప్పుడు కొన్ని మిలియను లున్నాయని తలచుచున్నారు. ఆకాశమంతలోను 30,000,000 నెబ్యులా లున్నాయని హబుల్ (*Hubble*) శాస్త్రజ్ఞుడు అంచనా వేసినాడు.

మనకు అత్యాశ్చర్యకరమైనది ఆండ్రోమిడా (*Andromeda*) లో కనిపెట్టిన నెబ్యులా. ఇది చిన్న దూరదర్శని యంత్రముగుండా చూచిన ప్రకాశబిందువువలె కాన్పించును. దీనిని సరిగా పోల్చి చెప్పాలంటే మన నక్షత్రవీథి (*Galaxy*) అంత ఉంటుంది. అది ఎంతపెద్ద దనగా ఒక ప్రకాశకిరణము ఒకప్రక్కనుండి మరియొక ప్రక్కకు చేరుకోవాలనిన 50,000 సంవత్సరాలు పట్టుతుంది. అక్కడ బయలుదేరిన ప్రకాశకిరణము భూమిని చేరవలెనన్న 900,000 సంవత్సరాలు పటుతుంది. ఈ దూరము ఊహకుగూడ అతీతమే 1925 సంవత్సరములో హబుల్ శాస్త్రజ్ఞుడు ఈ నెబ్యులా అనేక నక్షత్రముల సమ్మేళన మని కనుగొనినాడు

మనము ఆకాశమువంక చూచిన బహుసంఖ్యాకములైన నెబ్యులాలతోను, కొన్ని నక్షత్రములతోను కూడిన పాలపుంత (*Milky way*) మనకు కన్పించును కొన్ని ప్రాంతాలలో ఈ పాలపుంత చాల స్పష్టముగాను కొన్ని ప్రదేశాలలో అస్పష్టముగాను ఒక తెల్లని మేఘమువలె సామాన్యదృష్టికి గోచరించును. నక్షత్రములు, నెబ్యులాలు దగ్గిర దగ్గిరగా కలిసి ఆకాశమున ఉండుటచే అవి మన సామాన్యదృష్టికి వేటి కవిస్పష్టముగా కాన్పించవు. ఛాయాయంత్రంతో పాలపుంతయొక్క ఛాయను తీసి పరీక్షించిన వేటి కవి కానవగును. ఈ పాలపుంతను పరీక్షచేసిచూచినయెడల దానిలో కొన్ని దారులు, నల్లటిమచ్చలు రంధ్రములు మున్నగునవి కనపడును. మొదట సూర్యుడు ఈ పాలపుంత మధ్యలో ఉంటాడని ఊహించారు. కాని ప్రస్తుత పరిశోధనలవలన సూర్యుడు పాలపుంతమధ్యలో లేడనియు, కాని కొంత దగ్గిరలో మాత్ర మున్నాడని స్పష్టపరిచారు. సూర్యునికి పాలపుంతకు మధ్య దూరము 20 దగ్గరనుండి 50,000,000 ప్రకాశ సంవత్సరాలుంటుం దని తలచుచున్నారు

ప్రతిరాత్రి మనము పరీక్షించి ఆకాశమువంక చూచిన మనకు నక్షత్రాలు ఎప్పుడూ ఒకచోట ఉంటున్నట్లు కనిపించును. కాని కొన్ని సంవత్సరములు నక్షత్రములు కదలినట్లు కనుపించక పోయినను కొన్ని శతాబ్దములకు అవి వాటి స్థానములనుంచి మారినట్లు మనకు స్పష్టముగా గోచరిస్తుంది మన నక్షత్రాలలో ఒకడైన సూర్యుడు ఆ సిద్ధాంతాన్ని పాటించక జగత్సృష్టిలో సెకండుకు 200 మైళ్లు చొప్పున పర్యటనము చేయును సూర్యుడు ఈ వేగముతో తన మండలమును పూర్తి పర్యటనముచేయుటకు 250,000,000 సంవత్సరములు పట్టును సూర్యుడు ఎన్నిసార్లు ఈ మండలములు పర్యటనముచేసినాడని ప్రశ్నించిన సమాధానము బహుకష్టము. కొందరు వెయ్యిసంవత్సరాలనియు, మరికొందరు వందవేలనియు అంటారు కాని స్థిరమైన సంఖ్య ఎవ్వరు చెప్పలేరు. సూర్యుడు, గ్రహములు అన్నియు ఈ జగత్ సృష్టిలో తమ మండలాలలో తిరుగుచున్న ఒకదాని కొకటి ఢీకొనదా అని అనుమానము రావచ్చును. కాని మనము ఒక్కసారి కాగితముపై సౌరకుటుంబముయొక్క పటము గీచి చూచుకొనిన ఇది ఎన్నటికి సంభవము కాదని మనకు తెలియును అన్నిటికి దూరములోనున్న ప్లూటో (*Pluto*) నక్షత్రముయొక్క వ్యాసము 1500 అడుగులుగా పరములో గుర్తించిన మన సూర్యునియొక్క మండలము ఒక బిందువు (.) గా గుర్తించాలి. పరము వైశాల్యము 15 చదరపు మైళ్లను కొనిన సౌరకుటుంబమును గూడ పరములో ఒక బిందువుగా గుర్తించాలి దీనిని బట్టి చూచిన విశ్వములో నక్షత్రములు తిరుగుటకు చాల ప్రదేశము కలదని, అందువలన ఒకదాని కొకటి ఢీకొను అవసరం ఉండదని మనము తెలిసికొనవచ్చును.

సమాంతర చతుర్భుజాకారములో నుండు సప్తఋషుల (*Great bear*) యొక్క ప్రకాశపు మచ్చ మన సామాన్యదృష్టికి అతీతము. మనము పెద్ద దూరదర్శినియంత్రములగుండా చూచిన 60 నెబ్యులాల సమ్మేళన మనియు, అవి భూమికి 150,000,000 ప్రకాశసంవత్సరాల దూర ముంటుందనియు తెలుస్తుంది మొదట నక్షత్ర వీథి నుండి ప్రకాశము భూమిని చేరవలయు ననిన 146,000,000 సంవత్సరములు పట్టు నని అంచనా వేశారు. బేకరు (*Baker*) శాస్త్రజ్ఞుడు 250,000,000 ప్రకాశ సంవత్సరములు పట్టునని కనుగొనినాడు. తరువాత నూతనపరిశోధనల ననుసరించి 6,000,000,000 ప్రకాశసంవత్సరాలని తలుచుచున్నారు. ఈ హద్దును మనము మన ఊహాదృష్టితో దాటిన అంతా శూన్యప్రదేశమే.

సర్ తేజ్ బహదూర్ సప్రూ

(7 వ పేజీ తరువాయి)

other cultures . it is absurd to maintain in the year 1941 that there is such a thing as a purely Hindu culture and such a thing as a purely Muslim culture In my opinion it would be neither wise nor patriotic to do any thing to destroy this common culture and for the Hindus to substitute for it an un-adultrated Hindu culture and for the Muslims to substitute for it an un-adultrated Muslim culture."

ఆయన టాగూరు మహాకవికి స్మారక మేర్పరచుట కేర్పడిన సంఘాధ్యక్షుడుగకూడ వ్యవహరించెను

వ్యక్తిగత జీవితము

వ్యక్తిగతజీవితములో ఆయనకు ప్రియమైనవి మూడు విషయములని చెప్పుదురు. అందు మొదటిది అతిథులకు సత్కరించుట; రెండవది భారతీయ వేషమునే ధరించుట; మూడవది పొగత్రాగుట. ఆదర్శభోజనమును ఆయన "హిందూ వంటశాలయందు ముస్లిము పదార్థములను వండి పాశ్చాత్యపద్ధతిని వడ్డింపబడినది"అని నిర్వచించెనట! మిత్రులతో హృదయంగమముగ సంభాషించుట నీయన ఒక లలితకళవలె అభ్యసించెను. సప్రూగారి వ్యక్తిగతగుణములనుగూర్చి స్వర్గీయ వి. యస్ శ్రీనివాసశాస్త్రిగారు వ్రాసిన కొన్ని మాటలు ఉల్లేఖింపదగినవి

"...let a kind fate continue two of his sweet qualities undiminished There is not a more generous, more attentive or more tender host. I have enjoyed his hospitality and should know. He has warmed me when I was cold, doctored me when I was ill, comforted me when I was low. Under his roof nothing was wanting that a noble man may reasonably covet. Then of evenings when he sits on the verandah imbibing scented smoke through the hubble-bubble, you hear a raconteur of the first quality entertaining a fair sized audience of all visitors and laughing and shouting with them. The anecdotes are varied and clean and full of interest . .. Sapru's narration is lively, pointed and of literary merit."

సర్ టి. బి సప్రూ అమూల్యజీవితం ముగిసింది. నిరుడు దాదాపు యిదే కాలంలో జాతిపితను కోల్పోయిన భారతావని ఈ సంవత్సరం ప్రముఖమేధావిని కోల్పోయింది. ఒక్కమాటలో యీయనప్రతిభను వర్ణించాలంటే 'Happy Warrior' అను పద్యమున ఆదర్శవ్యక్తి ఎవరో నిర్వచించిన 'Words Worth' కవి నేడుజీవించియుండిన సప్రూవంటి వ్యక్తులేఆదర్శపురుషుడు అను పదము నిర్వచించుటలో తన దృష్టియం దుండిరని తల పంకించియుండెడివాడు. ఈ మహనీయుని ఆత్మకు శాంతి కల్గుగాక!

ఆద్యంతాలు

(6-వ పేజీ తరువాయి)

"మోటారు సర్వీసుపెట్టి దివాలా తీశాడు."

"ఐతే అతను ఆమెతో అన్యోన్యంగా ఉండే వాడు కాదన్నమాట ?"

"ఉండేవాడు కాదు"

"పోలీసులకు ఇతను బాగా తెలుసునా ?"

"తెలిసే వుంటుంది"

"పర్వాలేదులే! ఒరేయి అనంతం! నేను చెప్పేది జాగ్రత్తగా విను ఇక్కణ్ణించి వెళ్ళగానే గది కెళ్ళిపోయి, నేను నీ దగ్గరకొచ్చేపర్యంతం బైటికి కదలకు. ఏమిటి! కదల నని వాగ్దానం చెయ్యి!"

"కదల నన్నయ్యా"

"సరే! వెళ్ళిపో! .. తొందరపడకు! .. ఎవరితోటీ మాట్లాడకు. కాస్త స్తిమితంగా వుండు."

"సరే అన్నయ్యా!" అని అనంతం వెళ్ళడానికి లేచాడు. పాలిపోయి వణికిపోతూన్న అనంతాన్ని చూసి, నీలకంఠం "ఒరేయి అనంతం, ధైర్యంగా వుండు!" అని అన్నాడు హఠాత్తుగా తననిగురించి ఆలోచించుకుని, "వాణ్ణి ధైర్యం వహించమన్నాను గాని, నాకే గుండె జారిపోతూంది" అని తనలో తాను నీలకంఠం అనుకున్నాడు.

2

నీలకంఠంఇల్లు వదలి అనంతం, తనగది చేరుకున్నాడు. కొంచెం సేపు పరుగెత్తినట్లు నడిచాడు; కొంచెంసేపు కాళ్ళీడ్చుకుంటూ నడిచాడు మళ్ళీ అతివేగంగా నడక సాగించాడు. ఈ ప్రపంచంలో రకరకాలైన మనఃప్రవృత్తి గల వ్యక్తులున్నారు. పట్టుదలతో ఒక్కసారిగా ఏదో ఒక పనిని కొంతమంది చేస్తారు. మరి కొంతమంది, ఏ పట్టుదలా లేకుండా ప్రాలుమాలికతో, ఎటువంటి కార్యాన్నైనా చేసేస్తూంటారు. ఏపని చేసినప్పుడేనాసరే "ఏమాత్రం దేమిటి? రేపు చచ్చిపోతే పోతాము. అంతేగా!" అనే నిశ్చింత జీవితంగురించి ఏర్పడిపోతుంది. అనంతంఅన్నగారింటికి ఎంతో ప్రయత్నంమీదే వెళ్ళాడు బైలుదేరేముందు జీవితఆద్యంతాలలు గురించి తీక్ష్ణంగా ఆలోచించి "సరే! బ్రతుకుతామా మంచిది లేదూ మరీ మంచిది." అనుకునే వెళ్ళాడు. అన్నగారింటికి బైలుదేరే ముందున్న జిజ్ఞాస, ఇప్పుడతనిలో లేదు. ఏదో బరువు తీసివేసినట్లు అనిపించింది. ఈ ఆలోచనలు మెదడులో పరువులెత్తుతూండడం చేతనే అతని నడకలో ఆ విధమైన మార్పులు కల్గినాయి అన్నగారు, తనగదికి వచ్చే పర్యంతం, తాను వాగ్దానం చేసినరీతిని గదిలోనే, కదలకుండా ఉండామనే నిశ్చయంతోనే అనంతం బైలుదేరాడు నీలకంఠంచేతిలో తన జీవితమంతా వుందని అనంతానికి తెలుసును. అతను నడవలేక పోయాడు. శారీరకంగా, మానసికంగా చాలా అలసిపోయాడు. చేతిలో పిస్తోలుంటే పేల్చుకుని చనిపోవా లనిపించిందతనికి ఆమెనుగురించి తల్చుకున్నాడు; ఐదుమాసాలనుంచీ తనని ఎంత ప్రేమతో, ఆరాధనతో ఆమె చూస్తూందో! తనలో మానవత్వాన్ని లేపిన ఆమెను ఎన్నో సార్లు నడుస్తూ మనస్సులో తల్చుకున్నాడు. తనకోసం ఓచిన్న లేత హృదయం, ఓ మూల తీసెస్తూ వేచివుందని తెలుసును. ఐనా ఎందుకో, ఆ నిమిషాన్ని ఆత్మహత్య చేసుకుంటే బాగుండిపో ననుకున్నాడు.

ఆమె వుండే వీధిచాయలు సమీపించాడు అనంతం. ఆవేళ ప్రొద్దున్న, ఒకరినొకరు భయములో అంటిపట్టుకు కూర్చునదృశ్యం మెరపులా కళ్లకు తట్టింది. మరి, భయాన్ని ఆ ఘోర కృత్యాన్నీ మరిచిపోయేందుకు ప్రేమలో పడిపోయి ఆ అనుభవరక్షణంలోనే వారిద్దరూ సేద తీర్చుకున్నారు అన్నకిచ్చిన వాగ్దానం మాట మర్చిపోయి, అనంతం ఆమెఇంట్లోకి వెళతాడా? ఎందుకు వాగ్దానం చేశాడో? మందుల షాపు కిటికీ అద్దంలో తన ఆకారం చూసుకున్నాడు. ఏహ్యంగా, రక్తమాంసాలు లేని నీడలా వున్నాడు; తనకీ నీలకంఠానికీ ఉన్న తేడా, అంతరాంతరాలలో కనిపించింది. నీలకంఠం—పేరుప్రోగినలాయరు—అనంతం—అధమాధముడు, వ్యసనలోలుడు! మళ్లీ ఒక్క తల్లికడుపున పుట్టిన బిడ్డలు. ఒకసారి బండికికట్టిన గుర్రంఎంతప్రయత్నించినా నడవకపోయినప్పుడు బండీవాడు గుర్రాన్ని చావదందుతూంటే, అనంతం చూసి సహించలేక, గుర్రబ్బండీవాణ్ణి చావబాదాడు. చివరకు ఈగనుకూడా చంపడానికి వెరచే అనంతం, ఈ నాడు, నిండు ప్రాణాలతో వున్న ఒక మానవుణ్ణి హత్యగావించాడంటే ఎంతేనా ఆశ్చర్యంగా వుంది!

అనంతం ఆ మందులషాపుముందరే నిలబడిపోయాడు ఎందుకో అతనికి విపరీతమైన ధైర్యం కల్గింది పోలీసువారు వచ్చి తనని పట్టుకున్నా భయంలే దనుకున్నాడు. షాపులోకి వెళ్లి ఏదేనా విషం కొనుక్కుని పుచ్చుకుని హాయిగా చనిపోదా మనుకున్నాడు. వాళ్లంతా ఆత్మహత్య మహాపాతకమంటారు. కాని అనంతం పడుతూన్న తపన వాళ్ళకేమి తెలుసు? ఆత్మహత్య ఎంత పవిత్రమైనదో!

మందుల షాపులోకి వెళ్లి నిద్రమందిమ్మని అనంతం అడిగాడు. మందులవాడు, మందుకలిపి ఇస్తూంటే అనంతం ఎంతో బడలికతో బల్ల నానుకొని నిలబడి "అయ్యో! ప్రాణాలు, నిర్నిమిత్తంగా, వానిలోంచి తీసేశానే! జీవితం! ఒక్కశ్వాస - ఒక్క వెలుగు! - అంతే! మరేం కాదు. కాని ఎందుకు నేనిట్లా బాధపడాలి? నా కెందుకీ తీరనివేదన!" అని ఆలోచించాడు. మందులవాడు, మందు తీసుకొచ్చి ఇస్తూ, "నిద్ర పట్టడం లేదండీ?" "ఔను!" అని, మందు త్రాగేసి, అనంతం తిరిగి వీథిలో పడ్డాడు. శవాన్ని పారవేసిన ఆ ఆర్చికిందకి వెళ్లి చూద్దామనే కోరిక కల్గింది. అడ్డదారిని ఆ ఆర్చివేపు, మళ్లాడు. ఎందుకు అక్కడికి వెడుతున్నాడో అనంతానికే తెలియదు. ఆ చీకట్లో, ఆ రాత్రివేళ, అంత చలిలోనూ ఎవరోపచారు చేస్తూన్న దృశ్యం అనంతం చూడగల్గాడు అనంతం దగ్గిరగా వెళ్లాడు. పేదవాడు, బిచ్చగాడు, బికారి! తనకంటే పరమ నిర్భాగ్యుడే పేదవాడని అనంతం అనుకున్నాడు. వాని పేదరికం చూసి, అనంతం దుఃఖంతో లోలోపల దించుకుపోయాడు

"బాబూ! నువ్వెవ్వడవు? - నాలాగే నీకూ చీకటివాసమంటే ఇష్టమా?" అని ఆపేదవాడు అనంతాన్ని నవ్వుతూ అడిగాడు.

"బాబూ! నాకున్న భాగ్యమే నీకూ ఉన్నట్టుందే! నాకూ భాగ్యానికీ పొత్తు చెడిపోయింది. నేను చితికిపోయాను ఐనా, ఓమాట చెప్తాను. నాకు తెలుసులే, నా వేషం చూసి నమ్మవు ఐనా, నేను ఒకానొకప్పుడు దేవాలయాలన్నింటికీ అధికారిగా వుండేవాణ్ణి."

అనంతం ఒక పావలా తీసి ఇవ్వబోయాడు. కాని ఆ పేదవాడు, "వద్దు; నీదగ్గరే వుంచుకో. నా దగ్గిర డబ్బుంది. కాని నీవు చూపిన సానుభూతికి నేనెంతో కృతజ్ఞుణ్ణి! పతితునికి డబ్బుకంటె, సానుభూతి ఎక్కువ విలువైనది"

"నువ్వు నిజం చెపుతున్నావు."

"నాకు చనిపోవా లని ఉంది బాబు. ఈ జీవితం బాగులేదు. ఆత్మాభిమానం పోగొట్టుకొని బ్రతకడం చాలా కష్టంగా వుంది. ఆత్మాభిమానం పోగొట్టుకోకండా, ఆకలి మంటలతో మానవుడు ఎంతికాలం జీవించగలడో అని ఎన్నో సార్లు ఆశ్చర్యపోయాను. బాబూ! ఆట్టేకాలం ఆత్మాభిమానాన్ని పట్టుకు మానవుడు వ్రేలాడలేడు. ఔను కాని, 'హత్యగురించి పత్రికలో చదివావా? ఇక్కడే, ఈ ప్రదేశంలోనే, ఆ హత్య జరిగిందట ఇందాకటినుండీ ఆ శవం కోసం వెతుకుతున్నాను." అన్నాడు పేదవాడు.

"నేనూ అందుకే వచ్చాను" అని ఉద్వేగంగా భయభ్రాంతులతో అనంతంసమాధానం ఇచ్చాడు

"బాబూ! నేను వెడతాను!" అని ఆ పేదవాడు వెళ్లిపోయాడు అనంతంచేసిన హత్య గురించి ప్రతివారూ అనుకుంటున్నారా? ఆఖరికి, పేదవారుకూడానా!

3

మానవప్రకృతిని అర్థంచేసుకోవడం చాలా కష్టము. పదిగంటలకి ఉరితీయబడతారని తెలిసికూడా, శిక్షకోసం భయపడక, ఎనిమిదిగంటలకి చదరంగం ఆడేవాళ్లున్నారు నిజానికి అటువంటి వ్యక్తులే జీవితంలో పైకి రాగలరు. బారిష్టరు నీలకంఠం అటువంటి జాతికి చెందినవాడే! తన సోదరుడు చావుబ్రతుకులమధ్య ఊగిసలాడుతున్నాడని తెలుసును అతని మూలంగా తన కీర్తికి పెద్దకళంకం రానుందని తెలుసును—ఐనా నీలకంఠం ధైర్యాన్ని, ఈషణ్మాత్రం విడవలేదు. నీలకంఠం, కాలినడకని అనంతంఇంటికి బైల్దేరాడు దారిపొడుగూతా ఆలోచిస్తూనే వున్నాడు.

ఘోరమైన హత్య! ఫలితం కళ్లకి కడుతూనే వుంది. అనంతం చేయాలని చేయలేదంత ఘోర కృత్యము! ఐనా వాడి ప్రాణాలు ఎగిరిపోయాయి! అనంతంవంటి మనుష్యులు—దుర్బలులు-ఆవేశపూరితులు—మమత్వపీడితులు—లోవెలుగులు కలవారు—వారు చేసేవన్నీ ఉద్దేశ్యపూర్వకాలేనా? నేరం—హత్యానేరం—మరుగుపరచాలి! సోదరుణ్ణి ఉరికంబం ఎక్కించనియ్యకండా చేయించాలి! పోనీ ఊరుకుంటే! అనంతం పారిపోతా డనుకోండి కాని ఆమె వుంటుందిగా! ఎప్పటికైనా నేరం బైటపడవచ్చును అటువంటి స్త్రీలను నమ్మడానికి వీలు లేదు. పోనీ నీలకంఠానికి ఈ గొడవంతా ఎందుకు? కాని, 'నీలకంఠం సోదరుడు ఒక స్త్రీగురించి హత్య గావించాడే!—' ఈపవాదు నీలకంఠం భరించలేడు. తన అభోరు నిలవదు. ఐతే, ఏమని అనంతానికి సలహాఇవ్వడం? పోలీసులకి లొంగిపొమ్మనాని...... ద్వీపాంతరవాస శిక్ష వేస్తారేమో!

అనంతం చిన్నప్పటెంతో అల్లారుముద్దుగా పెరిగాడు? తమ్ముణ్ణి, ఒక్కనిమిషం వదిలి వుండేవాడు కాడు నీలకంఠం అనంతం చదువు సందెలకోసం, నీలకంఠం ఎంతో డబ్బు వెచ్చించాడు. తల్లి చనిపోతూ, తమ్ముడుభవిష్యత్తు కాపాడవలసిందని చెప్పి అనంతాన్ని, నీలకంఠానికి అప్పచెప్పింది బహుశా మాతృస్మృతి రావడంచేత ఎట్లాగైనా తమ్ముణ్ణి ఆ స్థితినుండి రక్షించడానికి నీలకంఠం పూనుకునవుంటాడు.

ఆ శవాన్ని పారవేసిన ప్రదేశంలోకి వెళ్లి, నీలకంఠం, సమస్తం పరీక్షిద్దా మనుకున్నాడు అంతలోకే నీలకంఠానికి, గస్తీ తిరుగుతూన్న పోలీసువాడు కనిపించాడు. నీలకంఠం ధైర్యం తెచ్చుకుని—

"ఐతే ఇక్కడే నేమిటి, ఆశవం కనిపిస్త?"

అని పోలీసు నడిగాడు.

"ఔనండి!"

"ఐతే ఇంతవరకూ హంతకుణ్ణిగురించి ఆచోకీ తెలియలే దన్నమాటేనా?"

"ఏమోనండి, వార్తాపత్రికల్లో ఈ హత్య సందర్భంలో ఎవణ్ణీ బంధించినట్లు కనపడలేదు ... వార్తాపత్రికల్ని నమ్మడానికి వీలు కాదండి."

"అబ్బా! చాలా చీకటిగా వుందే ఇక్కడ! ఈ ఆర్చికింద మనుష్యులు పడుకుంటూరంటావా?"

ఔనన్నట్లు పోలీసు తల ఊపాడు.

"అతనివంటిమీద ఏమీ కనిపించలే దన్నట్లు పత్రికల్లో చదివాను. నిజమేనా?"

"ఒక్కదమ్మిడీకూడా జేబుల్లో లేదట పైగా జేబులు లోపలవి బైటకికూడా ఎవరో లాగేశారు"

"సరే, నేను వెడతాను."

"మంచిదండీ!" అని పోలీసువాడుకూడా మరో దారమ్మట వెళ్ళిపోయాను "లోపలి జేబులు బైట కొచ్చేశాయా?" అని నీలకంఠం తక్షణం ఆలోచిస్తూ చురుగ్గా అడుగులేయడం మొదలెట్టాడు అనంతం చేసినా, మరెవ్వరు చేసినా, కేసు పెట్టిననాడు నెగ్గడానికి ఆస్కారం కాని మంచివిషయం అది. తమ్ముణ్ణిరక్షించడానికి వీలుసాళ్ళు ఆలోచిస్తూన్నకొద్దీ, చాలా కనిపించాయి. కాని ఆమె? ఆమెచేతిలో వుంది అనంతంప్రాణం; ఆమె నెట్లాగైనా లొంగ తీసుకోవాలి

నీలకంఠం మెల్లిగా వీధిలోకి మళ్ళాడు. ఆవీధి అంతా నిర్జనంగా కారు చీకటిగావుంది నీలకంఠం, ఆమె దగ్గిరకు వెళ్లడానికి నిశ్చయించాడు. 42 నెంబరు ఇంటి తలుపుకోసం వెదుకుతూ వున్నాడు అనంతం దగ్గిరనుండి తీసుకున్న తాళంతో గదితాళం తెరిచాడు కాని, నీలకంఠం లోపలికి అడుగువేసేందుకు జంకాడు. అంతా చీకటి! ఓమూలమాత్రం కొవ్వొత్తి జోగుతూ వెలుగుతూంది. లోపలి గదిలోకి నడిచివెడుతూంటే, మూలనుండి ఏదో ఆకృతి కదిలిన ట్లనిపించింది.

"ఎవరు? నా అనంతమే! నా కెంతో భయం వేసింది రాజా!.. రా! లోపలికిరా!" అంటూ ఆ చీకట్లోనే ఆమె నీలకంఠంకంఠాన్ని కౌగిలించుకుంది. నీలకంఠం ఎలక్ట్రిక్ లైటు స్విచ్ కోసం తడుముతూ, ఆఖరికి స్విచ్చి నొక్కాడు. ఆమె హఠాత్తుగా నీలకంఠాన్ని వదిలేసి బిత్తరి చూపులతో నిశ్చేష్టురాలై పోయింది

"ఎవరు?" అని ప్రశ్నించి బొమ్మలా గదికి ఓమూలగా నిలబడిపోయింది.

"భయపడకు! నేను అనంతంస్నేహితుణ్ణి! నీకు పోలిచెద్దా మని రాలేదు. ఇక్కడ కొంచెం సేపు కూర్చుని, నీతో కొన్ని విషయాలు మాట్లాడుదామని వచ్చాను నీ క్షేమైనా అభ్యంతరం వుందా?" అని అంటూ, తాళం చెవి చూపిస్తూ, "ఈమాటైనా నమ్ముతావా?" అని నీలకంఠం అడిగాడు. అప్పటికీ ప్రతిమాసుందరిలా ఆమె మెదలకండా అలాగే నిలబడిపోయింది.

"నువ్వు కూర్చోవా?.. అంత భయం కల్గించినందుకు నన్ను క్షమించు!"

ఆమె కొంచెం తేరుకుని, లోగొంతుతో

"మీ రెవరో చెప్పరూ?" అని దీనంగా అడిగింది.

"నేను అనంతంఅన్నగారిని"

ఆమె పెద్ద నిట్టూర్పు విడిచి కుర్చీలో కూలబడింది. చంటిపిల్లముఖంలోని అమాయికత ఆమెముఖంలో కనిపించింది

"నిశిరాత్రివేళ వచ్చి నీ మనస్సును కలతపెట్టినందుకు క్షమించు. అనంతం జరిగిందంతా చెప్పాడు"

ఆమె ముఖంలో చేతులెట్టుకు వెక్కివెక్కి యేడ్చింది.

"నువ్వు చాలా చిన్నదానివే!"

"ఇరవై సంవత్సరా లుంటాయి!"

"మా తమ్ముడంటే నీకు."

"అతనికోసం ఈ నిమిషాన్ని చచ్చిపొమ్మంటే చచ్చిపోతాను!" అనంతంయెడల ఆమె కున్న అవ్యాజమైన ప్రేమను నీలకంఠం గుర్తించాడు.

"మాడు, నీవతణ్ణి ఎంతవరకూ ప్రాణాపాయాన్నుండి తప్పించగలవో తెలుసుకుందామని వచ్చాను. నేను కొన్ని ప్రశ్నలేస్తాను. సరియైన సమాధానం ఇవ్వాలి."

"తప్పకుండాను"

"ఆ చనిపోయిన మనిషి - నీభర్త - చాలా చెడ్డవాడా?"

"అంత చెడ్డవాణ్ణి నేను ఇంతవరకు ఎక్కడా చూడలేదు."

"నిన్నరాత్రి చూసేముందు, ఎంతకాలమై వుంటుంది—అతన్ని నువ్వు చూసి?"

"పద్దెనిమిదిమాసాలు."

"అతనూ, నువ్వూ పూర్వం ఎక్కడుండేవారు?"

"చాందినీలో."

"ఇక్కడిచుట్టుపక్కలవారు, నువ్వు శోభనాచలం భార్యవని ఎరుగుదురా?"

"ఉహుఁ! నా పిల్ల చనిపోగానే, ఏం చేయడానికీ పాలుపోక ఈ వీథిలో కొచ్చేశాను. నే నెవరినో ఎవరికీ తెలియదు"

"ఆ శవాన్ని గుర్తుపట్టి, శోభనాచలమేనని, నిర్ధారణ అయిననాడు, అతని భార్యకోసం వెతికినప్పుడు నీవు బైటపడవచ్చుగా?"

(22వ పేజీ చూడుడు)

ఎరువులు

శ్రీ గుండెపూడి శ్రీరామమూర్తి

వృక్షారోపణ వాటి వృద్ధికే గాక మానవ శ్రేయస్సునకే అత్యవసరము. మానవాహారము చెట్లనుండి నేరుగా కూరగాయలు, పండ్లు, గింజలు మొదలుగాగాను *indirect* గా చెట్ల మీద ఆధారపడి బాగుగా బలసిన జంతుమాంసముగాగాను లభించుచున్నది. అందుచే చెట్ల పెరుగుదల మానవసంరక్షణకూ మానవజీవితమునకూ మూలాధారము.

చెట్లు బాగుగా పెరుగుటకు కావలసినంత సూర్యరశ్మి, నీరు కర్బనద్విఆమ్లజనిదము (Co_2) మరికొన్ని నత్రజని, భాస్వరము, పొటాసియము కలిగిన పదార్థము లవసరము. చాలావరకూ ప్రకృతినుండి సూర్యరశ్మి నీరు గాలిలోనూ, భూమి కర్బనద్విఆమ్లజనిదము వాతావరణములోనూ వృక్షములు పొందగలుగుచున్నవి. కానీ వృక్షములు నిరంతరము పెరుగుటచే మూలపదార్థములు భూమినుండి పిండివేయబడుతవి. అందుచే కావలయు పదార్థములను తిరిగి భూమికి ఇవ్వనిచో నిస్సారమయి చెట్ల పెరుగుదల కుపయోగకారి కాకుండును. కావుననే కృత్రిమపద్ధతులతో భూమిని సారవంతపరచుట అవసరము. ఈ కారణమే ఎరువుల విజ్ఞానశాస్త్రము (*Science of Fertilization*) నకు పునాదిరాయివంటిది.

పెరిగే చెట్ల వలన జంతు ఎరువుల వుపయోగము నేక శాస్త్రవేత్తలచే గ్రహించబడినది. సర్ కెనెల్ డిగ్‌బీ (ఇంగ్లండు) 1669 లో సోడియ నత్రితము (*Salt Peter is No.* No_3) అద్భుత ఎరువులా పరిగణించవచ్చని ఓ పరిశోధన పత్రములో విదితము చేశాడు. 1840 లో థియో డి సాసర్ (*Theo De Saussure*) అను శాస్త్రవేత్త వృక్షభస్మము లేనిదే చెట్ల జీవితము దుర్లభమని కనుగొనెను. ఇప్పటి కృత్రిమ ఎరువుపద్ధతికి 1840 లో జస్టస్ వాన్ లెబిగ్ (*Justus Von Liebig*); అను నాయన పునాది వేశాడు. 19 వ శతాబ్దమధ్యమున నత్రజని, భాస్వరికామ్లము, పొటాసు ఎరువులకు మూలపదార్థములుగా పరిగణింపబడినవి.

వృక్షజీవితమున కత్యవసరమైన పదార్థములు - నత్రజని; భాస్వరము (*Phosphorous*); పొటాసియము. వీటిని చెట్లు గ్రహించ వలయునన్న నీటిలో కరుగుపదార్థముల లాగా ఇవి భూమిలో కలసియుండవలెను. ఎరువుల నమ్మువారిచే అమ్మోనియా, నత్రజని అనిగాని అమ్మోనియా అనిగాని పిలువబడుచున్నది. భాస్వరికామ్లము చాలావిధముల వుచ్చరింపబడుచున్నది—*Bone Phosphate*, భాస్వరికామ్లము *Potassium* (పొటాసియము) పొటాసియామ్లజనిదము (K_2O) లాగాని పొటాష్ లాగాని పరిగణింపబడుచున్నది. సమస్త ఎరువుల విలువయు వాటి రకము, గుణము, వాటిలోని నత్రజని, భాస్వరికామ్లము, పొటాసు మీద ఆధారపడియున్నది. పలురకముల పాళ్లలో నత్రజని మొదలగునవి కలుపుటచే ఎరువులు తయారగుచున్నవి.

నత్రజని ఎరువులు

ఈ రసాయనిక పరిశ్రమలవలన జరుగు గొప్ప చలనములలో 1912 లో అమ్మోనియాను తయారుచేయుటకు మొదలెట్టిన హేబర్-బాష్ పద్ధతి (1912) ఒకటి. ఇలా తయారయిన అమ్మోనియా *Explosives* తయారుచేయుటలో ముఖ్యముగా వుపయోగించబడుచున్నది. కానీ క్రమేపీ వివిధఎరువుల తయారుచేయుటలో విరివిగా వుపయోగింపబడుచున్నది నత్రజనియును ఉదజని (*Hydrogen*) యను కలసి అమ్మోనియా నిచ్చుటకు కావలయు అవకాశము జర్మనీలో హేబర్ (*Haber*) చే సమకూర్చబడినది. $N_2+3H_2=2NH_3+21,850$ క్యాలరీలు రెండువందల ఎట్మస్ఫియర్ల *Pressure* వుపయోగించుతూ నత్రజనియును, వుదజనియును 1 3 నిష్పత్తిలో కలుపబడును. ఆ వాయుసమ్మేళనము తరువాత మూగగా వేడిచేయబడిన క్యాటలిస్టు (*Catalyst*) పై పంపబడును. తయారయిన అమ్మోనియా బాగుగా శుభ్రపరుపబడును. తరువాత బాష్ (*Bosch*) అమ్మోనియా తయారగు పద్ధతుల నుపయోగించి విరివిగా అమ్మోనియా తయారుచేయబడును. ఇలా తయారయిన అమ్మోనియా ఎరువులకు శ్రేష్ఠమైన అమ్మోనియ గంధకితము $(NH_4)_2 So_4$ లా తయారగుచున్నది. ప్రతి సంవత్సరము 100,000 టన్నుల అమ్మోనియ గంధకితము హిందూదేశ ముపయోగించుచున్నదని 1940 లో హెన్రీ అను నాయన కనుగొనెను. ఇందులో ముప్పాతిక పాళ్లకు పైగా రైతే ఉపయోగించెనని గూడా అంచనా వేయబడినది. దీనిలో చాలా కొద్దిభాగము 18,000 టన్నుల ఎరువు ప్రతి యేడూ బంగాళములోనూ, బీహార్ లోనూ యున్న *Sulphate of Ammonia* ఫెడరేషన్ చే తయారగుచున్నది. మైసూరులో సింథటిక్ అమ్మోనియా తయారగుటకో *plant* నిర్మించబడినది దీనివలన ఇండియాలో కృత్రిమ ఎరువు పరిశ్రమాభివృద్ధి చెందుటకవకాశము కలదు. ఈ *plant* ప్రతి సంవత్సరము 6,000 టన్నుల అమ్మోనియగంధకితము ఇవ్వగలదనియు, ఈ అమ్మోనియ గంధకితము $(NH_4)_2 So_4$ మైసూరులోని చెరకు పొలాలకు సరిపడుననియు 1940 లో *Ghosh* (ఘోష్) అను నాయన తెలియజేశాడు. ఇండియాలోని మరికొందరు శాస్త్రవేత్తలు అమ్మోనియా తయారుచేసి దానిని నత్రికామ్లము (*Nitric acid*) లా మార్చుటయూ సులభముగా విద్యుచ్ఛక్తి, లేదా చౌకగా బొగ్గుదొరకు స్థలములలో వృద్ధిపొందించవచ్చునని తెలుసుకోగలిగారు. 1938 లో ఛటర్జి సింథటిక్ అమ్మోనియాకు, అమ్మోనియ గంధకితమును తయారుచేయు ఓ నూతన ఇండియా పద్ధతుల కుపకరించు విధానాన్ని నెలకొన్నాడు. ఆచార్య (1938) ననుసరించి హిందూదేశములోని బొగ్గుపరిశ్రమ 200,000 టన్నుల అమ్మోనియగంధకితమున కాధారమగు ననియు, కానీ బొగ్గుపరిశ్రమ సక్రమముగా జరపబడుటలేదనియు అందుచే 200,000 టన్నుల అమ్మోనియ గంధకితము (*Ammonium sulphate*) ను బొగ్గు పరిశ్రమనుండి తయారుచేయు పద్ధతి నెలకొల్పవచ్చు ననియు తెలియజేశాడు.

నత్రితములు (Nitrates)

సోడియనత్రితము (*Sodium Nitrate*) మరియొక ఇతరదేశములనుండి హిందూదేశమునకు దిగుమతిచేయబడు కృత్రిమ ఎరువు. కాని హిందూదేశీయ పొటాసియ నత్రితము (*Indian salt peter*) అచ్చటచ్చట ఇండియాలో కనుబడుటచేత సోడియనత్రితపు దిగుమతి క్రమేపీ తగ్గిపోయినది. పొటాసియనత్రితము పొటాసియ నత్రితముతోకూడిన మన్నను ఎరువులా వుపయోగించబడుచున్నది కొన్ని ప్రదేశాలలో.

కాల్సియము సయనమైడు పద్ధతి—వాతావరణపు నత్రజనిని ఎరువులా తయారుచేయుట 1898 లోనే కనుగొనబడినది. కానీ 1906 లో మాత్రమే ఇటలీలో పియానో డి ఆర్టో అనుచోట పరిశ్రమాభివృద్ధికి తగిన ఫ్యాక్టరీ నిర్మింపబడినది. ఇచ్చట 1,500,000 టన్నులదాకా తయారగుచున్న దేటేట ప్రపంచములోకల్లా చాలా పెద్ద ఫ్యాక్టరీ కెనడా వేపుయున్న నయాగరీ జలపాతపు సమీపములో యున్నది. సయనమైడు ఇలా తయారుచేయబడును 2000 °F కు వేడిచేయబడిన కాల్సియ కర్బనిదము (*Calcium Carbide*) పై శుభ్రపరుపబడిన నత్రజని పంపబడును. ఈ ఉష్ణము రెండు కర్బనపు కడ్డీల మధ్య ఏర్పరుపబడిన *Electric Spark* చే వచ్చును రసాయనమార్పు జరిగినతరువాత వచ్చు పదార్థము చల్లార్చబడును. రసాయనమార్పు చెందని కాల్సియకర్బనిదము నీటిచే తీసివేయబడును దుమ్ముకణములనుండి రక్షించుటకీ పదార్థమునకు నూనె కలుపబడును. ఎరువులా నుపయోగింపబడు సయనమైడు ఈ క్రింది నిష్పత్తిలో యుండును

కాల్సియం సయనమైడు	63%
కాల్సియం హైడ్రాక్సైడు	17%
కర్బనము	12%
సున్నపురాయి (మలినములు)	4%

భూమిలో కలుపబడినపుడు కాల్సియము సయనమైడు, కాల్సియం హైడ్రాక్సైడుగను, యూరియా (*Urea*) గను మార్చబడును. ఒక యకరమునకు 1,000 పౌనుల సయనమైడుపయోగించిన అనవసరమైన మొక్కలు కలుపుతీయ నవసరములేకయే చనిపోవును. కానీ ఈ రకపు ఎరువు చాలా కొద్దిగమాత్రమే ఇండియాలో వుపయోగించబడుచున్నది. ఇప్పుడు హిందూదేశము సయనమైడు తయారుచేయుట లేదు మరియు తయారుచేయుటకు చాలా కొద్ది అవకాశములు మాత్రమే కల వీ దేశమున

భాస్వరితములు (Phosphates)

భాస్వరితములు చాలా తక్కువగా నీటిలో కరుగుటవలన వాటిని భూమికిమిగత ఇతర ఎరువులకన్న ఎక్కువ కలుపవలెను. ముఖ్యమయిన *Phosphate ore* కాల్సియము ఫాస్ఫేటు, ప్రపంచమంతటను అచ్చటచ్చట కాల్సియ భాస్వరితము కనుగొనబడుచున్నది. ఈపరిశ్రమలో పేర్కెక్కిన ఇప్పటి ముఖ్యమయిన దేశములలో ఈ క్రిందివి లెక్కవేయవచ్చును- ఫ్లోరిడా, దక్షిణ కెరోలీనా, టెనెసి, ఆల్జీరియా, మరియు క్రిస్మస్ దీవులు. భాస్వరము, నత్రజనియును కలసియుండుటచే భాస్వరిత ఎరువులు ముఖ్యమయినవిగా పరిగణించబడుచున్నవి.

సూపరు (Super Phosphate)

ఇదియును ఇండియాలో ముఖ్యముగా నుపయోగింపబడు ఎరువులలో నొకటి. చాలా ఏండ్లనుండి 7,000 టన్నుల ఈ రకపు ఎరువులు ఇంగ్లండునుండి ఇండియాలో ప్రతియేడూ దిగుమతి యగుచున్నది. ఓ 2000 టన్నుల ఎరువుమాత్రము ప్రతియేడూ '*Messrs Parry & Co* మదరాసు' చే తయారుకాబడుచున్నది. ప్రస్తుతము హిందూదేశములో సూపరు తయారుచేయు ఫ్యాక్టరీ ఇదియొక్కటే. సూపరు ఎముకలనుండి తయారుకాబడుచున్నది. హిందూదేశములో సూపరు తయారుచేయుటకు చాలా అవకాశము లున్నవి. మదరాసులోను, బీహారులోనూ స్వభావసిద్ధపు భాస్వరితములు (*Natural Phosphates*) *Royal Commission of Agriculture* వారు 1928 లో కనుగొనిరి. బొంబాయి, మదరాసు, బంగాళము, సంయుక్తరాష్ట్రములలోని మిల్లులు ఎముకపొడి తయారుచేయుచున్నవి.

హిందూదేశపు భూములు చాలావరకూ పొటాసియ పదార్థములలో ధనవంతము లవుటచే తపొటాసియ ఎరువుల ఖర్చు చాలా తక్కువ మన దేశములో.

ఈ విధముగా వ్యావసాయికములైన పనులు చాలావరకూ రసాయనికపరిశ్రమలపై ఆధారపడియున్నవి. ఎరువుల వుపయోగము నానాటికి పెరుగుచున్నది. ధరలు తగ్గుచున్నవి. మరియు క్రొత్త క్రొత్త పద్ధతులతో తయారగుచున్నవి కృత్రిమ ఎరువులు. అందుచే ఎక్కువ శ్రద్ధ వహించి యిలాంటి దేశాభ్యుదయానికిన్నీ, జాత్యభ్యున్నతికిన్నీ అనేకవిధముల తోడ్పడు పరిశ్రమలను ప్రోత్సహించిన ఇండియాగూడా గొప్ప దవుటకే మాత్రము వెనుకంజ వేయలేదు, వేయబోదు, వేయజాలదు.

భాషాశాస్త్రజ్ఞుడు - వైయాకరణి

శ్రీ నిష్ఠల సీతారామస్వామి

మన భాషా మహానది యేనాడు లేఖనపారణయోగ్యమయి నామరూపములతో నేనాటనేర్పడియెనో కాని, నాడు మొదలు కాలభేదములచే తీసిపోక నానాటికి నప్రతిహతమై వెల్లివిరిసి పెరిగిపోవుచున్నది అట్లు కూలంకషముగ ప్రవహించు భాషాస్రోతస్విలిని మఱింత యుద్ధృతముగ జేయుటకు తగిన క్రొత్తమార్గము లేర్పఱచి సర్వతోముఖముగ పాఱించుటకు పాటుపడువాడు భాషాశాస్త్రవేత్త.

ప్రవాహవేగము వలన భాషానదిలో కొట్టుకొని వచ్చిన దుశ్శబ్దమాలిన్యమును పరిహరించి విశ్వతోవ్యాప్తికొఱకు కొన్ని కాలువలను నిర్మింపచేసి - కాలభేదముచే పొంగి పొరలి వచ్చెడి దుశ్శబ్దము నే బురదవలన భాషానది కలుషితము కాకుండ నిబంధనా యంత్రముల చేత నెప్పటికప్పుడు విమలీకరించుచు తనచే రక్షింపబడుచున్న భాషానదిలోని ఉదకమునే బుధజను లుపయోగించుకొఱకు జీవితమును ధారపోయువాడు వైయాకరణి.

కాలువలు - వరదలు - వాగులు - గుంటలు వంటి ప్రబంధ, పురాణ, శతక, గేయ గ్రామ్య వాఙ్మయముల నెల్ల కలిపి కలగాపులగము చేసి విశాలభూమిలో విస్తరింపచేయుటకు ప్రతినిత్యం వాఙ్మయమును దాని పుట్టుపూర్వోత్తర చరిత్రలను శోధించి కల్పించి విస్తరింపించి నిత్య సమృద్ధము జేయుటకు యత్నించుట భాషా శాస్త్రజ్ఞుని నైసర్గికలక్షణము

నానామూలలనుండి త్రోవ యేర్పఱచుకొని వచ్చి చేరిపోవుచున్న దేశీయ గ్రాంధిక గ్రామ్య వాఙ్మయపు ప్రవాహములనుండి భాషకు వేలువేలు స్థానములను (నిబంధనలను) యేర్పఱచి కాపాడుచుండుటకు ప్రతిక్షణము పాటుపడుట వైయాకరణికి జన్మలక్షణము.

"భాష మహాప్రవాహము. అది పాఱి తనంతట తానే కొంతకాలమునకు స్వతో నిర్మలత్వమును పొందును. కాబట్టి దాని నైర్మల్యమునకు యత్నించి వాక్కులనే నీరమును వేఱుపఱచి భాషను క్లుప్తపఱచరాదు. బహు భాషా పదములనే వరదలు వచ్చి కలియుటవలన భాషకు మఱింత యభ్యున్నతి కూలంకషత్వము నేర్పడు" నని భాషాశాస్త్రము నెఱిగిన వాని తలంపు.

"బహుభాషా పదములు కలియుటవలన భాష దుష్టమయి స్వతస్స్థితిని కోల్పోవును కావున, నెప్పటికప్పుడు భాష కొక నిర్ణీతస్థాన మేర్పఱచి యుంచవలె" నని వైయాకరణి యాశయము.

కాగా వీరిద్దఱిని భాషాదేవి యంగరక్షకులుగా నెఱుంగవలెను. ఇఱువురిలో నెవరిది సముచిత మతమో నిర్ణయించుట కష్టతరము.

కాలభేదముచేతను, పలుకుబడిచేతను నాగరికతచేతను వెనుకటి శబ్దములే శతాబ్దములు గడచుకొలది మారిపోవుచుండును. చిత్రతరములయిన శబ్దములు వచ్చి చేరుచుండును. వెనుకటి పదములచే భాషాదేవి కొక శోభ కలదు. కాలప్రవాహమున కొట్టుకొనివచ్చి పలుపర్యాయము లుచ్చరింపబడిన నేటి శబ్దసముదాయముచేత నొక వింత శోభ కలుగుచున్నది. మఱికొన్ని శతాబ్దముల నాటి భాషకు వేఱొక శోభ కలుగగలదు. కాన, భాషను బంధింపర్హాదను భాషాశాస్త్రజ్ఞుడు మాన్యుడు. వెనుకటి భాషకు నేటి భాషకు చాల భేదము కనబడుచుండుటవలన మరికొన్ని శతాబ్దములనాటి భాషకు నేటి భాషకు మిక్కిలి వ్యత్యాస ముండుననుట తేటతెల్లము; నిర్వివాదముకూడను. మన పూర్వులు వాడిన కొన్ని పదములు అసలు మన భాషాపదములేనా యని నేడు సందేహింపబడుచున్నవికదా! ఇట్టి సందియమునకు బీజము లేకుండజేసి భాషను నిరోధించి వ్యాకరించి స్వతస్స్థితిని పోనీయక నిల్పపాటుపడు వైయాకరణియు - మన కుపకారియే.

ఒకరిది వ్యాపారపు టూహ. రెండవవానిది పిత్రార్జితరక్షణము చేయువాని పాటు.

ఒకడప్రతిహతముగ ముందుకు పోనిచ్చును. రెండవవాడు వెన్నంటి కాపాడి వెనుకకు మరల్చుచుండును. ఒకనిది సమబుద్ధి. వేఱొకనిది యుచితానుచితస్థాననిర్ణయశక్తి. ఒకడు విమర్శనా పాటవము గల మేధావి. ఇంకొకడు తప్పొప్పుల దిద్దు పరీక్షాధికారి.

వీరి యన్యోన్య తారతమ్య పరీక్ష చేయుచో నొకరిని మించిన గొప్పదన మొకరికి విస్పష్టమగుచుండును.

కావున విమర్శకుల నిర్ణయానిర్ణయములతో నిమిత్తములేకుండ నుభయులకు సమానప్రతిపత్తి సహజముగనే యొప్పుచున్నది.

ఇండోనీసియా సమస్యపై భద్రతామండలి తీర్మానం

భద్రతామండలిలో ఇండోనీషియాపై నాల్గు రాజ్యాలవారు ప్రవేశపెట్టిన తీర్మానం, క్లాజువారీగా ఆమోదించబడింది. తీర్మానంలో ముఖ్యాంగాలివి వెంటనే యుద్ధం ఆపుచేయటం ఇండోనీషియా రిపబ్లిక్ నాయకులను విడుదల చేసి, జోగ్జాకార్తామండలంలో స్వేచ్ఛగా వాళ్ళ వ్యవహారాలు వాళ్ళు చూసుకొనే అవకాశము ఇయ్యటం. ఈమార్చి 15 లోగా ఇండోనీషియాలో తాత్కాలిక ఫెడరల్ ప్రభుత్వస్థాపనార్థము, ఐక్యరాజ్యసమితి ఉపసంఘాని కొకదానికి సర్వాధికారాలను భద్రతామండలి ఇచ్చింది. అక్టోబరు మొదటితేదీ ఎన్నికలు జరిపించాలనీ, 1950 జులై ఒకటవ తేదీకి, ఇండోనీషియా సంయుక్తరాష్ట్ర ప్రభుత్వానికి సర్వాధికారాలు దత్తమొనరించాలని భద్రతామండలి తీర్మానం సూచించింది.

ఈ తీర్మానానికి ఈజిప్టు అర్జెంటినా ప్రతినిధులు తమ ప్రభుత్వాల ప్రోత్సాహాన్ని వెలుపర్చారు. రష్యన్ ప్రతినిధి, తీర్మాన పూర్తిపాఠాన్ని విమర్శిస్తూ, వెంటనే డచ్చిసైన్యాలు, ఇండోనీషియాలో రెన్విల్ ఒడంబడికనాడున్న స్థానాలకు ఉపసంహరింపబడాలని సవరణ ప్రతిపాదించాడు. అట్టి మార్పు లేనంతకాలం, భద్రతాసంఘం దౌర్జన్యాలకు తమ ఆశీర్వాదం చేకూరుస్తున్నట్లే అని విమర్శించాడు కాని సవరణ వీగిపోయింది

డచ్చి ప్రతినిధి డాక్టరు వాన్ రాయిన్ తీర్మానాన్ని ఉగ్రంగా ఖండించాడు తీర్మానం విషయంలో తన ప్రభుత్వానికుండే ప్రాతికూల్యాలన్నీ వరుసగా వివరించాడు

అసలు ఇంత తీవ్రమైన విధానాలను పరుల విషయంలో సూచిస్తూ, ఇతరుల ఆంతరంగిక విషయాల్లో ఇల్లా జోక్యం కల్గించుకోటం, ఐక్యరాజ్య పత్రం పుట్టించిన జాతు లేవీ ఒప్పుకోటానిక వీలులేదన్నాడు

"ఏ ఉద్దేశముతో భద్రతాసంఘం ఈ తీర్మానం చేయనున్నదో, ఆ తీర్మానం వల్ల ఆ ఉద్దేశమే మొదలంట భంగపడి తద్విపరీత ఫలితమే సంభవిస్తుంది. ఈ తీర్మానం విషయంలో నెదర్లెండు ప్రభుత్వానికున్న ముఖ్య అభ్యంతరాలివి

(1) జోగ్జాకర్తాలో రిపబ్లికన్ ప్రభుత్వం పునరుద్ధరణ గానియ్యటం డచ్చివారు ఒప్పుకోరు.

(2) తాత్కాలిక సంయుక్తప్రభుత్వం ఏర్పరచటానికీ, ఎన్నికలు మొదలైనవి జరపటాకీని, ప్రభుత్వ అధికారాలను దత్తం చెయ్యటానికీ వలసిన సర్వాధికారాలు, ఇండోనీషియా సంఘమంటూ, వేరొకరికో అప్పచెప్పటం డచ్చి ప్రభుత్వం ఒప్పుకోదు.

(3) ఆ కమిషన్లో కూడా మెజారిటీ పక్షం అధికారం ఉండటంకూడా తాము ఒప్పుకోరు.

(4) రిపబ్లికన్ ప్రభుత్వానికి కొన్నికొన్ని ప్రదేశాలను అప్పచెప్పడం, డచ్చి సైన్యాల నుపసంహరించటం, మొదలైన విషయాల్లో, భద్రతామండలికి సూచనలు చేసే అధికారాలను ఈ సంఘానికే ఇయ్యడంకూడా డచ్చిప్రభుత్వానికి అసమ్మతం అసలు ఇతరుల ఆంతరంగిక వ్యవహారాల్లో, అధికజోక్యం కల్గించుకోటానికి ఇంతకన్నా వేరే నిదర్శన ముండబోదు ఇండోనీషియా స్వాతంత్ర్యార్హతను మేము గుర్తించాం, ప్రకటించాం. కాని ఇండోనీషియా అంటే రిపబ్లిక్కే అనుకొనే దుర్భ్రమలో ఈ రాజ్యాలవారు పడకూడదని హెచ్చరిక. ఆగ్నేయ ఆసియాలోని వ్యవహారాలు మేము గమనించనంతటి మూఢులం కాము. వారి సహకార సౌహార్దాలు మాకు కావాలి. ఢిల్లీలో జరిగిన సభను గమనించాము. మేము కాలాన్ని వెనక్కి తిప్పి అంధయుగాలముఖంగా నడుస్తున్నామనటోటం పొరపాటు మేం చెయ్యవలసిన పనిని ఇంకో సంఘానికి భద్రతామండలి అప్పచెప్పతోంది. 1595 నాటినుంచీ డచ్చివారం ఇండోనీషియాలో ఉన్నాము తీరా ఇప్పుడీ ఆఖరి క్షణాన్ని అధికారదత్త మొనర్చే భాగ్యమంతా మాకు కాకుండాచేసి, ఇతరుల ఇష్టం వచ్చినట్లు ఇతరులు చేసే అధికారాలను, మరొకరు వారి కప్పచెప్పటం మే మెంతమాత్రం సహించము మా ఇష్టంలేకుండా ఈ తీర్మానాన్ని ఇల్లా భద్రతామండలి చేస్తే, రాబోయే దుష్ఫలితాలన్నిటకీ మండలి బాధ్యత వహించవలసివస్తుంది". అంటూ అనేకవిషయాలు వివరిస్తూ డాక్టరు వాన్ రాయిన్, దీర్ఘోపన్యాసంతో భద్రతామండలిని బెదిరింపమాశాడు ఆ సభకు నాయకత్వంవహించిన ఇండియా, హైదరాబాద్ విషయంలో "పోలీసుచర్య పేరిట" దౌర్జన్యయుతంగా ప్రవర్తించిందంటూ, కరాచీనుంచి ఒక లేఖను ఉదాహరిస్తూ, హైదరాబాద్ ఈనాడు భారతప్రభుత్వ దౌర్జన్యం క్రింద మైనారిటీలకు నరకప్రాయంగా మారిపోయిందంటూ, నిందారోపణలు సాగించాడు. తమ విధానమే అవలంబిస్తే ఇప్పుడు డచ్చివారిని, ఇండియా ఎందుకు ఖండిస్తూందో తనకు ఆశ్చర్యంగా ఉందన్నాడు.

ఇండియా ప్రతినిధి గోపాలస్వామి ఒక్క మాటలో డచ్చివారికి జవాబిచ్చారు హైదరాబాదులో ఏంజరుగుతూందో ప్రపంచంలో ఎవరైనా సరే ఏక్షణాన్నపడితే ఆ క్షణాన్నివచ్చి స్వయంగా చూసి అర్థంచేసుకోవచ్చు లేనిపోని ఆరోపణలతో పనిలేదు ఆమాత్రం బాహాటంగా, డచ్చి దురాక్రమణలోకి వచ్చిన ఇండోనీషియాలోకి, వచ్చి పైవాళ్ళు చూడటానికి అనుగ్రహించగలిగితే అదే పదివేలని జవాబు చెప్పాడు.

ఉన్న ప్రతినిధులతో క్లాజువారీగా తీర్మానం మీద ఓటింగు పెడితే ఏడెనిమిది వోట్ల చొప్పున మెజారిటీ వచ్చి, క్లాజులన్నీ ఆమోదింపబడటంతో, తీర్మానానికి సంపూర్ణామోదంగా అధ్యక్షుడు అంగీకరించాడు.

మరి ఈ తీర్మానంపై డచ్చివారు ఏం చేయనున్నారంటే, డాక్టర్ వాన్ రాయన్ ఇదమిత్థమని ఏమీ చెప్పలేదు భద్రతా సంఘం తీర్మానాలను అనుసరించడానికి మాశాయశక్తులా చూస్తాము అనిమాత్రము అన్నాడు. ఇండోనీషియా ప్రతినిధి పాలారు ఈ తీర్మానం ఫలించడమూ, ఫలించకపోవటము డచ్చివారు దాన్ని అనుసరించటాన్నిబట్టే ఉంటుందంటే, నాటి భద్రతాసంఘంలో డచ్చి ధోరణి చూస్తే ఈ తీర్మానానికి, మునుపటి తీర్మానాలగతే పటుతుందని అనుమానంగా ఉందనే అన్నాడు. నయాన పనులు జరిగే సానుకూలత ఇంకా ఇండోనీషియా సమస్య విషయంలో సమకూరలేదు

ఆసియారాజ్యాల మహాసభ

(5-వ పేజీ తరువాయి)

ఒకటి ఆర్థికముగా, సైనికముగా సహాయముచేసి, ఆయాదేశములను తన ఆధిపత్యంక్రిందకు తెచ్చుకోవలనని ప్రయత్నించుచున్నది. వేరొకటి, ఆయాదేశములలో తన కనుకూలమైన శక్తులను పురికొల్పి ప్రభుత్వములను కూలద్రోసి, ఆయాదేశములను, తన ప్రాబల్యముక్రిందకు తెచ్చుకొనుచున్నది, ఆగ్నేయ ఆసియాలో కమ్యూనిజం ప్రజ్వరిల్లుట, చైనా కమ్యూనిస్టుల పాదాక్రాంతమగుట ప్రత్యక్షముగా కన్పడుచున్నది

అటు సామ్రాజ్యతత్వమును, యిటు కమ్యూనిజమును ద్వేషించే ఆసియారాజ్యములు యీ ద్వివిధకూటమి సంఘర్షణలో తామెక్కడ నలిగిపోవలసివచ్చునో అని భయపడుట సహజము. కనుక చిన్న చిన్న ఆసియారాజ్యములన్నీ తమలో పెద్దగానున్న ఒక రాజ్యమును ఆసరాగా చేసుకొని ఒక కూటమిగా యేర్పడితేనే నిలువగలమని ప్రతి ఒక ఆసియారాజ్యమునకు తోచినది. ద్వితీయ ప్రపంచ సంగ్రామంతో, అంతవరకూ పశ్చిమరాజ్యములతో దీటుగానున్న జపాను అస్తమించినది. చైనా అంతర్యుద్ధంతో చివికి జీర్ణించి, కమ్యూనిస్టు పాదాక్రాంతమైనది. పోగా ఆసియాఖండంలో, యిప్పుడు స్వతంత్ర ప్రతిపత్తితో అన్నివిధముల అగ్రరాజ్య మనదగిన భారతదేశమే, ఆసియారాజ్యములకు ఆలంబనయైనది

ఈ వాతావరణంలో ఇండోనీషియా సమస్యా పరిశీలన మిషతో తామంతా ఒక్కచో కలియు అవకాశము, తమ సంకల్పసిద్ధికి ప్రయత్నించుటకు తగిన అదను ఆసియారాజ్యములకు లభించింది ఆసియారాజ్యములకు యీ దృఢసంకల్ప మున్నట్లు, ప్రతినిధుల ప్రసంగములలో స్పష్టమయ్యెను. ఈ సంకల్పసిద్ధికి ప్రయత్నమే మహాసభ ఆమోదించిన మూడవ తీర్మానం.

మహాసభలో పాల్గొనుటకు కొన్నిరాజ్యములు స్వప్రయోజనమును ఆశించి వచ్చినవి. ఉదాహరణకు అరబ్ రాజ్యములు. పాలస్తీనా వ్యవహారంలో, ఆసియారాజ్యములన్నీ సమైక్యతతో, తమకు అనుకూలముగా వ్యవహరించునని, ఆశపెట్టుకొని మహాసభలో పాల్గొనుటకు వచ్చినట్లు, మొన్న న్యూఢిల్లీలో అరబ్ అధిష్ఠాన సంఘప్రతినిధి ఇసానక్లే పత్రికా విలేఖరుల సమావేశంలోచేసిన ప్రసంగమునుబట్టి స్పష్టమగుచున్నది. ఏ సంకల్పములను మనస్సులో బెట్టుకొని, ఏ ప్రయోజనములను ఆశించి ఆయారాజ్యములు, యీ మహాసభలో పాల్గొన్నప్పటికీ, ఇది ఒక చరిత్రాత్మక మహాసభ. శతాబ్దముల తరబడి తా ననుభవించిన బానిసత్వమునూ, వర్తమాన దీనస్థితిని గ్రహించుకొని, ఆసియాఖండము జాగ్రుతమైనది. తన దీనావస్థకు, సామ్రాజ్యతత్వమే కారణమని, దాని నిర్మూలనకు బద్ధకంకణురాలైనది. సిలిప్పైన్ ప్రతినిధి రోములో మాటలలో చెప్పవలెనంటే, "ఆసియా నవశక్తి, ఆసియా సమైక్యత మహాసభద్వారా ప్రపంచమునకు ప్రదర్శితమైనది. ఈ మహాసభాపర్యవసానముగా, బలవత్తరమైన, అశేషప్రాధాన్యము గల ఒక రాజకీయ మహాశక్తి సముద్భవించినది. మానవజాతికి శాంతి, స్వాతంత్ర్యము, అభ్యుదయము సమకూర్చునట్టి సమగ్రమైన విధానమును రూపొందించగలుగునదీ మహాశక్తి. ఆసియారాజ్యములమధ్య రాజకీయముగా పరస్పర సహకారము, యింతవరకూ స్వప్నమాత్రగము గోచరించినదూ, యిప్పుడు వాస్తవికమైనది.

శ్రీ పి. యస్. ప్రకాశరావు.


లేఖలు

రామపాదసాగర్ ప్రాజెక్టును వెనుకకు పెట్టుట భావ్యం కాదు

అయ్యా,

యిటీవల కొన్నిసంవత్సరములనుంచి యావద్భారతదేశమునకున్నూ అందు ముఖ్యముగా ఆంధ్రదేశమునకున్నూ మాణిక్యమై విరాజిల్లునని ఉవ్విళ్లూరుచున్న రామపాదసాగర్ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములవారు వెనుకపెట్టిన సూచనలు అనగా నెం 2 వ డివిజను ఎత్తివేయుటయు ఫిబ్రవరినెలలో మరొక Canals డివిజన్, సర్కిలు ఎత్తివేయుచుండుటవల్లను ప్రజలలో అమిత నిరుత్సాహం జనించునున్నది. యింతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములు తమ్ము కలవరపెట్టుచున్నవని సాకుగా చెప్పుచున్న హైదరాబాద్ సమస్యయున్నూ, కాశ్మీర్ సమస్యయున్నూ తీరిపోయినవని చెప్పవచ్చును. కాశ్మీరు సమశ్య తీరిపోవుటవల్ల భారతప్రభుత్వమునకు దినము 1 కి 25 లక్షల రూపాయిలు ఖర్చు తగ్గిపోయినది. కాందిశీకుల సమస్యలోకూడ గత రెండుసంవత్సరములుగా వున్న వొత్తిడి యీనాడు లేదు నిపుణులు యీ నిర్మాణం సులభసాధ్య మని నొక్కి వక్కాణించిచున్నారు. యీప్రాజెక్టు నిర్మాణమునకు వసతులు వగైరా ప్రిలిమినరీలు ముందుగా చాల చేయవలసియున్నది. అవి పూర్తిచేయుటకు కనీసం రెండు సంవత్సరములకాలం పట్టును యీ ప్రిలిమినరీలు పూర్తిచేయుటకు రెండు మూడు డివిజన్లకన్న ఎక్కువ నిపుణులు అక్కరలేదు. యివి పూర్తిచేయుటకు యీ రెండుసంవత్సరముల కాలములో ఒకటి రెండుకోట్ల రూపాయలు చాల వచ్చును. యీపనికి అమెరికన్ డాలర్ల ప్రసక్తి లేదు. భారతప్రధాని పండిట్ నెహ్రూగారు అనేక సందర్భములలో భారతదేశం స్వయం సమృద్ధము మాత్రమేగాక అధికాహారోత్పత్తి అనతికాలములో చేసుకోవలసియున్నదని నొక్కి వక్కాణించుచున్నారు డామునిర్మాణం జరుగుచుండిన కాలములోనే యిప్పటి కప్పుడు నీరు నిలుపుదల పెరుగుచుండెడి కార్యంచేత నిర్మాణ మధ్యకాలంనుండే యీ ప్రాజెక్టువలన అధికాహారోత్పత్తి జరుగగలదు. ప్రాంతీయాభిమానములు గాని అన్యప్రాంతద్వేషములు గాని కూడదని పదేపదే నొక్కి చెప్పుచున్న మన నాయకులు ప్రభుత్వం యీ నిర్మాణమునకు కావలసిన ప్రిలిమినరీలు వెన్వెంటనే జరిపించక ఆలశ్యం చేయుటలోని అంతరార్థం ఏమో తెలియకున్నది. రాజ్యాంగపరిషత్తు కేంద్ర, రాష్ట్రశాసనసభలలోని ఆంధ్రమంత్రులు, మెంబర్లు యికముందైననూ తగు శ్రద్ధబూని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములవారి యీ బడ్జెట్టులోనైననూ కనీసం ఒకటి రెండు కోట్లరూపాయలు వెంటనే మంజూరుచేయించి ప్రిలిమినరీలు జర్పించుటకు తగు దోహదం చేయించగలందులకు ప్రజలచే కోరబడుచున్నారు.

కేశవరపు సత్యనారాయణరావు ప్లీడరు,
పోలవరం,



రాష్ట్రపతి డాక్టరు పట్టాభిగారు స్వగ్రామమగు గుండుగొలను సభలో ఉపన్యసిస్తున్న దృశ్యం.

కులాసా కబుర్లు

కోడరికం - ఇల్లరికం

శ్రీ జి. యస్. సూరి

ఐక్యరాజ్యసమితిలో చర్చించే విషయాల కంటె, సమితి ఉపసంఘాలలో జరిగే చర్చలు రసవంతంగా ఉంటున్నవి. న్యాయవ్యవహారాలను విచారించే ఉపసంఘంలో ఈ మధ్య చిత్రమైన వాగ్వివాదం తటస్థించింది. అమ్మాయిని అత్తవారింటికి పంపవలసిన బాధ్యత పుట్టింటివాళ్లమైన ఉన్నదా, లేదా అనే విషయాన్ని తేల్చవలసివచ్చింది. యథాప్రకారం, ఒక ముఠావాళ్లు ఔనన్నదానికి రెండవముఠావాళ్లు కాదన్నారు. తర్జనభర్జనలు జరిగి, క్రిందామీదా పడి, ఏమీ తోచక భట్టిప్రోలు పంచాయితీ చేశారు.

ఈ ఉపసంఘం ఒక కోర్టులాంటిది. వేరువేరు దేశాలలో ఉన్న పార్టీల వ్యవహారాలు ఇక్కడ పరిష్కారంచేయటానికి ప్రయత్నిస్తారు. దేశాలకు దేశాలకు ఉండే తగాదాలు అసలు సమితిలో ఎంత పరిష్కారమవుతున్నవో వ్యక్తిగతమైన తగాదాలు కూడ అంతే అవుతూ ఉంటాయి. ప్రస్తుత వ్యవహారంలో వాది లూయీ్త్రుజకెంపా అనే ఛిలీదేశస్థుడు. ప్రతివాది రష్యనుప్రభుత్వం. దక్షిణ అమెరికాలో ఒక దేశం ఛిలీ. వాదిగారు ఈ దేశం తరఫున కొంతకాలం రష్యాలో రాయబారిగా ఉండేవాడు. అక్కడికి తాను ఒక్కడే వెళ్లిఉంటే ఏ గొడవాలేకపోయేది. కాని సకుటుంబ బంధుమిత్రపరివారంతో వెంచేశాడు. ఈయనగారికి మెరికలాంటి కుమారరత్నం ఒకడున్నాడు. తండ్రిచాటు బిడ్డకావటాన హుషారుగా సంచరిస్తూఉండేవాడు. అడవి ఆమలకం, అంబుధి లవణం ఒకచోటికి చేరినట్లు చిచింద్రీలాంటి రష్యను కుఱ్ఱది తారసిల్లింది. చూపులు కలవటం, మనసుపడడం, భార్యాభర్తలు కావటం, అన్నీ గుక్కతిప్పుకోకుండా జరిగిపోయినవి వృద్ధరాయబారిగారికి వృత్తాంతం తెలిసేప్పటికి అన్నీ పూర్తిఅయినవి.

అమ్మాయికి అబ్బాయికి పెండ్లి కాగానే కథ కంచికెళ్లి మనం ఇంటికి రావలసి ఉంటుంది. ఈ విషయంలోమాత్రం అంతా తారుమారుఅయింది రాయబారిగారు ఉద్యోగం విరమించి స్వదేశానికి బయలుదేరవలసి వచ్చింది. ఆయనవెంబడి పుత్రుడు కూడ ప్రయాణం కట్టాడు. విమానం ఎక్కే సమయానికి ఊరవులు లెక్కచూస్తే ఒకటి తక్కువయింది. పెళ్లికూతురు దిగుబాటు అయింది. టెలిఫోన్లు మోగినవి; కార్లు పరుగెత్తినవి; కాళ్లు తేలిపోయినవి. రష్యను పడుచుమాత్రం గైరుహాజరులోనే ఉండిపోయింది. ఇంతలో ఒక రష్యను ఆఫీసరు అమ్మాయిగారిని వెంబడిపెట్టుకుని విమానందగ్గరకుచేరాడు. కోడలుగారు దేశంవిడిచి రావటానికి రష్యనుప్రభుత్వం అంగీకరించలేదని రాయబారిగారికి తెలియచేశాడు. రాయబారిగారు కుప్పిగంతులు వేసి ఏం చేస్తానో చూడమన్నాడు. ఆఫీసరు సుత్తెకొడవళ్లను ఝుళిపించి కాలయాపన చేస్తే తాముగూడ ఉండిపోవాల్సివస్తుందన్నాడు. అంతమాట అంటావా, చూడు నా తడాఖా అని విమానం ఎక్కాడు రాయబారి. పరివారం అంతా ఆయనను అనుసరించారు కుఱ్ఱజంట పార్టింగ్ సీనును అద్భుతంగా అభినయించారు. ఎన్నాళ్లకో మరి ఎన్నాళ్లకో అన్నారు. వెనక్కు తిరిగి చూస్తూచూస్తూ "పోయెనయ్యో ఇపుడు నను బాసి" అనిపాడుతూ విమానం ఎక్కాడు అబ్బాయి. "పోవుచున్నాడే నా విభుని జీవములను గొని" అని కూనిరాగం తీస్తూ అమ్మాయి మోటారుకారు ఎక్కింది. కథ ఐక్యరాజ్యసమితికి వెళ్లింది. ఉభయపార్టీలు ఎవరి ఇళ్లకు వాళ్ళు పోయినారు.

రాయబారి అమెరికాకు వచ్చి ఊరుకోలేదు. ఐక్యరాజ్యసమితి న్యాయ వ్యవహారసంఘంలో దావా దాఖలుచేశాడు. తాను తనకుమారుడిపవర్ ఆఫ్ అటార్నిపొందిన ఏజంటుననిన్నీ, సదరు కుమారుడు తనతో మాస్కోలో ఉండి ఉన్న కాలంలో ప్రతివాది ప్రభుత్వపు పౌరురాలైన ఫలానాయువతి సమ్మోహనాస్త్రం ప్రయోగించినదనిన్నీ, అందుకు ఫలితంగా వాదికుమారుడు భ్రమసిపోయి సదరు చిన్నదానిని చట్టప్రకారం రిజిస్ట్రారు సాక్షిగా వివాహం చేసుకున్నాడనిన్నీ, అట్టి వివాహం జరిగిన దరిమిలా గృహప్రవేశంకోసం స్వదేశానికి తిరిగి వచ్చినారనిన్నీ, తమతో అత్తవారింటికి ప్రయాణమైన అమ్మాయిని నిర్బంధించి ప్రతివాదులు రానివ్వలేదనిన్నీ, న్యాయరీత్యా భర్తదగ్గరకు భార్య రావలసియుండగా ప్రతివాది ఆటంకపరచియున్నాడనిన్నీ, నోటీసు అందిన వారం దినములలో సదరు అమ్మాయిని అత్తవారింటికి చేర్చవలసిందనీ లాయరునోటీసు ఇచ్చినప్పటికీ లెక్కచెయ్యలేదనిన్నీ, తాము వివాహకాలమందు ప్రేమాతిశయములవల్ల చదివించిన రత్నాలు పొదిగిన స్వర్ణ ఆభరణాలు, పీతాంబరాలు వగైరాలతో తన కోడలును స్వాధీనం చేయవలసిందనిన్నీ—మొదలైన పరిహారాలు కోరుతూ దావా ప్లెయింటు దాఖలు చేశాడు.

డాక్టరు అలెక్సీపాన్లోఫ్ ప్రతివాదుల తరఫున ఆన్సరు పడవేశాడు. ఈ దావా దాఖలు చేయటానికి వాదికి హక్కు లేదనీ, దావాను విచారించటానికి కోర్టుకు ఏవిధమైన అధికారమూ లేదనిన్నీ, ఒక వేళ అట్టి హక్కులుగాని అధికారములుగాని ఉన్నప్పటికీ దావా చెల్లనేరదనిన్నీ, సదరు వివాహం రష్యాదేశంలో జరిగినది కాబట్టి రష్యను న్యాయవిధానానికి బద్ధమై ఉంటున్నదనిన్నీ, ప్రతివాదిదేశంలో స్త్రీలకు పురుషులకు సమాన హక్కులు ఉండుకున్నవనిన్నీ, అందువల్ల భార్యను తన ఇంటికి వచ్చి కాపరం చెయ్యమనడానికి భర్తకు ఎంత అధికారం ఉన్నదో భర్తను తనఇంటికివచ్చి ఏలుకోమనడానికి భార్యకూ అంత అధికారం ఉన్నదనిన్నీ, ఏతత్ అధికారాన్ని పురస్కరించుకుని వాదికుమారుణ్ణి రష్యాకు రావలసిందని అమ్మాయి కోరియున్నదనిన్నీ, ఆవిధంగా అల్లుడుగారు వచ్చేయెడల అతనితో కాపరం చెయ్యటానికి కుఱ్ఱదానికి ఎటువంటి ఆక్షేపణా లేదనిన్నీ, అందుకు వాది ఒప్పుకోనలేదు గాబట్టి అమ్మాయిని స్వాధీనపరచవలసిన అగత్యం లేదనిన్నీ, ప్లయింటు దాఖలా ఆభరణములు వగైరాలు రష్యనుచట్టప్రకారం పొలిమేర దాటరాదనిన్నీ, దావానుఖర్చులతో సహా కొట్టివేయవలసిందనిన్నీ స్టేట్‌మెంటు దాఖలు చేశాడు.

న్యాయమూర్తులు ఉభయవాదాలనువిన్నారు పెద్దపెద్ద పుస్తకాలను తిరగవేశారు. తలపట్లు పట్టుకున్నారు. ఏ పార్టీకి అనుకూలంగా డిక్రీ ఇచ్చినా అమలు జరగడం దుర్లభమని గమనించారు. చివరకు తీర్పుచెప్పారు ఇటువంటి పరిస్థితులలో విడాకులకు తప్ప అవకాశంలేదు కాబట్టి ఇందుమూలంగా ఈ ఖండాంతర వివాహాన్ని రద్దుచేస్తున్నామన్నారు. ఈలాంటి మరొక ముఖ్యవిషయాన్ని పరిష్కరించటానికి ఉడాయించారు.

ఏదో ఇల్లటం పెళ్లిళ్లలో తప్ప సాధారణంగా అత్తవారింట్లో కాపరంచెయ్యటానికి అమ్మాయి రావటం మనకు ఆనవాయితీగా వస్తున్నది భార్య రానంటే తల్లిదండ్రులు బలవంతంగానైనా దిగవిడ్చిపోతారు. వాళ్లూ షరీక్ అయితే కోర్టువారు స్వాధీనంచేసి క్రమమైన రశీదు పొందుతారు. నిజానికి ఈ విధానంలో మొగ్గుయావత్తూ మొగవాడివైపే ఉంటున్నది. అన్ని విషయాలలోను సమానహక్కులకోసం పాటుబడుతున్న మహిళా సంఘాలు ఈ అన్యాయంపట్ల ఇంతవరకూ ఉపేక్షచేయటం ఎంతో శోచనీయం. ఇప్పటికైనా మేల్కొని ఆందోళన బయలుదేరతీస్తారని ఆశింతాం.

(19 వ పేజీ తరువాయి)

"ఏమో నాకు తెలియదండి నన్ను తన భార్యగా, ఎవ్వరికీ చూపించి ఏ సందర్భంలోనూ ఏమీ చెప్పలేదు అప్పటికి నేను బొత్తిగా కుర్రదాన్నండి. నన్ను మోసగించినట్లే, ఇంతకు పూర్వం ఎంతోమందిని మోసగించాడట!"

"శోభనాచలాన్ని పోలీసు లెరుగుదురా?"

"ఉహుం! అతను బలే టక్కరిమనిషి!"

"అన్నట్లు నీపేరు?"

"విశాలాక్షి."

"నిన్నరాత్రికాక, అంతకుపూర్వం, మా తమ్ముడెప్పుడేనా శోభనాచలాన్ని చూశాడా?"

"ఉహుం!"

"అతను నిన్నెట్లా బాధలు పెట్టేవాడో, అనంతానికి చెప్పకున్నావా?"

"చెప్పకున్నాను. మొట్టమొదట శోభనాచలమే మీ తమ్ముడిమీద పడ్డాడు!"

"వాడి మొహంమీద గాయం చూశాలే. నీ దగ్గిరకి, మా తమ్ముడు రావడం, ఎవరేనా చూశారంటావా?"

"ఏమో నాకు తెలియదు. అతనుకూడా ఎవరూ చూడలేదనే అన్నాడు."

"అనంతం ఆ శవాన్ని అక్కడికి మోసుకుపోతూంటే, వీథిలో ఎవరేనా చూశారేమో, వెనకనుండి నీవు వీథి నలుమూలలా పరకాయించి చూశావా?"

"ఈ వీథిలో మట్టుకు ఎవరూ చూడలేదు - నేను చూస్తూనే ఉన్నాను"

"అతను తిరిగి వస్తూన్నప్పుడు కూడా—?"

"ఎవ్వరూ చూడలేదు."

"ప్రొద్దున్నే బైటకు వెడుతూన్నప్పుడు?"

"ఎవ్వరూ చూడలేదనుకుంటాను."

"మీకు పనిమనిషి వుందా?"

"ఉంది కాని, అది ప్రొద్దుటిపూట తొమ్మిది గంటలకి వచ్చి ఓగంటసే పుండి వెళ్లిపోతుంది"

"అనంతాన్ని ఎరుగునా?"

"ఉహుం!"

"స్నేహితు లెవరేనా ఎరుగుదురా?"

"నా కెవ్వరూ లేరు పైగా మీ తమ్మునితో ఉంటూన్నప్పటినుండీ నేను బైటకి రావడం మానేశాను."

"ఎంతకాలంనుండి?"

"ఐదు మాసాలు"

"ఈవేళ నువ్వు బైటకి వెళ్లావా?"

"లేదు."

"ఇంతవరకూ ఏం చేస్తున్నావు?"

"ఏడుస్తున్నాను."

విశాలాక్షి దుఃఖం ఆపుకోలేకపోయింది. "అనంతం అపాయంలో వున్నాడు......నా గురించే! . నాగురించే! నాకేమీ పాలుపోకండా వుంది!" నీలకంఠం సముదాయిస్తూ, "చూడు! విశాలాక్షి! ఏడవకు...ఏమొచ్చినా సరే, ఎప్పటికేనా పలానశవం శోభనాచలానిదనీ, నీకూ, అతనికీ సంబంధం ఉందనీ బైటపడిననాడు, మాతమ్ముడుపేరు బైటపెట్టనని వాగ్దానం చెయ్యగలవా?" అని అడిగాడు.

విశాలాక్షి కళ్లలో ఏదో మెరసినట్లైంది. లేచి కొవ్వొత్తిదీపం దగ్గరకెళ్లి "అనంతం ఇచ్చిన వస్తువులన్నీ అప్పుడే తగలబెట్టేశాను. ఇదిగో! అతని ఫోటోమాత్రం మిగిలింది. ఇది కూడా అంటించివేస్తున్నాను." అని అనంతం పేరుమీదుగా మిగిలిన ఆ చిహ్నాన్ని కూడా వదులుకుంది.

"అట్లా ధైర్యంగా ఉండాలి విశాలాక్షి! ఔను కాని.. నిన్ను పోలీసులు ఎరుగుదురా?"

ఎరగరన్నట్లు ఆమె తల వూపింది. కాని ఆ ప్రశ్నకి విశాలాక్షి చాలా బాధపడింది. నీలకంఠం గ్రహించి "విశాలాక్షి! అటువంటి మోట ప్రశ్న వేసినందుకు ఏమీ అనుకోకు... అనంతంబస నీకు తెలుసునా?"

"తెలుసును."

"ఐతే నువ్వు అక్కడికి వెళ్లడానికి వీలులేదు, అతను ఇక్కడికి రావడానికి వీలులేదు. తెలిసిందా?"

విశాలాక్షి దుఃఖంతో వణికిపోయింది. నీలకంఠానికి చేరువగా వచ్చి లోగొంతులో, "నేను మిమ్మల్ని ఒక్కటే కోరుకుంటున్నాను: అనంతాన్ని మాత్రం నాకు ...దక్కించండి మీరు చెప్పినమాట జవదాటకండానే ఎంతో జాగ్రత్తగా మసలుకుంటాను. అతనికి ముప్పు తెచ్చే ఎటువంటి పని చేయను కాని, అతన్ని అసలు చూడకండా ఉన్నానంటే నేను చచ్చిపోతాను. అతన్ని మాత్రం నాకు దూరం చేయకండి!" అని దీనంగా వేడుకొంది

"అంతా నాకు వదిలేయి! నేను చూస్తానుగా! మీ ఇద్దరూ కల్సుకుందుకు ఏర్పాట్లు నేను చేస్తాను!"

"మా మీద మీకు అంత దయ . .!"

నీలకంఠంపాదాలమీద పడి విశాలాక్షి, కన్నీరు కార్చింది. కిటికీలోంచి, బైటకు చూసి, హఠాత్తుగా "ఎవరో-బైట - ఎవరో చూస్తున్నారు" అని విశాలాక్షి దీపం ఆర్పేసింది.

దీపం ఆర్పిందో లేదో తలుపు తట్టిన చప్పుడైంది. గజగజ వణికిపోతూ విశాలాక్షి గది మూల నక్కింది. నీలకంఠంకూడా కొంత భయపడ్డాడు ఎవరై వుంటారు? ఇక్కడికి అనంతం తప్ప, వేరెవ్వరూ రారని విశాలాక్షి చెప్పిందే! ఐతే, ఈతలుపు తట్టుతూన్నవారెవరు? దూరాన్నుంచి విశాలాక్షి, రహస్యంగా, అనంతం కాదు గదా?" అని, తలుపుతెరచి." ఎవరు బాబు?" అని అడిగింది.

"బైటతలుపు తెరచి ఉంది. చీకటి పడగానే మూసుకోవాలని తెలియదూ?"

నీలకంఠం, గొంతుకపట్టి, దారిలో తాను కలుసుకున్న పోలీసువాడని గుర్తుపట్టాడు.


"మర్చిపోయాను, వేసుకుంటాలెండి!" అని విశాలాక్షి సమాధానం ఈయగానే, పోలీసువాడు ఈల వేసుకుంటూ వెళ్లిపోయాడు.

నీలకంఠంకూడా వెళ్లడానికి నిలబడి, "విశాలాక్షి! మరి నేను వెడతాను. ఒకటి మాత్రం జ్ఞాపకం వుంచుకో. అనంతం మాత్రం ఇక్కడికి రాకూడదు నువ్వు అక్కడికి వెళ్లకూడదు రేపు మా తమ్ముణ్ణి చూసేందుకు వెడతాను. నీవు చెప్తూన్నంత ప్రేమ నీ కతనిమీద ఉన్నట్లైతే చాలా జాగ్రత్తగా మసలుకోవాలి"

నీలకంఠం వెళ్లిపోయాడు. ఆ పోలీసువాణ్ణి చూడకండా ఉందామని, వీథికుడివైపునకు తిరగవలసింది, ఎడమవైపునకు తిరిగాడు కాని వెనక నుండి యెవరో, "వెడుతున్నారా!..... నమస్కారం బాబయ్యా!" అన్నారు తీరా, నీలకంఠం, ఎవరా అని తిరిగి చూస్తే పోలీసువాడు. నీలకంఠం పరిపరి విధాల ఆలోచించసాగాడు. ఆ పోలీసువాడు తనని వెంబడిస్తున్నాడేమో అనే అనుమానం కల్గింది ఏమైనా సరేనని గబగబా నడిచాడు బారిస్టర్ నీలకంఠం - అర్ధరాత్రివేళ ఒక వేశ్య ఇంటికి వెడుతున్నాడా? నీలకంఠం చాలా బాధపడ్డాడు. 'నా కెందుకీ బెడద! ఎంత నీచంగా ప్రవర్తించి, నా పేరు ప్రఖ్యాతులకి కళంకం తెచ్చిపెట్టే అవనీతికరమైన పని చేశాడో అనంతం!' అని, నీలకంఠం కొదామరెత్తిపోయాడు. ఐనా! బారిస్టరు, విశాలాక్షి దగ్గర కూడా వాఙ్మూలం తీసుకున్నాడుగా! అనంతాన్ని రక్షించే ఉపాయాలు చాలా కనిపించాయి. అనంతాన్ని ఇంకోదేశం పంపేయాలి. ఏ యానామో, పాండుచేరియో పంపేయాలి. అతడిక్కడున్నంతకాలం, నీలకంఠానికి మన స్తిమితముండదు. నీలకంఠం ఆఖరికి, ఇల్లు చేరుకున్నాడు. పడుకుందుకు ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టిందికాదు.

(సశేషము)

వార్తాచిత్రాలు



భారతప్రధాని నెహ్రూ జనవరి 15 న కలకత్తా సమీపాన బారక్పూరువద్ద గంగానది ఒడ్డున ప్రత్యేకంగా నిర్మించిన గాంధీఘట్టానికి ప్రారంభోత్సవం జరుపుతున్న దృశ్యం. ఉపన్యాస వేదికపై పశ్చిమ బెంగాల్ గవర్నర్ కైలాసనాథకట్జూగారు కూర్చొని వున్నారు.



గాంధీమహాత్ముడు మద్రాసు హిందీ ప్రచారసభకు విజయంచేసినప్పటి చిత్రం




తీర్థక్షేత్రం: భారతదేశం వచ్చినవారందరికి రాజఘాట్ వెళ్లి మహాత్ముని సమాధివద్ద భక్త్యంజలుల సమర్పించుట విధియైనది. ఆసియాసభకు ఫిలిప్పైన్సు ప్రతినిధిగా వచ్చిన కార్లాస్ రోములో పుష్పగుచ్ఛము నుంచుచున్న దృశ్యం.

గాంధీ మెమోరియల్ టూర్నమెంటు



ఫైనల్సులో గెలిచిన గుంటూరు హాకీజట్టు.



టెన్నిస్ డబుల్సు విన్నర్సు: మాడభూషి రామచంద్రాచారి, డా. యు. అమరేశ్వరరావు.
రన్నర్సు: రమణశాస్త్రి, యస్. వెంకటేశ్వరరావు.



టెన్నిస్ సింగిల్సు విన్నరు: శ్రీ రమణశాస్త్రి.
రన్నర్సు అప్: డా. యం. అమరేశ్వరరావు.

Regd, M. No 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7, Thambu Chetty St., G. T. Madras.